
661

1949

# ఆంధ్రజ్యోతి

వెల 0—6—0



అశోకవనములో సీత

# నాలుగు భాషలలో

# చందమామ

✶

(తెలుగు) **చందమామ**

విడిసంచిక   సాలుచందా : 4-8-0

**0 - 6 - 0**   రెండేండ్లకు :

(కన్నడ) **చందమామ**

విడిసంచిక   సాలుచందా : 4-8-0

**0 - 6 - 0**   రెండేండ్లకు : 8-0-0

(హిందీ) **చందమామ**

విడిసంచిక   సాలుచందా : 4-8-0

**0 - 6 - 0**   రెండేండ్లకు : 8-0-0

(అరవ) **అంబులిమామ**

విడిసంచిక   సాలుచందా : 4-8-0

**0 - 6 - 0**   రెండేండ్లకు : 8-0-0

చందమామ పబ్లికేషన్స్

పోస్టు బాక్స్ 1686 :: మద్రాస్ - 1

త్వరలో ఆంధ్రదేశపు ముఖ్య కేంద్రాలలో

మద్రాసులో క్రౌన్ & స్టార్ టాకీసులలో

జూన్ 3 తేదీనుంచి ప్రదర్శింప బడుతుంది.



శ్రీ రాజరాజేశ్వరి ఫిలిం కంపెని వారి

# నవజీవనం

(తమిళం)

నాగయ్య, కన్నాంబ, యస్. వరలక్ష్మి, శ్రీరామన్,

టి.ఎ. జయలక్ష్మి, టి.ఆర్. రామచంద్రన్, యల్. నారాయణరావు

డైరెక్షన్ — కె.బి. నాగభూషణం



## డోంగ్రేగారి

### బాలామృతం

బలహీనమైన బిడ్డలకు పుష్టియున్ను, పళ్లు మొలిచేటప్పుడు అయ్యే విరేచనములు నిలిపి, బలమును, ఆరోగ్యము నిచ్చును.

K. T. Dongre & Co. BOMBAY-4

అన్ని తరగతులవారికి
అనువైన పత్రికలు

●

చందమామ (పిల్లలకు)
యువ (విద్యార్థులకు)
ఆంధ్రజ్యోతి (పెద్దలకు)

●

బుక్ స్టా , ..ూ దొరకును.

# గ్యారంటీ స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు

**మాసిపోవు, ఎప్పుడు కాంతిగా నుండును. చౌక, అందమైనవి.**

★

లోటాలు, డబరాలు, టిఫిన్ కారియర్లు, కప్పులు, అడుగుసెట్లు: స్పూన్లు, ప్లేట్లు పచ్చడికిన్నం సెట్లు, జెల్లిగంటెలు, అన్నకుట్టి వగైరా ప్రతియింటికి, హొటలులకు కావలసిన పరికరములన్నియు దొరకును. ఇవి వ్యాపారస్తులందరివద్దదొరకును

I.M.M.C MADRAS

మా షోరూమును సందర్శించండి

●

498, మింట్‌స్ట్రీట్, మద్రాసు - 3

తయారుచేయువారు

**ఇండియన్ మెటల్ & మెటలర్జికల్ కార్పొరేషన్**

498, మింట్‌స్ట్రీట్ :: మద్రాసు - 3

OFFICE OF THE REGISTRAR OF BOOKS
JUN 1949
MADRAS

# జామా ఆయిల్

## సమస్తమయిన నొప్పులకు అమోఘమయిన మందు




మా 'జామా ఆయిల్' ప్రఖ్యాతి చూచి, అనేకమయిన నకలు మందులు బయలుదేరుట వల్ల, ఇప్పుడు మేము పేరుతో వుండే ప్రత్యేక సీసాలను వాడుతున్నాము. అసలయిన 'జామా ఆయిల్' కు ప్రతి బుడ్డిమీదా 'జామా ఆయిల్' అను పేరు ఉండుట గమనించాలి.

మీ కెమిస్టువద్ద ఒక బుడ్డి కొనండి

తయారుచేయువారు:

**అమర్‌చంద్ శోభాచంద్**

కెమిస్టుస్ అండ్ డ్రగ్గిస్టుస్

**95,** నైనియప్పనాయక్ వీధి, : మద్రాసు 3.

---

# పెరుగుచున్న పసిబిడ్డలకు విటోఫెర్రిన్ అత్యవసరం



పసిపాపలకు విటోఫెర్రిన్ ఇచ్చి, వారి పెరుగుదలను గమనించండి. పెరుగుచుండు పాపాయిలకును, వ్యాధుల నుండి తేరుకొనుచుండువారికిని, శరీరాభివృద్ధికి అత్యవసరమగు వస్తువిశేషాలు ఇందులో ఉన్నవి.

I·T·L

తయారుచేయువారు:
ది మైసూర్ ఇండస్ట్రియల్ & టెస్టింగ్ లాబొరేటరీ లిమిటెడ్,
మల్లేశ్వరం, బెంగుళూరు.

విక్రయ ప్రతినిధులు: బెస్ట్ & కంపెనీ, లిమిటెడ్,
పోస్ట్ బాక్స్ నెం. 63, మదరాసు.

BJ 25-TB

# మంచి మంచి పుస్తకాలు

మా ప్రచురణలు అన్ని హిగిన్‌బాథమ్సు బుక్ స్టాళ్ళలోనూ దొరుకుతవి. లేదా మాకు వ్రాయండి. ఒకేసారిగా 6-0-0 పుస్తకాలు తెప్పించినవారికి పోస్టు ఖర్చులు మేమే భరించెదము. లైబ్రరీలకు, పుస్తక వ్యాపారులకు మంచి కమీషన్ ఇవ్వబడును. వివరాలకు వ్రాయండి.

## శరత్‌బాబు రచనలు

| | | | |
|---|---|---|---|
| వాగ్దత్త | [నవల] | 1 | 12 |
| శుభద | ,, | 1 | 8 |
| దేవదాసు | ,, | 1 | 8 |
| పల్లీయులు | ,, | 1 | 8 |
| నవవిధాన్ | ,, | 1 | 0 |
| చంద్రనాథ్ | ,, | 1 | 0 |
| పరిణీత | ,, | 0 | 12 |
| బడదీదీ | ,, | 0 | 12 |
| పతివ్రత | ,, | 0 | 12 |
| హేమాంగిని | ,, | 0 | 12 |
| నిష్కృతి | ,, | 0 | 12 |
| మూజారు | ,, | 0 | 12 |
| కాశీనాథ్ | ,, | 0 | 12 |
| మహేశుడు | [కథలు] | 0 | 12 |
| నారీర్ మూల్య | [వ్యాసం] | 0 | 12 |

## డిటెక్టివు నవలలు

| | | | |
|---|---|---|---|
| కడవటిమాట | [రాధాకృష్ణ] | 0 | 12 |
| మాయమైన మణిహారం | ,, | 0 | 12 |
| తప్పిపోయిన పెళ్లికూతురు | ,, | 0 | 12 |
| తగినశాస్తి | ,, | 0 | 12 |
| పారిపోయిన యుద్ధఖైదీ | ,, | 0 | 12 |
| దివాలా ఎస్టేట్ | ,, | 0 | 12 |
| అంతులేని ఆశ | ,, | 0 | 12 |

## చక్రపాణి అనువాదాలు

| | | | |
|---|---|---|---|
| నాతిద్వేషి | [మైత్రా] అనువాదం కథలు | 1 | 8 |
| పరాజయం | ,, ,, ,, | 0 | 12 |
| ఉదరనిమిత్తం | [నాటకం] | 1 | 0 |
| వల్లభపురం చిట్టడవిలో | [రాయ్‌చౌధరి] | 0 | 12 |
| హనుమంతుని స్వప్నం | [పరశురాం] | 0 | 12 |
| మెట్టవేదాంతం | [వనఫూల్] | 1 | 0 |
| బెంగాలీకథలు | [మనోవైజ్ఞానిక కథలు] | 0 | 12 |
| ప్రగల్భప్రేతము | [అత్యుత్తమ కథలు] | 0 | 12 |
| పాంచజన్యం | [రాజకీయ కథలు] | 0 | 12 |
| డిటెక్టివు | [నాటకం] | 0 | 12 |
| లంబకర్ణ | [పరశురాం కథలు] | 1 | 0 |
| సంధి | [యతీంద్ర మోహనసింహా] | 1 | 12 |

## కుటుంబరావు రచనలు

| | | | |
|---|---|---|---|
| విలవపేరు | [అత్యుత్తమ కథలు] | 1 | 8 |
| మొండివాడు | ,, | 1 | 0 |
| కాలభైరవుడు | ,, | 0 | 12 |
| వరప్రసాదం | ,, | 0 | 12 |
| కవిరాట్టు | [గల్పికలు] | 0 | 12 |
| కులంలేని మనిషి | [నవల] | 0 | 12 |
| అరుణోదయం | ,, | 1 | 0 |
| మారుపేర్లు | ,, | 0 | 12 |
| ఏకేం కావాలి? | ,, | 0 | 12 |
| ప్రణయరోగులు | [నాటకం] | 1 | 0 |
| అరితేరిన ఘటం | (విదేశ కథలు) | 0 | 12 |
| రష్యన్ కథలు | | 0 | 12 |

## చలంగారి రచనలు:

| | | |
|---|---|---|
| స్త్రీ | | 2- 0-0 |
| ప్రేమలేఖలు I | | 1-12-0 |
| ప్రేమలేఖలు II | | 1- 8-0 |
| బిడ్డలశిక్షణ | | 1- 8-0 |
| విషాదం | | 1- 0-0 |
| ఆనందం | | 1- 0-0 |
| చిత్రాంగి | [నాటకం] | 1- 8-0 |
| త్యాగం | ,, | 1- 8-0 |
| మంగమ్మ | ,, | 1- 0-0 |
| జయదేవ | ,, | 1- 0-0 |
| శశాంక | ,, | 1- 0-0 |
| సావిత్రి | ,, | 0-12-0 |
| సత్యం, శివం, సుందరం | | 1- 4-0 |
| నాటికాగుచ్ఛం | | 1- 4-0 |
| కర్మమిట్లా కాలింది | [కథలు] | 1- 8-0 |
| కన్నీటికాలవ | ,, | 0-12-0 |
| పాపం ! ! ! | ,, | 0-12-0 |
| దైవమిచ్చిన భార్య | [నవల] | 1- 8-0 |
| మైదానం | ,, | 1- 0-0 |
| అమీనా | ,, | 1- 0-0 |
| వివాహం | ,, | 1 -0-0 |
| బ్రాహ్మణీకం | ,, | 0-12-0 |
| అరుణ | ,, | 0-12-0 |
| హంపీకన్యలు | ,, | 0-12-0 |
| అదృష్టం | ,, | 1- 0-0 |
| వాళ్ళు వలాగురూ | ,, | 0-12-0 |
| పురూరవ | నాటకం | 1- 8-0 |

## వివిధ రచయితలు

| | | | |
|---|---|---|---|
| ఈస్టలిన్ | [నవల] | | 2- 0-0 |
| చచ్చిపోయిన మనిషి | [పద్మరాజు] | నవల | 0-12-0 |
| కదంబం | [నార్ల] | | 0-12-0 |
| పొగడదండ | [కొ. పద్మావతి] | కథలు | 0-12-0 |
| రూం-టు-లెట్ | [బాలకృష్ణశాస్త్రి] | ,, | 0-12-0 |
| సిపాయికథలు | [శిష్ట్లా] | ,, | 0-12-0 |
| మూగజీవాలు | [గోఖలే] | ,, | 1- 4-0 |
| రాజూ-మంత్రీ | [యం. యస్. మూర్తి] | | 0-12-0 |
| చుక్కలూ గీతలూ | ,, | ,, | 1- 0-0 |
| హర్ హైనెస్ | | | 1- 0-0 |
| పతితకేశము | [దువ్వూరి] | కావ్యం | 1- 0-0 |
| స్వప్నవాసవదత్తము | [కాటూరి] | నాటకం | 0-12-0 |
| వెలవు | [కప్పగంతుల] | | 1- 0-0 |
| ఋణవిముక్తి | ,, | | 1- 0-0 |
| సంజీవి | [ధనికొండ] | కథలు | 1- 0-0 |
| గర్వభంగం | ,, | ,, | 1- 0-0 |
| ప్రియురాలు | ,, | ,, | 1- 0-0 |
| తీర్పు | ,, | కథలు-నాటిలు | 0-12-0 |
| పవిత్రులు | ,, | దృశ్యనాటిక | 1- 4-0 |
| ఎర్రబుట్టలు | ,, | దృశ్యనాటికలు | 1- 8-0 |
| కళ్యాణి | [సోమంచియజ్ఞన్నశాస్త్రి] | నాటకం | 0-12-0 |
| విశ్వంపెళ్ళి | ,, | ,, | 0-12-0 |
| జ్యోతిర్మయి | [అ. వెం. నర్సు] | ,, | 1- 0-0 |


## యువ బుక్ డిపో

పోస్టు బాక్సు నెం. **1686,** మద్రాసు, 1.

# మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే

బాధపడుచున్న యెడల వెంటనే

పాత్రుడు గారి

# బాల సంజీవిని

యీయండి

ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.

వివరములకు:

**డా॥ పిళ్లా పాపయ్య పాత్రుడు & బ్రదరు,**

11, దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు.

కుంభకోణం బ్రాంచి:
నెం. 7, సారంగపాణి కోవిల్,
తూర్పువీధి.


తిరుచినాపల్లి బ్రాంచి:
నెం. 15, పుగళై పిళ్ళై వీధి,
తెప్పకోలం.

రిటీ బార్లీ

## ఇంకా ఎనిమిది రెట్లకు పోతుంది.




ఏకీకృత రూపంలో బార్లీబియ్యంయొక్క శ్రేష్ఠత్వాన్ని అంతని కలిగిఉంటుంది ప్యూరిటీ బార్లీ. ఒక్క చెంచాడు ప్యూరిటీ బార్లీ ఎనిమిది చెంచాల బార్లీబియ్యానికి సమానము. మీరెప్పుడు తాజాగా కొంటారు ఎందుకంటే ఆరోగ్య శాస్త్రరీత్యా సీలు కావింపబడిన డబ్బాలలో మీకు లభిస్తుంది కాబట్టి. ఒక్క 20 నిమిషాలలో రుచికరమైనగంజిని తయారు చేయగలరు. రెండు సమమట్టపు టీ స్పూనుల ప్యూరిటీ బార్లీని నీటితో ముద్ద చేసి ఒక పయింటు నీళ్లతో ఐదు నిముషాలు మాత్రమే తాపీగా ఉడుకనిస్తే బార్లీనీళ్లు శీఘ్రంగా తయారు చేయవచ్చు. రుచికి ఉప్పో, పంచదారో లేక నిమ్మరసమో కలపండి.



# ప్యూరిటీ బార్లీ

అట్లాంటిస్ (ఈస్ట్) లిమిటెడ్, పోస్ట్ బాక్స్ నెం. 664, కలకత్తా.

# ఆంధ్రజ్యోతి

.....సచిత్ర మాస పత్రిక.....

సంపుటి 11] జూన్ 1949 [సంచిక 6


## జరుగుతున్న చరిత్ర

దేశస్వాతంత్ర్యాన్ని సంపాదించడం ఒక ఎత్తు, సంపాదించిన స్వాతంత్ర్యాన్ని సంరక్షించుకొంటూ, జాతిలక్ష్యాలకు తగ్గట్టుగా, ప్రజాభిమతానికి అనుగుణంగా స్వతంత్రదేశాన్ని నిర్మించడం ఇంకొక ఎత్తు. మొదటిది—దేశస్వాతంత్ర్యసంపాదన—భారతీయులు అనుకున్నదానికంటే ముందుగానూ, సులభంగానూ లభించింది. రెండవదిమాత్రం ఇంకా చేరవలసిన గమ్యస్థానంగానే ఉంది. ప్రస్తుతం భారతీయులు అనుసరించుతూ ఉన్న మార్గం ఈ గమ్యస్థానాన్ని చేర్చగలదా అన్నది కూడా ప్రస్తుతం అనుమానంగానే ఉంది. స్వాతంత్ర్యం లభించిన తరువాత భారత ప్రజల్లో మార్పు అయితే వచ్చింది. కాని ఆ మార్పు మంచికో, చెడుకో మరి కొంతకాలం పోతేగాని తెలియదు.

దేశవిభజనవల్ల ఏర్పడిన క్లిష్టసమస్యలు అన్నీ ఇంచుమించు పరిష్కారమైపోయినవి. లక్షలాది కాందిశీకులకు పునరావాసం కల్పించడం సాధ్యమా అన్న ప్రశ్నకు కేంద్రప్రభుత్వం అత్యంత తృప్తికరమైన సమాధానాన్నే ఇచ్చింది. స్థానభ్రష్టులైనవారి ఆస్తిపాస్తులను గురించి పాకిస్తాన్ ప్రభుత్వంతో సమాధానాన్ని సాధించింది. అంతేగాక, గాంధిమహాత్ముని హత్య అనంతరం దేశం అంతటా ప్రజ్వరిల్లిన సంక్షోభం ఫలితంగా ఇళ్ళు, వాకిళ్ళు వదలిపోయిన ఆళ్వారు ముస్లింలను తిరిగి వారి స్వస్థానాలకు చేర్చడానికి భారతప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలోన్ముఖమైనవి.

అయితే, ప్రజలు—వారే తెగకు చెందినా, ఏమతం వారైనా—మారిపోయిన పరిస్థితులకు తగ్గట్టుగా తమ విధానాన్నీ, పద్ధతులనూ మార్చుకోలేదు. వారి మనస్తత్వంకూడా ఏమీ మారలేదు. ప్రస్తుత పరిస్థితులకు ప్రజలూ, ప్రభుత్వంకూడా సమంగా బాధ్యత వహింపవలసి ఉంది.

పండితారాధ్యుల నాగేశ్వరరావు

మత, కుల తత్వాలను నిర్మూలించి లౌకిక ప్రజారాజ్యాన్ని స్థాపించడానికి భారత ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. ఆ ప్రకారంగా కులనిష్పత్తినీ, మతవర్గాలకు ప్రత్యేక నియోజకవర్గాలను, శాసనసభల్లో వారి జనాభానుబట్టి కొన్ని స్థానాలను కేటాయించడం—ఈ పద్ధతులన్నింటికీ స్వస్తిచెప్పింది. నూత్నరాజ్యాంగంలో ఒక్క హరిజనులకు, సిక్కులలో వెనుకబడిఉన్న వర్గాలకు తప్ప మరెవ్వరికీ శాసనసభల్లో స్థానములను ప్రత్యేకించడం ఉండరాదని రాజ్యాంగపరిషత్తు నిర్ణయించింది. ఆ సందర్భంలో పరిషత్తులో జరిగిన చర్చలను గమనించితే ప్రత్యేక నియోజకవర్గాలు, స్థానముల కేటాయింపు పద్ధతిని రద్దుచేయడం ఎంత అవసరమో స్పష్టమౌతున్నది. ఏవర్గాని కావర్గం ఈవిధంగా ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని పొందుతూ ఉన్నంతకాలం వివిధవర్గాలసఖ్యత, సహకారం సాధ్యం గానేకాదు. కలిసి పనిచేసే అవకాశాలూ తగ్గిపోతవి. దాదాపు మూడు దశాబ్దాలక్రితం కాంగ్రెస్ విధిలేక ముస్లింల ప్రత్యేక ప్రాతినిధ్యానికి, విడివిడి నియోజకవర్గాలకు అంగీకరించవలసి వచ్చింది. అదే దేశవిభజనకు దారితీసింది. వేలాది అమాయిక ప్రజలను బలితీసుకొన్నది. శాంతి నాకాంక్షించు భారతదేశం ఇలాంటి విభజనసూత్రాలను హర్షించదు; అమోదించదు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ క్రిందటినెలలో రాజ్యాంగపరిషత్తులో స్పష్టంచేశారు. అధికసంఖ్యాకులు, అల్పసంఖ్యాకులు కలిసి ఒకేవర్గంగా వ్యవహరించి దేశాభ్యున్నతికి కృషిచేయాలంటే ఈ ప్రత్యేక నియోజకవర్గాలు, ఈ స్థానాల కేటాయింపు రద్దుగాక తప్పదు. రాజ్యాంగపరిషత్తు ఇందుకు సంబంధించి సర్దార్ పటేల్ ప్రతిపాదించిన చరిత్రాత్మక తీర్మానమును ఆమోదించి స్వతంత్ర భారత ఇతిహాసంలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించింది.

ఒక్క ముస్లింలు తప్ప—వాళ్ళల్లోనూ కొద్దిమందే—మిగతా అల్పసంఖ్యాక వర్గాల వారందరూ ఈనిర్ణయాన్ని హర్షించడం శుభసూచకం. సర్దార్ పటేల్ ప్రకటించినట్లు ఇతర అల్పసంఖ్యాకవర్గాల ప్రతినిధులు చేసిన సూచలను అంగీకరించే ఈ తీర్మానానికి ప్రాతిపదిక అయిన నివేదిక తయారైంది. భారతీయ క్రైస్తవ నాయకుడు డాక్టర్ హెచ్. సి. ముఖర్జీ, ఆంగ్లో-ఇండియన్ నాయకుడు ఫ్రాంక్ ఆంథోని, సర్దార్ పటేల్ తీర్మానాన్ని మనస్ఫూర్తిగా బలపరచడంవల్ల అధిక సంఖ్యాకుల, అల్పసంఖ్యాకులమధ్య ప్రస్తుతం ఏర్పడిన సఖ్యత, సామరస్యం స్థిరపడిపోగలదనే నమ్మకం కలుగుతూఉంది.

ఇద్దరు ముగ్గురు ముస్లింలీగు ప్రతినిధులను మినహాయించితే, ముస్లిం ప్రతినిధులుకూడా అధికసంఖ్యాకవర్గంతో చేరిపోవడమే తమకు తమ వర్గానికి క్షేమకరమని గ్రహించినట్లు స్పష్టమౌతున్నది. నామమాత్రంగా ఉన్న అఖిలభారత ముస్లింలీగు అధ్యక్షుడు మహమ్మద్ ఇస్మాయిల్‌మాత్రం 1947 ఆగస్టు 15 కు పూర్వంఉన్న వ్యవస్థను తిరిగి స్థాపించడానికి ప్రయత్నించారు. వారి ప్రయత్నం

ఫలింపకపోవడం వారికికూడా ఆశ్చర్యాన్ని కల్గించదు. ముస్లింలీగును తిరిగి రాజకీయపక్షంగా పునరుద్ధరించడానికి వీరుచేసే ప్రయత్నాలుకూడా ఈ ఫలితాన్నే పొందుతవి. అందుకు సందేహంలేదు.

ముస్లింలీగ్ నాయకులమాదిరే హిందూమహాసభనాయకులూ కొందరు తమ స్వంతలాభంకోసరం హిందూమహాసభనుకూడా ఒక రాజకీయపక్షంగా పునరుద్ధరించడానికి ప్రయత్నిస్తున్నారు. వీరి ప్రయత్నాలూ ఫలించవు. ముస్లింలీగు, ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను, శాసనసభల్లో జనాభానుబట్టి స్థానాలను సంపాదించడానికి, ఉద్యోగాల్లో కులనిష్పత్తినిబట్టి ప్రభుత్వ ఉద్యోగాలను సంపాదించడానికి ఏర్పడింది. బ్రిటిష్‌వారు దేశాన్ని పాలించుతూ ఉన్నంతవరకూ ముస్లింలీగ్‌కు చేతినిండాపని ఉంటూవచ్చింది. ఇప్పుడు ముస్లింలీగు చేయకలిగింది ఏమీలేదు. అలాగే హిందూమహాసభకూడా. బ్రిటిష్‌ప్రభుత్వం ప్రసాదించిన "కమ్యూనల్ అవార్డు" అటు ముస్లింలీగ్‌కూ, ఇటు హిందూమహాసభ సకూడా ప్రాణంపోసింది. వంగరాష్ట్రంలోని హిందువులకు ఈ 'సాంఘికపరిష్కారం' వల్ల చాలా నష్టం కలిగింది. అందువల్ల ఈ పరిష్కారాన్ని ప్రతిఘటించడానికి హిందువులను సంఘటితపరచడం అవసరమైంది. ఇప్పుడు ఆ 'అవార్డును' పసాదించిన ప్రభుత్వం, ఆ 'అవార్డు' ఫలితంగా ఏర్పడిన సాంఘిక వ్యవస్థకూడా రద్దయిపోయినవి. కనుక రాజకీయరంగంలో హిందూమహాసభ సాధింపవలసినది ఏమీలేదు.

అయితే యూరపులోని అనేక ప్రజాస్వామిక దేశాల్లో మాదిరే భారతదేశంలోనూ కొన్ని ప్రతీపవర్గాలు మతపక్షాల్లో చేరి రాజకీయ ప్రయోజనాలను సాధించడానికి ప్రయత్నిస్తున్నవి. క్రిస్టియన్ డెమొక్రాట్లు, కాథలిక్‌లు ఈ వర్గానికి చెందినవారే. యూరపుదేశాల్లో వీరు సాధిస్తున్న తాత్కాలికవిజయాలు, పాశ్చాత్యప్రపంచంలో మతాధిపతి పోప్‌కుగల విశేషప్రాబల్యం వీరి ఈ విధానానికి ప్రోత్సాహమిస్తూఉండ వచ్చు. కాని ఈ మతపక్షాలు ఎంతోకాలం అధికారాన్ని చలాయించలేవని రుమేనియా, హంగరీ, చకస్లవేకియా సంఘటనలు స్పష్టంచేస్తున్నవి. ఈ మత రాజకీయాలు ప్రజాస్వామికవిధానాన్ని దుర్బలంచేస్తూ కమ్యూనిస్టు రాజ్యస్థాపనకు దోహదంచేస్తున్నవి. రిపబ్లికను ప్రభుత్వాన్ని స్థాపింపదలచిన భారతప్రభుత్వం మతాధార రాజకీయపక్షములను సహింపకపోవుట సహజమే.

రాజ్యాంగపరిషత్తు ఈ విషయంలో చేసిన అత్యంత ప్రధానమైన నిర్ణయంతో బాటు జరిగిననెల్లో గణనీయమైన సంఘటనలు మరి మూడునాలుగున్నవి. ఇందులో ముఖ్యంగా మనకు సంబంధించినవి కొచిన్ - తిరువాన్కూరు సమైక్యత, హైదరాబాద్‌ను విశాలాంధ్రనిర్మాణానికి వీలు అగునట్లుగా విభజించాలని నిజాం సంస్థాన ఆంధ్రకాంగ్రెసు స్థాయిసంఘం ఘనపురంలో సమావేశమై చేసిన తీర్మానం.

భాషారాష్ట్రాలవిషయమై కాంగ్రెస్ నాయకత్రయం చేసిన ప్రతిపాదనలపై ఆంధ్ర మహాసభ, ఆంధ్ర కాంగ్రెస్ సంఘం చేసిన ముఖ్యతీర్మానాలు.

చెన్నరాష్ట్ర ప్రధాని శ్రీ కుమారస్వామి రాజా డెహ్రాడూన్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ సంఘసమావేశానికి హాజరై తిరిగివచ్చిన వెంటనే పత్రికా విలేఖరులతో సంభాషిస్తూ, "తీరా రాష్ట్రం ఇస్తామనే సరికి ఆంధ్రులు రాష్ట్రం అక్కర్లేదంటున్నారు. నాయకత్రయ నివేదికను, ఏ మాత్రం మినహాయింపులూ లేకుండా ఆంధ్రులు అంగీకరిస్తే వెంటనే రాష్ట్ర నిర్మాణం జరుగుతుంది" అని చెప్పారు. తెనుగు మంత్రి సంజీవరెడ్డిగారూ ఇదే అభిప్రాయాన్ని ప్రకటించారు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి సంబంధించి ప్రస్తుత పరిస్థితి ఇదే. ఆంధ్రమహాసభ కార్యవర్గం మాత్రం చెన్నపట్నాన్ని వదులుకోవలసివచ్చినందుకు "కంటతడి" బెట్టినా చివరికి నాయకత్రయ నివేదికను యథాతథంగా ఆమోదించింది. ఆంధ్ర కాంగ్రెస్ కార్యవర్గం, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘంకూడా నాయకత్రయ నివేదికను ఖండిస్తూ ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ప్రతిసూచనలు చేసినవి. ఆ ప్రకారంగా రాష్ట్రం ఏర్పడే అవకాశం ఏమీ కన్పించడంలేదు. ఆంధ్రులు చేతులారా రాష్ట్రాన్ని పోగొట్టుకుంటున్నారు. ఆంధ్రనాయకులు ఈవిధంగా హ్రస్వదృష్టితో, కేవలం స్వార్థంతో రాష్ట్రవ్యవహారాలను నిర్వాకంచేస్తూ ఉంటే తెలంగాణా నాయకులు నిజంగా ఆదర్శప్రాయంగా ప్రవర్తించారు. ఘనపురంలో సమావేశమైన నిజాం ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ స్థాయిసంఘం చక్కని తీర్మానాలను చేసింది. సంస్థాన కాంగ్రెస్‌ను అఖిలభారతజాతీయ కాంగ్రెస్ అనుబంధ సంస్థగా చేయాలన్నది మొదటి తీర్మానం. ఈ తీర్మానం సంస్థానం భారత సమితిలో సమైక్యమై పోవడానికి దారిచేస్తుంది. రెండవ తీర్మానం హైదరాబాదు సంస్థాన విభజనకు సంబంధించింది. "విశాలాంధ్రస్థాపనకు వీలుగా హైదరాబాదు సంస్థానమును భాషా భాగాలుగా విభజించాలి" అనే ఈ తీర్మానం ఆంధ్రనాయకులందరికీ ఒక హెచ్చరిక అని చెప్పాలి. విశాలాంధ్ర స్థాపనలో ఏమాత్రం కాలహరణం జరిగినా గంజాం జిల్లాలోని ఆంధ్రప్రాంతాలు ఒరిస్సా రాష్ట్రంలో చేరిపోయినట్లు, చెన్నపట్నం తమిళుల వశమైనట్లు సంస్థానంలోని కొన్ని తెనుగు ప్రాంతాలు ఇతర రాష్ట్రాల్లో చేరిపోగలవు. అదిలాబాద్ జిల్లాపై మహారాష్ట్రులు అప్పుడే కన్నువేశారు. మరి కొంతకాలంపోతే హైదరాబాద్ సికిందరాబాద్‌లు ఏమవుతాయో తెలియదు. ఆంధ్రులు అప్పుడు రెంటికి చెడిన రేవడవలె అవుతారనడానికి సందేహంలేదు.

కొచిన్ - తిరువాన్కూరు సమైక్యత ఐక్య కేరళస్థాపనకు ప్రాతిపదికే అని చెప్పవచ్చు. బరోడా, కోల్హాపూరు సంస్థానాలు బొంబాయిరాష్ట్రంలో చేరిపోవడంతో గుజరాత్ మహారాష్ట్రముల స్థాపనకు సోపానం ఏర్పడింది. బొంబాయిరాష్ట్రం విభాగమై గుజరాత్ మహారాష్ట్రాలు ఏర్పడి, ఐక్య కేరళస్థాపన జరిగితే ఐక.


కర్నాటకంకూడా ఏర్పడిపోతుంది. నాయకత్రయం ఆంధ్రరాష్ట్రనిర్మాణం ఇప్పుడే సాధ్యం అని చెప్పినాకూడా ఇతర భాషారాష్ట్రాలన్నీ ఏర్పడిన తరువాతకూడా ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రం రాకపోవచ్చును.

రాజ్యాంగపరిషత్తు నూత్నరాజ్యాంగాన్ని ఆగస్టు 15 వ తేదీకి పూర్వమే ఆమోదించేటట్లు కన్పిస్తుంది. మే 16 వ తేదీన తిరిగి సమావేశమైనప్పటినుంచీ అనవసరమైన వాదోపవాదాలతో కాలయాపనచేయక చాలా శీఘ్రంగా నిబంధనలను ఆమోదించుతూఉంది. రాజ్యాంగపరిషత్తు నూత్నరాజ్యాంగాన్ని ఆమోదించేలోపుగా ఆంధ్రరాష్ట్రం రూపొందకపోతే ఎప్పటికి వస్తుందో ఎవ్వరూ చెప్పలేరు.

ఇంతకంటే క్లిష్టసమస్యలు ఇట్టే పరిష్కారమైపోతున్నవి. రాజ్యాంగపరిషత్తు ఏర్పడి రెండేళ్ళకుపైగా అయినా కాశ్మీరు, హైదరాబాద్ సంస్థానాలకు అందులో ప్రాతినిధ్యంలేదు. హైదరాబాద్ భారతసమాఖ్యలో క్రమపద్ధతిని చేరనందువల్ల ఈ ప్రాతినిధ్యసమస్య ఇప్పటికీ పరిష్కారంకాలేదు. అందుకే భద్రతామండలిలో పాకిస్తాన్ ప్రతినిధి ఇంకా గంటలతరబడి ఉపన్యాసాలు చేయడానికి వీలు చిక్కుతున్నది. కాశ్మీరువిషయం అలాగాదు. కనుకనే, ఎంతో ఆలస్యం అయినా రాజ్యాంగ పరిషత్తులో ఆ సంస్థానానికి ప్రాతినిధ్యం ఇస్తూ పరిషత్తు తీర్మానించింది. ఇందువల్ల కాశ్మీరు - భారతదేశ సంబంధాలు స్థిరపడిపోయినవి. జనవాక్య నిర్ధారణ ఎంత కాలానికి జరిగినా ఇబ్బందిలేదు.

పాకిస్థాన్-భారతదేశ సంబంధాలు శాశ్వతంగా కుదట బడేందుకు హైదరాబాద్ కాశ్మీరు సమస్యలు పరిష్కారం కావాలని విదేశాంగమంత్రి జఫ్రుల్లాఖాన్ హెచ్చరించితే, హైదరాబాద్ వ్యవహారాల్లో పాకిస్తాన్ వేలుపెట్టడం మానితేగాని రెండు అధినివేశాలకూ సఖ్యతపొసగదని సర్దార్ పటేల్ స్పష్టంచేశారు. అయితే, గుడ్డిలో మెల్ల అన్నట్టు ఇండియా, పాకిస్థాన్లు కామన్వెల్తులోనే ఉన్నందువల్ల బ్రిటన్లో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, ఇప్పటిస్థితికి భంగం రాదనే ఆశ కలుగుతున్నది. కేంద్రప్రభుత్వం ఈ సమస్యలన్నింటినీ గౌరవప్రదంగా, న్యాయంగా పరిష్కరిస్తుంది. రాష్ట్రప్రభుత్వాలు మాత్రం దేశ ఆర్థిక, సాంఘిక వ్యవస్థను సరిదిద్దవలసిఉంది. ప్రజల్లో ఏర్పడిన నైరాశ్యాన్ని తొలగించి, నైతిక ధర్మాను వర్తులై ప్రజలు ప్రవర్తించేలాగా చేయగలశక్తి, అందుకు అవసరమైన అవకాశాలు రాష్ట్రప్రభుత్వాలకే ఉంది. భారతదేశం బాగుపడినా, చెడిపోయినా, దేశంలో కమ్యూనిజం ఏర్పడినా, అరాచకం ప్రబలినా ఆబాధ్యతఅంతా రాష్ట్రప్రభుత్వాలదే అవుతుంది. కనుక కాంగ్రెస్ అధిష్ఠానవర్గం కాంగ్రెస్మంత్రులను అమేషా కనిపెట్టుతూ పరిపాలన న్యాయంగా, ధర్మంగా జరిగేటట్లు చూడాలి. లేకుంటే మరొక అయిదేళ్ళల్లో కాంగ్రెస్, ప్రజాస్వామిక భారతదేశంకూడా చరిత్రగతమై పోగలవ్వ






ఇండిపెండెంట్ రిపబ్లిక్

# భారతదేశం - కామన్వెల్తు

మనరాజ్యాంగ పరిషత్తు, ఆ తరువాత అఖిలభారత కాంగ్రెస్ సంఘం కూడా ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ సంతకం పెట్టిన లండన్ ఒడంబడికను ఆమోదించడంవల్ల, ముందు ఎప్పుడైనా, స్వతంత్ర భారత రిపబ్లిక్ పార్లమెంటు భిన్నంగా తీర్మానం చేసేవరకూ, భారతదేశం కామన్వెల్తు రాజ్యాలలో ఒకటిగానే ఉంటుంది. బ్రిటన్‌గాక ఈ కామన్వెల్తులో దక్షిణ ఆఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా, పాకిస్తాన్, సింహళ, భారతదేశాలు సభ్యత్వం కలిగిఉన్నవి. ఇంతవరకూ బ్రిటిష్ కామన్వెల్తు రాజ్యాలకూ, బ్రిటిష్ అధినివేశాలకూ ఏమీ వ్యత్యాసంలేదు. ఇంచుమించు రెండూ పర్యాయపదాలుగానే ఉంటున్నవి. ఏప్రిలులో జరిగిన కామన్వెల్తు ప్రధాన మంత్రుల సమావేశంలో "అధినివేశం" అనే పదానికి స్వస్తి చెప్పి, కామన్వెల్త్ రాజ్యాలు అనే ఇకమీదట వాడేందుకు నిర్ణయం జరిగింది. ఈ మార్పు చాలా ముఖ్యమైంది. అధినివేశ రాజ్యం అనగానే వెస్ట్ మినిస్టర్ శాసనం స్ఫురణకు వస్తుంది. బ్రిటన్‌కూ అధినివేశ దేశాలకూ ఉండవలసిన సంబంధ బాంధవ్యాలు ఈ శాసనంవల్ల నిర్ధారణ అయినవి. అధినివేశ ప్రతిపత్తి స్వాతంత్ర్య సారమునకుకూడా తక్కువే అని 1947 ఆగస్టు 15కు పూర్వంవరకూ మనం అందరం భావించుతూ వచ్చాం. మాకు అధినివేశ ప్రతిపత్తికాదు; సంపూర్ణ స్వాతంత్ర్యమే కావాలని ప్రతి సంవత్సరం జనవరి 26వ తేదీ తీసుకుంటున్న స్వాతంత్ర్య ప్రమాణంలో ఉద్ఘాటిస్తూ వచ్చాం. అంచేతనే 1942వ సంవత్సరంలో సర్ స్టాఫర్డ్ క్రిప్సుకూడా యుద్ధకాలంలో భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తిని ఇస్తాం అంటే సంపూర్ణ స్వాతంత్ర్యం ఎప్పుడు అని ప్రశ్నించాం.

అయితే బ్రిటిష్ అధికార నిర్వచనం ప్రకారం బ్రిటన్‌కూ, అధినివేశరాజ్యాలకూ హోదాలోగాని, అధికారాల్లోగాని ఏమీ వ్యత్యాసం లేదంటూ వచ్చారు. క్రిప్స్ ప్రతిపాదనలు ఈ విషయాన్నే వివరించినవి. కాని బ్రిటిష్ అధినివేశంగా ఉండే రాజ్యం రిపబ్లికను రాజ్యాంగాన్ని అంగీకరించడం సాధ్యంగాదు. కనుకనే లండన్ సమావేశం "అధినివేశ రాజ్యం" అనే పదానికి స్వస్తిచెప్పి కామన్వెల్త్ దేశాలు అని భారత దేశాభిమతాన్ని అనుసరించి మార్పుచేయడం జరిగింది.

బ్రిటిష్ కామన్వెల్తులో ఉంటూ రిపబ్లిక్ రాజ్యాంగాన్ని అమలుపరచడం సాధ్యమా అన్న ప్రశ్నకు ఐర్లెండ్ ఇదివరకే సమాధానం ఇచ్చింది. ఐర్లెండ్ బ్రిటిష్ అధినివేశం గాదు; అయినా మొన్నటివరకూ బ్రిటిష్ కామన్వెల్తులో ఉంటూనే వచ్చింది. కనుక రిపబ్లికన్ భారతదేశం బ్రిటిష్ కామన్వెల్తులో ఉండడం సాధ్యమే. ఇందువల్ల భారతదేశ స్వాతంత్ర్యం ఏవిధంగానూ పరిమితం గాదు. ఐర్లెండ్‌మాదిరే మనంకూడా రాజభక్తి ప్రమాణం చేయవలసిన అగత్యం

లేదు. మన రాజ్యానికి మన రిపబ్లిక్ అధ్యక్షుడే అధిపతి. ఎవరి పేరనో మనం కర్మ చేయవలసిన అవసరంలేదు. మనకు కర్మాధికారం ఉంది. ఆఫ్రికా, ఆస్ట్రేలియా, కెనడా, సింహళములలో మాదిరిగా మనకు గవర్నరుజనరలు అనే ఉద్యోగి ఉండడు. కనుక రాజుపేర పనిచేయడం అనేది ఉండనేఉండదు. నూత్నరాజ్యాంగం కూడా ఈ విషయాన్ని స్పష్టంచేసింది. కనుక ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలూ ఉండనవసరంలేదు.

పోతే—ఎవరడిగినా ఒక్కటే ప్రశ్న—

ఈవిధంగా సర్వస్వతంత్రంగా వ్యవహరించేటప్పుడు బ్రిటిష్ కామన్వెల్తులో ఉండడం దేనికి? ఇతర కామన్వెల్తు రాజ్యాల్లో భారతీయులు అవమానాల పాలౌతూ ఉంటే బ్రిటన్‌గాని కామన్వెల్తుగాని ఏమీ చేయలేకపోయింది. మలయాలో బ్రిటిష్ అధికారులు భారతీయ కార్మిక నాయకులను ఉరితీస్తే మనం ఏమీ చేయలేక పోయాం. బ్రిటిష్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు అధిక్షేపణలు తెలియచేసినా ఏమీ ప్రయోజనం లేకుండాఉంది. ఇద్దరు భారతీయులను రక్షింపలేకపోయిన కామన్వెల్తు సభ్యత్వంవల్ల మనకు ఒరిగేదేమిటి అనే ఈమధ్య చాలామంది ప్రశ్నిస్తున్నారు.

ఈ ప్రశ్న లన్నింటికీ ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ ఎన్నోసార్లు సమాధానం చెప్పారు. కామన్వెల్తు సభ్యత్వంవల్ల కామన్వెల్తు దేశాల స్వాతంత్ర్యం ఏమాత్రం పరిమితం కాదనడానికి ఇంతకుమించిన నిదర్శనం అవసరంలేదని పండిట్ నెహ్రూ లండన్ ఒడంబడికను విమర్శించినవారికి సమాధానం చెప్పారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం అక్కడి భారతీయులను నానా హింసా పెడుతుంటే దానిపైన భారత ప్రభుత్వం ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదుచేసినపుడు కామన్వెల్తు రాజ్యాలు ఎవరికి అనుకూలంగా ఉన్నట్లు వారు ప్రవర్తించారు. అలాగే అనేక ఇతరవిషయాల్లో ముఖ్యంగా కాశ్మీరు, హైదరాబాదు విషయాల్లో బ్రిటన్ తనకు ఇష్టమైన విధానాన్నే అనుసరించింది. భారతదేశంకూడా అదేవిధంగా వ్యవహరిస్తూఉన్నది. వీటన్నింటి వల్లా స్పష్టం అవుతున్న విషయం ఏమిటీ అంటే—భారతదేశ రాజకీయ స్వాతంత్ర్యం కామన్వెల్తు సభ్యత్వంవల్ల ఏమాత్రంపరిమితం గాదని.

పోతే కామన్వెల్తు సభ్యత్వంవల్ల భారతదేశానికి ప్రాప్తించే ప్రయోజనా లేమిటి?

బర్మాలాగా చేతులు కాలిన తరవాత ఆకులు పట్టుకోవడం ఏవిధంగానూ వివేకవంతమైన పద్ధతి కాదు. భారతదేశంకూడా ఈక్షణంలో బర్మా, ఐర్లెండ్ మార్గాన్ని అనుసరించి కామన్వెల్తునుండి వైతొలగవచ్చు. ఎవ్వరూ అడ్డుపడలేరు. అయితే ఆ తరువాతవచ్చే ప్రమాదాన్ని ఎదుర్కోడానికి ఎవ్వరూ సహాయపడనూలేరు. గౌరవప్రదంగా కామన్వెల్తులో చేరిపోవడం ఉత్తమంగాని, ఏదో ప్రతిష్ఠకని పోయి ఇవాళ కామన్వెల్తునుండి పోయి, పరిస్థితులు విషమించినప్పుడు నువ్వా, నువ్వా అని కామన్వెల్తు రాజ్యాలచుట్టూ చేరడం ఎప్పటికీ వాంఛనీయం గాదు.

కామన్వెల్తులో ఉండడంవల్ల భారతదేశానికి ఆర్థికంగా చేకూరే కొన్ని ప్రయోజనాలు ఉన్నవి. వ్యాపార లావాదేవీల్లో కామన్వెల్తు రాజ్యాలు పరస్పరం ఎక్కువ సౌకర్యాలను కల్గించుకోవచ్చును. ఒక దేశార్థికాభివృద్ధికి వేరొకదేశం ఎక్కువగా సహాయపడగలదు. ఈవిధంగా సహాయం చేయడం ప్రతి ఒక్క కామన్వెల్తు రాజ్యానికీ కనీస ధర్మమై ఉంది. సుంకములను విధించడంలోగాని, అవసరవస్తువులను సప్లయిచేయడంలోగాని ఒక కామన్వెల్తురాజ్యం, మరొక కామన్వెల్తు రాజ్యానికి ఎక్కువ అనుకూలంగా వ్యవహరించవలసిన బాధ్యత లండన్ ఒడంబడికవల్ల ఏర్పడింది. కనుకనే పండిట్ నెహ్రూ క్రిందటినెలాఖరున డెరాడూన్‌లో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ సంఘసమావేశంలో ఉపన్యసిస్తూ భారతదేశ ఆర్థికస్థితిని చక్కబెట్టడానికి, ఆర్థికస్థిరత్వాన్ని సాధించడానికి లండన్ ఒడంబడిక ఉపయోగపడగలదని అసందిగ్ధంగా ప్రకటించారు.

ప్రపంచం ఈనాడు రెండువర్గాలుగా చీలిపోయినమాట వాస్తవమే. భారతదేశం బ్రిటిష్ కామన్వెల్తులో చేరడంవల్ల ఒక వర్గంతో కలిసినట్లు కాదా అని కొందరడుగుతున్నారు. కాదనే పండిట్ నెహ్రూ వాదన. కామన్వెల్తుకూ, పశ్చిమయూరపు సమాఖ్య, ఉత్తర అట్లాంటిక్ రక్షణ ఒడంబడికలకూ పోలికలేదని అంగీకరించక తప్పదు. లండన్ ఒప్పందంలో రహస్యంగా ఉన్న ఇతర ఏర్పాట్లు ఏమీ లేవని పండిట్ నెహ్రూ తెలిపినప్పుడు, ఆ ప్రకటనను శంకింపవలసిన అవసరంలేదు. రాజ్యాంగపరిషత్తు అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ హెచ్చరించినట్లు ప్రధాని ప్రకటనను శంకించడం భారతజాతిని అవమానించడమే అవుతుంది. రహస్య నిబంధనలు ఏమీ లేనప్పుడు కామన్వెల్తు ప్రధానమంత్రుల సమావేశం ముగిసిన తరువాత వెలువడ్డ అధికారప్రకటనలే వ్యాఖ్యలకుగాని విమర్శలకుగాని ఆధారం కావాలి. ఆవిధంగా చూస్తే భారతదేశం ప్రతిష్ఠకు, జాతిగౌరవానికి భంగకరమైన అంశములు ఏవీ ఈ ఒడంబడికలో లేవని స్పష్టమౌతుంది. రష్యాతో ఆర్థిక, వాణిజ్య సైనిక ఒప్పందం కుదుర్చుకోవడానికి లండన్ ఒడంబడిక ఏవిధంగానూ అడ్డంరాదు. కనుక లండన్ ఒడంబడికపై సంతకంపెట్టి భారతదేశం రష్యా వ్యతిరేకవర్గంలో చేరిపోయిందనేవాదం నిర్హేతుకమౌతున్నది.

కామన్వెల్తు ఒడంబడిక ప్రధానంగా ఆర్థిక వ్యాపార విషయాలకు సంబంధించింది. ఆవిధమైన ఏర్పాట్లను భారతదేశం ఇతర రాజ్యాలతోకూడా చేసుకుంటూనేఉంది. అయితే ఈ లండన్ ఒడంబడికనుగురించి ఒక్కవిషయం చెప్పవచ్చు. కౌరవులకూ, పాండవులకూ మధ్య తగాయిదావస్తే ఆ తగాయిదాను వాళ్లో వారే పరిష్కరించుకొన్నట్లు, ఇద్దరిపైనా మూడోవారు ఎవరైనా దండెత్తివస్తే అంతాచేరి 105 గురూ ఎదిరించినట్లు కామన్వెల్తు రాజ్యాలు వ్యవహరిస్తవి. అలాంటి ఏర్పాటువల్ల ఏ పక్షానికీ నష్టంలేదుగదా!



# నా చిన్ననాటి ముచ్చట్లు

కే. యన్. కేసరి

## మద్రాసులో అగ్రహారములు — ధర్మసంస్థలు

చెన్నపట్టణము అన్నిజాతులకుకూడలి స్థలమైనను బ్రాహ్మణులకు ప్రత్యేకముగ అగ్రహారము లున్నవి. కొల్లావారి అగ్రహారం, క్రిష్ణప్పనాయుని అగ్రహారం, ఏకామ్రేశ్వర అగ్రహారం, రావిచెట్టు అగ్రహారం మొదలగునవి మరికొన్నియును గలవు. ఇప్పుడా అగ్రహారములలో బ్రాహ్మణులు తక్కువ; బ్రాహ్మణేతరులు అధికముగ నివసించుచున్నారు.

### ధర్మ సంస్థలు

ముందుకాలమున మద్రాసులోయుండు వైశ్యులు, నాయుళ్ళు, మొదలియార్లు బ్రాహ్మణ భక్తిని కలిగియుండిరి. వీరి యిండ్లలో జరుగు వివాహాది శుభకార్యములకు అశుభకార్యములకు బ్రాహ్మణులకు లడ్డు పేణీలతోకూడ భోజనముపెట్టుచు భూరి సంభావనలను యిచ్చుచుండిరి. ఆకాలమున అనేక అన్నసత్రములలో బ్రాహ్మణులకు అన్నమును పెట్టుచుండిరి. దినమునకు సుమారు వెయ్యిమంది బ్రాహ్మణులు భుజించుటకు తగిన వసతిగల ధర్మసత్రము లుండెను. మొదట నేను ఈవూరికి వచ్చినప్పుడు ఈ సత్రములలోనే భుజించుచుంటిని.

### తంజావూరు రామానాయుని ధర్మసత్రము-అగ్రహారము

తిరువత్తియూరు హైరోడ్డులో తంజావూరు రామానాయుని సత్రమును, దానినంటి అగ్రహారమున్నూ గలవు. ఈ రామానాయుడు చాల బ్రాహ్మణభక్తిపరుడు. దైవభీతి కలవాడు. ఇచ్చట తండియార్పేటలోనేగాక తిరువళ్లూరు, కాంచీనగరములందును ధర్మసత్రములను వేసియున్నాడు.

రామానాయుని కుమారుడు రంగయ్యనాయుడుగారు 1822 సం॥ డిశంబరు 7-వ తేదికి సరియైన చిత్రభాను సం॥రము కార్తీక బ॥లు నాటు తెలుగులో వ్రాసియుంచిన వీలునామా చూడగా వారి దానధర్మములును, రంగయ్యనాయుడుగారి బ్రాహ్మణభక్తి, దైవభీతి, శీలసంపత్తి మున్నగునవియున్నూ స్పష్టమగుచున్నవి. తండియార్పేటలోని సత్రమున ఆ రోజులలో - 160 మంది పరదేశీలకు, విద్యార్థులకు. 60 మంది నౌకర్లకు మూడుపూటల ఇష్టమృష్టాన్న భోజనమున తృప్తుల గావించుట కేర్పాటు చేయబడి యుండెను. ఇచ్చట విద్యార్థులకు భోజనముపెట్టి, పండితులచే వేదశాస్త్రములను చెప్పించేవారు. తిరువళ్ళూరు, కాంచీనగరములం

దలి ధర్మసత్రములందు 12 మంది బ్రాహ్మణబాలురు భోజనవసతిగల్గి - వేదాధ్యయన మొనర్చుచు, ధర్మశాస్త్రములను పఠించుచుండిరి. ఆ వీలునామాయందంతటను శ్రీ రామ నామస్మరణ విరివిగా చేయబడినది. "పవిత్రమైన శ్రీ రామనామ మహాత్మ్యమువల్లనే మన వంశాభివృద్ధి, మన పూర్వులచే స్థాపింపబడిన ధర్మాభివృద్ధి, సాగుచున్నవి. ఆ రాముడే మీకు భవిష్యత్తునందు సంరక్షకుడు. నిరంతరము రామనామము జపమొనర్చుటకై ఇద్దరు బ్రాహ్మణులను మనయింట ఏర్పాటు చేసియున్న సంగతి మీకు తెలియును. మీరును అట్లే నిరంతరము శ్రీ రామనామ జపము గావించు బ్రాహ్మణులను ఏర్పాటు చేయవలసినది"- అని ఆ వీలునందు వ్రాసియున్నారు. ఈ సత్రము పరిపాలనవిషయమై కోర్టువారును ఒకటి రెండు సార్లు జోక్యము కల్పించుకొని స్కీములు నిర్మించియున్నారు.

ఇట్టివే, అన్నసత్రములు మరికొన్ని మద్రాసు చుట్టుప్రక్కలనున్నవి. తిరువత్తియూరు నందు, తిరువళ్ళూరునందు యాత్రికుల వసతికొరకు ఎన్నైనా సత్రములున్నవి.

పూర్వము చెన్నపట్టణము సమీపమున కొండూరు అను ఒకచిన్న స్టేషన్ ఉండెడిది. ఆ ఊరినే ఇప్పుడు విల్లివాకము స్టేషనుగ మార్చినారు. ఈ కొండూరునందు విశాలమైన ధర్మసత్రములున్నవి. ఇక్కడొక బావినీరు చాలప్రశస్తమైనదని ప్రతీతి. అందుచే మద్రాసు నుండి అనేకులు అచ్చటికిపోయి వివాహాది శుభకార్యములు చేసుకొనుచుండిరి. ఇప్పుడు మద్రాసులో పసులుగలవారు ఇండ్లను నిర్మించుకొని ఆరోగ్యమునకై అక్కడ నివసించు చున్నారు. ఇటీవల దీనినికూడ ప్రధానమగు చెన్నపట్నమున కలిపివేయవలెననే సూచన ఆలో చనలో నున్నది. అప్పుడప్పుడు మద్రాసునుండి కొందరు అక్కడికిపోయి ఆ విశాలమైన సత్రములలో ప్రతి ఆదివారమున్నూ వనభోజనములను (Picnic Parties) చేసి వచ్చు చుండిరి.

## దుడ్డువారిగుంట—బ్రహ్మతీర్థం

మద్రాసులోయుండు జనులు చాలవరకు బాడుగయిండ్లలలోనే నివసించువారగుటవలన యెవరైనను ఆయింటిలో చనిపోయిన కర్మాంతర్యములను జరిపించుటకు యితర కాపురస్థులు ఒప్పుకొనేవారుకారు. ఈ కారణమువలన మద్రాసులోనివారు చాల యిబ్బంది పడుచుండిరి. ఈ కార్యములను చేయుటకు ధర్మసత్రములను యిచ్చెడివారు కారు. ఇట్టి కష్టములను ముఖ్యముగ బ్రాహ్మణులే అనుభవించుచుండిరి.

ఈ కష్టములనుచూచి యొక బ్రాహ్మణోత్తముడు రాయపురములో ఒక చిన్నతోటను అందు ఒకయిల్లును ఇచ్చి ఈకార్యములను అక్కడ చేయుటకు తగుయేర్పాటులనుచేసి పుణ్య మును కట్టుకొనెను. ఈ బ్రహ్మతీర్థమునందు బ్రాహ్మణులు మాత్రమే అపరక్రియలను జరుపుకొనవచ్చును. ఈ చిన్నప్రదేశము ఇప్పుడు బ్రహ్మాండమైన బ్రహ్మసత్రముగ మారి నది. ఇప్పుడు మద్రాసులో సుమారు పన్నెండు లక్షల జనాభాగలదు. ఈ జనాభాకు తగిన మరణములుకూడ గలవు; గనుక ప్రతిదినము ఈ బ్రహ్మసత్రమునందు పది పన్నెండు కర్మలు జరుగుచున్నవి. వీరందరికి ఇక్కడ తగువసతులు యేర్పాట్లు గలవు, అందరికి

కావలసిన పాత్రసామానులుకూడ యిక్కడ యిచ్చెదరు. కొందరు ధనికుల కర్మలను ఇక్కడ జరిపించినపిమ్మట చనిపోయినవారి పేరట ఒక చిన్న యింటిని ఈ తోటలో కట్టించి యిచ్చెదరు. ఈప్రకారము ఈతోటలో వసతులు పెరిగిపోవుచున్నవి.

పల్లెటూళ్ళలో చనిపోయినవారి కర్మ చేయించుటకు, బ్రాహ్మణార్థములకు ముత్తైదువులు మొదలగువార్లకు చాల కష్టబడవలయును. ఈ బ్రహ్మతీర్థమునందు అలాటి కష్టములు పడవలసిన పనిలేదు. పురోహితులు, బ్రాహ్మణార్థపు బ్రాహ్మణులు, ముత్తైదువులు, దానములను పట్టువారు వీరందరూకూడ అక్కడ హాజరుగనుందురు. పది కర్మాంతరములకు సరిపోవువారందరు అక్కడ సులభముగ లభించెదరు. కర్మచేయు యజమాని స్నానముచేయుటకు ఇక్కడ గుంటగలదు. పురోహితునకు కావలసిన దర్భ ఈ తోటలోనే పెంచుదురు. సమిథల పుల్లలు దొరుకు వృక్షములన్నియు ఈ తోటలోనే యున్నవి. శిలాప్రతిష్టకు మంచి రాళ్ళు యిక్కడనే దొరకును. కర్మనంతయు కంట్రాక్టుతీసుకొని జరిపించే పురోహితులు కూడ ఇక్కడ వున్నారు. నిత్యకర్మ చేయునప్పుడు పిండమును తినుటకు చనిపోయినవారిని స్మరించి కాకులను పిలువ నవసరములేదు. ఇక్కడనే చెట్లమీద వేలువేలు పెంపుడు కాకులున్నవి. ప్రతిదినము పిండములను తినుచు చెట్లమీదనే కాపురముచేయు ఈ కాకులు బలిసియుండును.

మద్రాసులో, భర్తచనిపోయిన స్త్రీని కాపురమండు యింటికి రానివ్వరు. గనుక ఈ స్త్రీలకు బ్రహ్మతీర్థమునగల ఇండ్లు చాల వసతిగను మహోపకారముగ నున్నవి.

ఈలాటి ధర్మములనుచేసిన పుణ్యపురుషులే నిజముగ సంఘసేవకులు.

ఈ సందర్భమున నేనొక చిన్నవిషయమును వ్రాసెదను.

బరంపురం కాపురస్థులగు మారెళ్ళ గంగరాజుగారు మద్రాసుకువచ్చి డాక్టరు రంగాచారి నర్సింగుహోములోచేరి వ్రణచికిత్సను పొందుచుండిరి. వారి వ్రణమును అపరేషన్ చేసిన పిమ్మట ఆ నర్సింగుహోములోనే వారు చనిపోయిరి. వారిభార్య, కొడుకు వగైరాలు వారితో కూడనే మద్రాసునందుండిరి. వారి బంధువులుకూడ మద్రాసులో కొందరుండిరి. గంగరాజుగారు నాకు స్నేహితులగుటవలన నేనుకూడ ఆ సమయమున వారితోకూడ ఉంటిని. వారు యీవూరికి క్రొత్తఅగుటవలన దహనసంచయనాది కార్యములకు నేను సహాయపడి ముగించితిని.

వారిభార్య అప్పుడు వైద్యశాలను విడిచిపెట్టవలసివచ్చినది. ఆమె వుండుటకు మద్రాసులో స్థళము దొరకదాయెను. ఆమె దగ్గరబంధువులుకూడ ఆమెను వారిండ్లకు తీసుకొనిపోరైరి. అప్పుడామెను నా యింటికి తీసికొనిపోయి ఆదరించితిని, వారిబంధువులు యితరులు కూడ ఆమెను నాయింటికి తీసుకపోకూడదని నాకు బోధించిరిగాని నేను వినలేదు. నేను నా యింటికి తీసుక రాకుండిన ఆమెగతి యేమికావలయునో? మన సంఘములోనున్న ఇటువంటి దురాచారములను అడుగంటునట్లు చేయుటయే సంఘసేవ.

ఆమెను నా యింటికి తీసుకపోయిన నా యింటిలో కీడు సంభవించునని బోధించిన వారు ఇప్పుడు లేరుగాని నేనున్నాను; ఆతల్లికూడ సుఖముగ బిడ్డలతోకూడ బరంపురంలో

యున్నది. ఈమె కాకినాడ కాపురస్థులగు గతించిన పోతాప్రగడ బ్రహ్మానందరావుగారి పెద్దకుమార్తె.

## కాఫీక్లబ్బులు

పూర్వము మద్రాసులో కాఫీక్లబ్బులు చెప్పదగినవి లేవనియే చెప్పవలయును. నేను క్రొత్తగనుక మద్రాసుకు వచ్చినప్పుడు అక్కడక్కడ చిన్నయిండ్లలోను వరాండాలలోను వెదురుతడికలను అడ్డముకట్టి మామిడిపలకల బెంచీలనువేసి బ్రాహ్మణులకు లోపలను, తదితరులకు వెలుపలను కూర్చుండుటకు యేర్పాటు చేసియుండేవారు. అప్పుడు వారిచ్చు కాఫీ పేరునకు కాఫీగాని కాఫీవాసనకూడా లేకుండెను. ఆ కాఫీని మురికిలోటాలలో పోసియిచ్చుచుండిరి. వడలు, దోసెలు, మురుకులు, పులిహోర, పెరుగుఅన్నము, పెరుగువడలు మొదలగు ఫలహారములను యెండుటాకులలో పెట్టి యిచ్చుచుండిరి. దాహము కావలసియుండినవారు లోటాతో కొళాయిలో పట్టుకొని త్రాగవలసినదే, నేను ఒకనాడు కొత్వాలుచావడికి సమీపముననుండు ఆదియప్పనాయుని వీధిలో పోవుచుండగ యొకయింటిముందర కాఫీక్లబ్బు బోర్డును చూచితిని. ఆ బోర్డుక్రింద "ఇక్కడ 'తిరుపణ్ణారము' అమ్మబడు"నని వ్రాసివుండెను. ఆ తిరుపణ్ణారమన స్పెషలు ఫలహారముయేమో రుచిచూడవలయుననే ఆశతో క్లబ్బులోపలికి పోయి ఒక తిరుపణ్ణారమును యివ్వమని అడిగితిని. అప్పుడాయన నూనెకంపుకొట్టుచుండిన గారెనుతెచ్చియిచ్చెను. దానివెల కాని యనిచెప్పెను. ఆ వడను యెండుఆకులోపెట్టి మడిచి నూలునుచుట్టి నాచేతులో పెట్టెను. ఈ తిరుపణ్ణారమును తుంచి నోటిలోవేసుకొని రుచిచూచితిని. అది పాసినకంపు, నూనెకంపు కొట్టినందున వెంటనే వీధిలో పడవేసితిని. ఈక్లబ్బులను నడుపువారు ఆకాలమున వైష్ణవులుగనుండిరి. ఇది అప్పటి కాఫీక్లబ్బులరీతి.

## పాత బిచ్చగాండ్రు

మద్రాసులో నాటినుండి నేటివరకు పలువిధములగు బిచ్చగాండ్రు కన్పించుచున్నారు. వీరిలో న్యాయముగ పరుల దానధర్మములపై తప్పనిసరిగా బ్రతుకవలసిన దౌర్భాగ్యులేగాక-కృత్రిమ సంపాద్యపరులు పలువురున్నారు. ఆరోజులలోను మరకాళ్లను కట్టుకొని బిచ్చమెత్తేవారుండిరి. లక్కబొమ్మలను చేతికితగిలించుకొని ఆడించుచు వినోదముకల్పించి బిచ్చమడిగే ఆడవారున్నూ తిరిగేవారు. తురకకొజ్జాలనే నపుంసకులు, మద్దెలతాళములతో ఆటపాటలు ప్రదర్శించుచు ఇండ్లకువచ్చి బిచ్చమెత్తుకునేవారు. కొజ్జాలనగా తురకలలో మగవారైయుండిన్నీ ఆడువారివలె వేషభాషల ననుకరించే యొక విధమగు నపుంసకులు. వీరు నవాబుల అంతఃపురములలో ఘోషాస్త్రీలకు పరిచారకులుగా నుందురు. వీరి ఆటపాటలు, కొంత వెక్కసముగనున్నను పలువురు సామాన్యుల కానందదాయకమై యుండెడివి. కండ్లకు సుర్మా, పండ్లకు దాసిన, కొప్పునపూలు ధరించి, నడుమునకు పావడగట్టుకొని కులుకుచు, నవ్వుచు పురుషులతో సరసములాడుచు, మొగ మొక్కట్లు, ఆడుచందములుగల వీరు హాస్యనిలయములై యుందురు. ఇద్దరు ఎరుకలస్త్రీలు తాటాకుగిలకలను అమ్ముకొనుచు, వీధులలో మూతులు పొడుచుకొనుచు సవతులు బగడపూడు దృశ్యమునుచూపి చూపరుల వినోదపరచి బియ్యమడుగుకొనేవారు.

గారడీవిద్యలను, దొమ్మరిఆటలను మద్రాసు నడివీధులలోచూపి బిచ్చమెత్తువారు కొందరు వచ్చుచుండిరి. పగటివేషములువేసుకొని మోటహాస్యమునుచెప్పుచు బిచ్చమునకు వచ్చువారును కన్పించుచుండిరి. అప్పుడప్పుడు ఆంధ్రదేశమునుండి మరుగుజ్జువస్తాదులు కొందరువచ్చి కఱ్ఱలు కత్తులు త్రిప్పుచు సాముగరడీలను చేసిచూపి బిచ్చముఅడిగేవారు. ఒకజంగం భద్రప్ప పెద్దగంటను చేతపట్టుకొని, మరియొకచేత ఆగంటఅంచును పుల్లతోచుట్టుచుండగా గంటనాలుక గణగణకొట్టుకొను దృశ్యము చూడ చిత్రముగా నుండెడిది. ఒక తెలుగు బిచ్చగాడు బొద్దికూర అమ్ముచు - "బొద్దికూరతిన్నవారు బుద్ధిమంతులు అగుదురు; చక్కిలాలుతిన్నవారు చచ్చిపోదురు''-(అతడు యతికొరకట్లన్నాడేగాని ఇది వాస్తవము కాదు. గృ॥ సం.) అనే పాట పాడుకొంటూ తిరిగేవాడు. కాలిమీద మాంసపుకునకనుపెట్టి కట్టుకట్టుకొని పరుండి లేవ లేనట్లుగ అభినయించు బూటకపు బిచ్చగాండ్లు.మరి అనేక కృత్రిమ బిచ్చగాండ్లను అప్పటి నుండి యిప్పటివరకు ముక్కోటియేకాదశినాడు మద్రాసుదేవాలయములలో చూచుచునే యున్నాను.

## మద్రాసులో మంచినీరు

నేడు మద్రాసులో సుమారు 16 లక్షల జనమున్నారనవచ్చును. ఈఫిబ్రవరి 1 వ తేదినుండి 160 లక్షల గాలన్లనీళ్ళనుమాత్రమే ప్రతిరోజు కార్పొరేషన్‌వారు సప్లయిచేయ గలుగుచున్నారు. అనగా తల 1 కి 10 గాలన్లు లేక $2\frac{1}{2}$ కిరసనాయల్‌డబ్బాల నీరుమాత్రమే. మద్రాసులో నేడు ఎక్కడచూచినను నీటిఎద్దడి కబుర్లే. అయితే ఈస్థితి ఇటీవల జనము హెచ్చుటచేత కలిగిన కొత్తసమస్యకాదు. ఇది మద్రాసు పుట్టిననాటనుండియు ఉన్నదే. 1718లోనే "కోటకు మైలులోపల త్రాగుటకు నీరుదొరకదు''-అని యొకపాశ్చాత్యుడు వ్రాసియున్నాడు. ఆరోజులలో పెద్దినాయునిపేట ఉత్తరభాగముననున్న బావులనీటిని ఎద్దులపై సిద్దెలతోతెచ్చి అమ్మేవారు. 2 దుడ్డులకు ఒక్కబిందెడునీళ్లు అమ్మేవారు. దుడ్డు అనగా 5 రాగికాసులు లేక 2 పైసలు. ఈనీరు చాల చల్లగాను, హితవుగాను ఉండేవట. సెంట్‌థామస్ మౌంటులో దొరకు నీరువలె ఉండేవని ఆ రోజులలో వాటికి ప్రతీతి.

క్రమతః జనాభివృద్ధిఅయినది. 1770 ప్రాంతంలో నీటిఎద్దడివల్ల ఊరిలో కలరా జాడ్యము చెలరేగినది. 1772 లో పెద్దినాయకునిపేటలో ఉండే 7 బావులనుండి కోటకు (రెండుమైళ్ళ దూరము) (సముద్రమున కొక్కమైలుదూరము) మంచినీరు సప్లయిచేసే స్కీము నేర్పాటుచేసిరి.

## ఏడు బావులు

నిజమునకివి 10 బావులు, ఈబావులన్నియు 16 అ॥ ల మధ్యకొలత గలవి. 23 మొ 29 అడుగులలోతు, ఏకోటాలతో నీరుపైకితెచ్చి ఎత్తునగట్టిన తొట్ల నిలువచేసి-యంత్రసాధనమున వడియగట్టుట కేర్పాటు. అట్లు వడియగట్టిన నీటిని పెద్ద గొట్టములద్వారా కోటలోను వెలుపలను యున్న మిలిటరీ వారికి నీటిసప్లయి చేయుచుండిరి. ఈ బావులలో నీరు ఎప్పుడూ సమృద్ధే. మరి ఒక్క శతాబ్దమునకుగాని ఎర్రకొండల చెరువు (Red Hills Tank) ఏర్పాటు

జరగలేదు. ఆ శతాబ్ది కాలములో నిరంతరం ఈ బావులు నీటిని సప్లయిచేసినా నీరు తరుగలేదు. 1885 లో గాలివానవచ్చి ఎర్ర కొండల చెరువువద్ద యంత్రములు చెడిపోయినప్పుడు 10 రోజులు నగరమున చాలమందికి ఈ నీరు సప్లయి అయినది.

1783-87 సం॥ల మధ్య ఈ ఏడుబావుల నీటినే కొళాయిలద్వారా కోటలోను వెలుపలను మిలిటరీ కానివారి ఇండ్లకును సప్లయి చేసిరికాని దీనికి యూరపియనులు, హైందవులునుకూడా ఇష్టపడలేదు. యూరపియనులు బహుశా తమకు నీరు తగ్గునని తలచియుందురు. హైందవులు-యంత్రములలో సప్లయిఅయ్యేనీరు—అనాచారమని ఇష్టపడకుండిరట. పురాతనముగా, దూరమైనా, తాము తెప్పించుకొనే మంచినీరే తెప్పించుకొని త్రాగుట, తమ దొడ్లలో నుండు బావులలోని నీరే వాడుకొనుట విడవకుండిరి.

నేను మద్రాసునకు వచ్చుటకు ముందుఉన్న పరిస్థితులు దుర్భరముగా ఉండేవట. పట్నంవిస్తారంగా పెరిగినది. పరిసరములగల 16 గ్రామములు కలిసి పట్నమైనది. 1871 జనాభా లెఖలలో (అదియే వాస్తవమైన మొదటి జనాభా లెఖ)—4 లక్షలదాకా జనాభా కన్పించుచున్నది. అయితే శతాబ్దమునాడున్న నీటివసతేగాని క్రొత్తవసతి యేమియు యేర్పడలేదు. దూరాభారమునుండి నీరు తెచ్చుకోలేనివారు, స్వంతబావులులేనివారు అయిన పేదసాదలేగాక, అగ్రజాతులవారుకూడా దేవాలయముల నంటిన చెరువులలోను కోనేళ్ళలోను నీరు వాడుకొనేవారు. ఆ కోనేట్లోనే బట్టలుతికి, అందే స్నానముచేసి, అందే శుభ్రముగా తోమిన వెండి, రాగి, ఇత్తడి బిందెలతో ఆ నీరే తడిగుడ్డలతో మడిగా యింటికి తెచ్చుకొని త్రాగేవారు. ఆ నీరెట్లుండునో నాటి యక్జిక్యూటివ్ ఇంజనీయర్ స్టాండిష్ అనే దొర ఇటు వర్ణించియున్నాడు :

"దేవాలయములంటి ఉండే చెరువులు కోనేళ్ళు మున్నగు జలాశయములలో నీరెంత అపరిశుభ్రమో నేటివలగాని చూడడం తటస్థించలేదు; వీటినే ముఖ్యముగా అగ్రజాతులవారుతెచ్చి వాడుకుంటున్నారు. కచాలేశ్వర దేవాలయంలో కోనేరున్నది. అందలి నీటిపై పచ్చగా అట్టవలె పాచి పేరుకొన్నది; బహు కశ్మలమైన మురుగునీటి కాలువలోకూడ నేనంతటి పాచిపేరుకొనుట చూచియుండలేదు. అయినా ఆ నీటిలో స్నానముచేసేవారున్నూ ఉండేవారు."

ఇట్లుండగా నీటి యెద్దడి తీర్చుటకున్నూ, పరిశుభ్రమైన నీటిని సప్లయిచేయుటకున్నూ,-ప్రభుత్వమువారు 1861 నుండి ఆలోచనలారంభించిరి, స్కీములు వేసిరి. ఏడుబావుల నీరున్నూ పరీక్షచేయించి, అందులోకూడా అపరిశుభ్రతయున్నదని అనుమానించిరి. కడకు ఎర్రకొండల చెరువు, చోళవరం పంటచెరువులు కలిపిన స్కీము 1866 లో అంగీకృతమై ఆరేండ్లలో ముగిసినది. ఆ చెరువునుండి శాస్త్రపద్ధతిని నీరుతెచ్చి కీలుపాకులో—సముద్రమట్టమునకు 44 అడుగుల ఎత్తున ట్యాంకులుకట్టి నీరు నిల్వచేసి-వడియగట్టి-ఊరికి సప్లయి చేయ నారంభించిరి. ఇది 13-5-1872 న గవర్నరు నేపియర్‌చే ప్రారంభింపబడినది.

అనగా నా పుటుకలతో ప్రారంభమైన కొళాయినీరు నేను మద్రాసు వచ్చేటప్పటికి బాగా వ్యాప్తిలోనికి వచ్చినది. కాని కొళాయిలలో వచ్చేనీరు పరిశుభ్రముగా నుండేవి కావు. నీళ్ళతో

కూడ చిన్న పురుగులు చేపలు వగైరా జీవములు వచ్చుచుండెను. ఆ కారణమున మద్రాసులో యున్న ధనికులు కొందరు పేరుపొందిన కొండూరు బావినీరును (విల్లివాకం), టాకరు సత్రమునసుండు బావినీరును తెప్పించుకొని త్రాగేవారు. ఈ రెండు స్థళములనుండు నీరు చాల ఆరోగ్యకరమని ఆ కాలపు డాక్టర్లు చెప్పుచుండిరి. ఈ బావుల నీటిని బ్రాహ్మణులు పీపాయిలలో తీసుకొనివచ్చి కావలసినవారికి బిందె 1 కి అణావంతున ఇంటింటికి ఇచ్చిపోవుచుండిరి.

1940—41 లలో మద్రాసులో నీటి సప్లయి వృద్ధిచేయుటకై ఎర్రరాళ్ళ చెరువునకు తోడు పూండి చెరువును చేర్చిరి. కాని ఈ లోపల జనము రెండురెట్లకుమించి పోయినది కావున మనిషి 1 కి నేడు ఒక్క కిరసనాయిలు డబ్బాడు నీళ్ళు దొరుకుట దుర్లభమైనది. ఇక ఆలోచనలోనున్న కృష్ణా పెన్నారు ప్రాజక్టుస్కీము అమలు జరుగుచో మద్రాసునకు నీటి కరవు ఉండదు అని చెప్పుచున్నారు. కావచ్చును; కాని ఆ స్కీము ఇంతలో అమలు జరుగునా యనికూడ నా అనుమానము. దీనికి రెండు ప్రతిబంధకము లేర్పడియున్నవి. రామపాద సాగర ప్రాజక్టు ఏర్పడి గోదావరినీరు కృష్ణకు వచ్చినగాని ఈ స్కీము అమలుజరుగుటకు తగినంత పుష్కలముగ కృష్ణనుండి పెన్నకు నీరు రాజాలదు-అని తెలిసినవా రనుచున్నారు. అయితే జరుగుచున్న ప్రయత్నము ఆ రామపాదసాగరమును వెనుకకునెట్టి ఈ క్రొత్త స్కీము సాగించవలెనని యున్నట్లు కన్పించుచున్నది. రెండవది: ఈ స్కీము అమలు జరిగిన పులివెందల, రాజంపేట తాలూకాలలోని పంటభూములు, పండ్లతోటలు ముంపు అగునని వారు గోలబెట్టుచున్నారు.

శ్రీ వి. డి. కృష్ణస్వామి ఎం. ఏ. (కాంటబ్) గారు ఈ విషయమై చర్చించి 1939లో ఇట్లు వ్రాసియున్నారు :—


“కాబట్టి 1639 లో ఆంగ్లేయులిక్కడ నివాసమేర్పరచుకొనుట కేవలము గ్రుడ్డితనము; ఏలనంటే నాటినుండి నేటివరకు నీటికొరకు దేవులాడడంతప్ప - ఈ సమస్య పరిష్కారమయ్యే సాధనమింకా కన్పించలేదు.” 1949 లోను అదే పరిస్థితులలో నున్నాము.

మద్రాసు నగర మధ్యమున కూవము అని యొకనది పారుచున్నది. అది దుర్గంధమును వెదజల్లుటకుతప్ప మరెందుకు పనికిరాదు. నేను ఇచ్చటికి వచ్చినది మొదలు ఎన్నియో మార్పులు చెందినవి. కాని ఏమాత్రము మార్పుచెందనివి మూడు: కొళాయిలలో అపరిశుభ్రమైన నీరు; కూవమునది దుర్గంధము; దేవాలయపు కోనేళ్ళలో పేరుకొన్న పాచి. వీని కెప్పటికైన మార్పువచ్చునో, రాదో?



# మానవ స్వభావం!



# అనువాద సాహిత్యం

## మా ఇంటి ఖామందు

స్టీఫెన్ లికాక్

నేను మా ఇంటి ఖామందును హత్య చేశానన్న వృత్తాంతం బాగా పొక్కిపోయింది గనక ఆవిషయం నేను ప్రపంచానికి వైనంగా తెలియజేయటం అవసరమని భావిస్తున్నాను.

అందరూ అవసరం లేదని నన్ను అనేకవిధాల హెచ్చరించినా, నేనే ఉండబట్టలేక పోలీసు సూపర్నెంటు దగ్గిరికి పోయి, చేసినపనిని గురించి వాఙ్మూలం ఇస్తానన్నాను. ఆయన ఎంతమాత్రమూ అవసరం లేదన్నాడు. అది రివాజుగానీ ప్రయోజనకారిగానీ కాదుట.

“నువు మీ ఇంటి ఖామందును హత్య చేశావు, బాగుంది. ఏమయితే?” అన్నాడాయన. “ఓవిధంగాచూస్తే ఇది పోలీసులు విచారణ జరపవలసిన విషయంకాదా?” అని అడిగాను. “ఏ విధంగా?” అన్నాడాయన.

ఈ సందర్భంలో నేను కొన్ని అపోహలకు గురికావటం జరుగుతోందనీ, కొందరు స్నేహితులూ, అపరిచితులూ కూడా, యధార్థ పరిస్థితి తెలియక, నాకు పంపుతున్న అభినందనలకు నేను నిజంగా తగననీ, అందుచేత యదార్థ సంఘటనను ప్రపంచానికి చాటగోరుతున్నాననీ విన్నవించాను.

“మంచిది. కావలిస్తే ఫారం నించవచ్చు,” అంటూ ఆయన కాగితాలు వెతక నారంభించాడు.

“మీ ఇంటి ఖామందును చంపానంటావా, చంపబోతున్నానంటావా?” అని ఆయన అడిగాడు.

“చంపేశాను,” అన్నాను.

“మంచిది. మా దగ్గిర వేరే వేరే ఫారములున్నాయి,” అంటూ ఆయన నాకొక అచ్చుఫారం అందించాడు. అందులో నా వయసూ, వృత్తీ, చంపటానికి (ఏమన్నా వుంటే) కారణాలూ వగైరా నేను నించవలసివుంది.

“కారణాలకింద ఏం రాయమన్నారు?” అన్నాను.

“ఏమీలేవని రాస్తే సరిపోతుంది. లేదా, మామూలు కారణాలే అనికూడా రాయవచ్చు,” అని చెప్పి, ఆయన నన్ను మర్యాదగా సాగనంపుతూ, ఇంటి ఖామందును పూడ్చెయ్యమనీ, తాత్సారం చెయ్యవద్దనీ హెచ్చరించాడు.

ఇందువల్ల నాకేమీ తృప్తి కలగలేదు చెప్పొద్దూ. సూపరెంటుగారు తన విధ్యుక్తధర్మం తాను నెరవేర్చాడు మరి. ఇంటి ఖామందుల హత్యకేసులెల్లా విచారిస్తూ కూచుంటే అయినట్టే.

సాధారణంగా ఇంటి ఖామందు అద్దె పెంచటమూ, అందుచేత అతణ్ణి హత్యచేయుటమూ జరుగుతూఉంటుంది. అంతకుమించి మరేమీ ఉండదు. "నీ అద్దె మరో పదిడాలర్లు పెంచాను," అంటాడు ఇల్లుగలవాడు. "సరే, నిన్ను పాతేస్తాను," అంటాడు అద్దెకున్నవాడు. ఒక్కొసారి అంతపనీ చేస్తాడు, ఒక్కొసారి మరిచిపోతాడు.

కాని నా విషయంలో జరిగిన సంగతే వేరు. వచ్చే శనివారంనాడు జాతీయ అద్దెవాళ్ళసమితి నాకు సువర్ణపతకం బహూకరిస్తామనటంతో వ్యవహారం పీకమీది కొచ్చింది. నిజం బయటపెట్టి తీరాలి.

అయిదేళ్ళక్రితం నేనూ, నాభార్యా అద్దెఇంటో ప్రవేశించటం నాకింకా బాగా జ్ఞాపకం. ఇంటాయనే మాకు ఇల్లంతా చూపాడు. అప్పటి ఆయన ప్రవర్తన చూస్తే అందరిలాగే ఉన్నాడు.

ఒక్కసంగతి మాత్రం నాకు వింతగా తోచింది. ఇంటో తగినన్ని అలమర్లు లేనందు కాయన క్షమాపణ చెప్పుకున్నాడు.

"ఈ భాగంలో ఉండవలసినన్ని అలమార్లు లేవు" అన్నాడాయన.

ఆయన అలా అనటం నాకు చాలా కష్టం వేసింది.

"అయితే ఏం ? చూడండి ఈ వంటగది ఎంత విశాలంగా ఉందో. కనీసం నాలుగడుగుల చదరమైనా ఉంటుంది," అన్నాను.

ఆయన తల అడ్డంగాతిప్పి "అలమార్లు మరీ చిన్నవయాయి. మంచివి పెట్టించాలి," అన్నాడు.

మరో రెండునెల్లకి మంచి అలమార్లు పెట్టించాడు. అయన ఈపనిచేసి అద్దె పెంచకపోవటం నాకు విస్మయం కలిగించింది—నమ్మలేకపోయాను.

"ఏమిటి ? అలమార్ల కోసం అద్దె పెంచటంలేదా ?" అన్నాను.

"లేదు. వాటికింద యాభైడాలర్లే ఖర్చుచేశాను," అన్నాడు.

"యాభైడాలర్ల అసలుమీద ఏడాదికి అరవైడాలర్ల వడ్డీ కావటం లేదా ?" అన్నాను.

అమాట నిజమేనన్నాడు గాని అద్దె మాత్రం పెంచటంలేదన్నాడు. శిరోధమన రక్తనీరసవ్యాధికారణంగాఆయన ఈవిధంగా ప్రవర్తించి ఉండాలని సమాధానం చెప్పుకున్నాను. ఆయన్ను చంపాలనే ఆలోచన నాకప్పుడు కలగలేదు. అది దరిమిలాను కలిగింది.

ఒక సంవత్సరం ప్రశాంతంగానే గడిచింది. మాయింటి ఖామందు నా అనుమతితో లోపలికివచ్చి (ఇదే ఎంతో వింతైన మాట) ఇంటికి సున్నం కొట్టిస్తానన్నాడు. నేనెంత వద్దన్నా వినలేదు.

"ఈ ఇంటికి సున్నంవేసి పదేళ్లయినా అయిందో లేదో," అన్నాను.

"అయింది. అప్పటికీ ఇప్పటికీ సున్నం ధర రెట్టింపయింది." అన్నాడు.

"అట్లాఅయితే మరి మాఅద్దె కనీసం ఇరవై డాలర్లన్నా పెంచాలి," అన్నాను.

"పెంచేదిలేదు," అన్నాడు.

దాంతో మాయిద్దరికీ కాస్త బెడిసింది.

ఆ తరువాత జరిగిన సంఘటనలు మరింత విస్పష్టమైనవి. ఆమధ్య ఇళ్ళ ఖరీదులు హెచ్చుటంవల్ల అద్దెలు విపరీతంగా పెరగటం అందరికీ తెలుసు. మా ఇంటి ఖామందు మా భాగానికి అద్దె పెంచ నిరాకరించాడు.

"ఇళ్లఖరీదు రెట్టింపయింది," అన్నాను.

"నేను ఇళ్లుకట్టటం లేదుగా. ఈ ఇంటి మీద నాకు ఏడాదికి ఖచ్చితంగా నూటికి పదిచొప్పున గిట్టుబాటవుతోంది," అన్నాడు.

"మీ భార్యసంగతి కాస్త ఆలోచించండి," అన్నాను.

"ఆలోచించను," అన్నాడు.

"అవిణ్ణిగురించి ఆలోచించటం మీధర్మం. నిన్ననే పత్రికల్లో ఒక ఇంటి ఖామందు ప్రచురించిన లేఖ చూశాను. ఇళ్ల ఖరీదు పెరిగిపోవటంనుంచి ఆయన తన భార్యా బిడ్డలనుగురించి ఆలోచించవలిసి వచ్చిందన్నాడు. చాలా హృదయ విదారకమైన లేఖ," అన్నాను.

"అయితే అయింది. నాకు పెళ్లిలేదు," అన్నాడు మాఇంటి ఖామందు.

"ఓహో, పెళ్లికాలేదా?" అన్నాను. ఆమనిషిని సాగనంపాలనే ఆలోచన నా కప్పుడే కలగ నారంభించిం దనుకుంటాను.

ఇంతలో నవంబరు సంఘటన జరిగింది. యుద్ధవిరమణోత్సవ సందర్భంలో ఇళ్లఅద్దెలు సగానికి సగం హెచ్చిపోవటం అందరికీ తెలిసిన విషయమే. మా ఇంటి ఖామందు ఈ ఉత్సవంలో పాల్గొన నిరాకరించాడు.

ఈపాటి దేశభక్తి అయినా ఆమనిషికి లేకపోవడంచూస్తే నాకు మండిపోయింది. మార్షల్ ఫాష్ రాక సందర్భంలోనూ, మాజీసైనికుల గౌరవార్థమూ అద్దెలు పెంచబడినప్పుడు కూడా ఇలాగే జరిగింది.

అది అప్రయత్నంగా, దేశభక్తి ప్రేరణతో జరిగిన విషయం. అనేకమంది సైనికులు, ఇదే తమకు ప్రథమ స్వాగతమనీ, దీనిని జన్మలో మరవలేమనీ అనటం నా చెవులారా విన్నాను.

ఇది జరిగినతరువాత ప్రిన్స్ ఆఫ్ వేల్స్ స్వాగతంకోసం మళ్లీ అద్దెలు పెంచ

ఖర్దాయి. అంతకుమించిన ధన్యవాదాలు ఆయనకు అర్పించటం సాధ్యమై ఉండదు.

మా ఇంటి ఖామందు ఇదేమీ పాటించలేదు. ఇంటి అద్దె పెంచలేదు. "నా నూటికి పదీ నాకు ముడుతున్నాయి," అన్నాడు.

ఆయన తలలో రక్తదౌర్బల్యం మేధస్సును ఒకపక్కంతా తినేసి వుండాలనుకున్నాను.

కర్తవ్యం ఆలోచించసాగాను.

కిందటి నెల వ్యవహారం ఫయిసలా అయింది. జర్మను మార్కు నాణెం పడిపోయిన కారణంగా అద్దెలు చప్పున లేచాయి. చక్కని వ్యాపారదృష్టితోనే ఈ ఏర్పాటు జరిగింది.

మార్కు పతనాన్ని ఈవిధంగా ఎదుర్కొకపోతే మనం చిత్తయి ఉండేవాళ్లమన్నమాట. చవుక మార్కుతో జర్మనులు కాస్తా మన ఇళ్లు పుచ్చేసుకునుండేవారు.

మా అద్దె పెరుగుతుందేమోనని మూడు రోజులు ఎదురుచూశాను.

ఆ తరవాత ఆఫీసులో మా ఇంటి ఖామందును చూడబోయినాను. దగ్గిర రివాల్వరుంచుకున్న మాట నిజమే. కాని ఆ మనిషిని ఎలా నమ్మటం? అతని మేధస్సు సగం కుళ్లిపోయింది.

ఆటే వ్యర్థాలాపాలులేకుండా, "జర్మను మార్కు ఎట్లా పడిపోయిందో చూశారు గద." అన్నాను.

"అవును. అయితేఏం?" అన్నాడు.

"మరేమీ లేదు. నా అద్దె పెంచుతున్నారా లేదా?"

"లేదు. పెంచటం లేదు."

రివాల్వారుఎత్తి కాల్చాను. ఆ సమయంలో నాకు ఆయన పక్కవాటుగా కూర్చుని ఉన్నాడు. మొత్తం నాలుగు గుళ్లు కాల్చాను. ఒకగుండుతో ఆయన వేస్టుకోటు వాలికలైపోయింది. రెండో గుండు కాలరు ఊడదీసింది. మూడోదీ, నాలుగోదీ ఆయన వీపుమీది బ్రేసులు తెంపేశాయి. ఆయన కుంగిపోతున్నట్టు కనిపించాడు. లేచి వీధిలోకి వెళ్లగలడనేది అనుమానాస్పదంగా కనిపించింది. ఒకవేళ వీధిలోకి పోయినా వీధివెంట నడవలేడనేది రూఢి అయింది.

ఆయన్ని అక్కడ వదిలేసి మొదట చెప్పిన విధంగా పోలీసులకు రిపోర్టు ఇచ్చాను.

అద్దెవాళ్ల సంఘంవారు నాకు పతకం ఇవ్వదలిస్తే ఈ విషయాలన్నీ సరిగా తెలుసుకొని మరీ ఇవ్వాలని నాకోరిక.





# అర్ధాంగి

కొడవటిగంటి కుటుంబరావు

ఒక వర్గాన్ని మరొకవర్గం కాల్చుకుతింటే అది చరిత్ర. అది ఘనమైన విషయం. అదొక సాంఘిక పరిణామదశ. దాన్ని మార్క్సులనేవాళ్లు కూడా దానికి శాస్త్రీయ కారణాలు ఉద్ఘాటిస్తారు.

ఒక పీడితవర్గం తిరుగుబాటుచేసి పీడించే వర్గాన్ని నాశనంచేస్తే అది విప్లవం. అదీ ఘనమైన విషయమే. అది మరొక సాంఘిక పరిణామదశ. దానిమీద ప్రతివిప్లవం సాగించటానికి బ్రహ్మాండమైన ప్రయత్నాలు జరుగుతై.

ఒక బుద్ధిలేని ఆడది - బుద్ధీ, జ్ఞానమూ, ఆత్మనిగ్రహమూ, ఆదర్శమూ, ఆశయమూ లేని ఆడది - పీడితవర్గానికి చెందికూడా వర్గ చైతన్యంలేని ఆడది - అంతో ఇంతో సంస్కారంగల తన మొగుడి జీవితాన్ని సర్వనాశనంచేస్తే దాన్ని ఏమంటారు?

* * *

పార్వతీశం ఒక వ్యక్తికాదు. అతను లక్షలాది మధ్యతరగతి ప్రజలకు ప్రతినిధి. అతనికి పెద్ద ఆస్తిలేదు. అతని పూర్వీకులు ఉన్నప్పుడు ఖర్చులుచేసీ, లేనప్పుడు అప్పులు తెచ్చీ, గత్యంతరంలేనప్పుడు ఆస్తులు తెగనమ్మీ అప్పులు అణాపైసలతో సహా తీర్చీ, దొరికినప్పుడు ఉద్యోగాలుచేసీ తమ మధ్యతరగతి పరువుకు భంగంలేకుండా, దివాలా ఎత్తకుండా, ముష్టిఎత్తకుండా గడుపుకొచ్చారు. నౌకర్లూ, చాకళ్ళూ మొదలైన తక్కువ వర్గాలవాళ్ల వారు దుమ్ముకొట్టినా, తమ వర్గం వాళ్ళనీ, తమపై వర్గాలనూ ఏవిధంగానూ దోపిడిచెయ్యలేదు; వారిపట్ల ఎంతో సత్ప్రవర్తకులై నడుచుకున్నారు. వారు తమ స్త్రీలను జన్మతహా తక్కువ వర్గానికి చెందిన వాళ్ళను చూసినట్టే చూశారు; వాళ్ళచేత చాకిరిచేయించుకున్నారు, పిల్లల్ని కనిపించారు, వాళ్ళకి శలవు లివ్వలేదు, చదువు సంధ్యలు చెప్పించలేదు, సంఘసేవ చెయ్యనివ్వలేదు; తమకు పనికొచ్చే నీతిని తమ ఆడవాళ్ళకు పనికిరానివ్వలేదు, తాము పరస్త్రీల సంపర్కం పొందినట్లు తమస్త్రీలు పరపురుషుల సంపర్కం పొందటానికి అనుమతించలేదు; ఏస్త్రీఅయినా ఈ నియమాలను అతిక్రమించినప్పుడు వారు ఆ స్త్రీమీద తగుచర్య తీసుకున్నారు.

కాని వాళ్ళు వ్యక్తిగతంగా దుర్మార్గులు కారు, అన్యాయపరులు కారు. వారు తమ వర్గంయొక్క ధర్మాన్ని సద్బుద్ధితో ఆచరించారు. వారికి నీతి, జాలీ, న్యాయబుద్ధీ, జ్ఞానమూ ఉన్నై. తమ వర్గధర్మానికి అడ్డం లేనంతకాలమూ వాటిని వారు ఆరాధించారు. వర్గస్వరూపాన్నిగురించి వారికి తెలియదని చెప్పవచ్చు. ప్రపంచంలో మానవులైన వాళ్ళంతా ఆచరించవలసిన ధర్మాన్నే తామూ ఆచరిస్తున్నామని వారు నమ్మారు. సమాజంలో వ్యత్యాసాలుంటే అవి కులంవల్లనే ఏర్పడుతున్నాయనీ, ఆ కులాలనేమో దేవుడే స్వయంగా నిర్ణయించాడనీ వాళ్లు విశ్వసించారు. కులవ్యవస్థనుగాని, వర్గవ్యవస్థనుగాని మార్చటానికి వాళ్ళు ప్రయత్నించలేదు. ఎవరైనా మార్చటానికి ప్రయత్నిస్తే నిరోధించి ఉండే వాళ్ళేకూడానూ.

ఇటువంటివాళ్ళకు పుట్టాడు పార్వతీశం. 1915 లో పుట్టటంచేత పార్వతీశానికి కొన్ని

కొత్తలక్షణాలు అబ్బినై. అతను తండ్రిలాగా కాక, తనవర్గానికి అనుకూలించని సంస్కారం ఇచ్చే చదువులు చదివాడు. దరిద్రుల దారిద్ర్యానికీ, నిరక్షరుల నిరక్షరతకు, స్త్రీల అధోగతికీ బాధ్యత భగవంతుడిది కాదనీ, సంఘంలో పెద్దలైనవారిదని తెలుసుకోవటమే కాక తన వర్గంయొక్క సంస్కారాన్ని సహృదయంలేకుండా చూశాడు.

అయితే పార్వతీశం విప్లవవాదిమటుకు కాదు. అడివి చూడబోయినవాడికి చెట్లు మాత్రమే కనిపించినట్టు పార్వతీశానికి వ్యక్తులే తప్ప వర్గాలు కనిపించలేదు. తాను పొందిన సంస్కృతే అందరూ పొందితే సంఘం నిర్దుష్టమవుతుం దనుకున్నాడు.

* * *

అతనికి పద్దెనిమిదో ఏట వాళ్ళవాళ్ళు పన్నెండేళ్ళ పిల్లనిచ్చి పెళ్ళిచేశారు. ఈ పిల్ల మరో రెండేళ్ళలో కాపరానికి వచ్చింది. ఆమెపేరు శకుంతల. వాళ్ళవాళ్ళు ముద్దుగా చక్కమ్మా అని పిలిచేవాళ్ళు.

శకుంతల చదువుకున్నది కాదని పార్వతీశం ఎరుగును. అందుచేత ఆమెకు తనకున్న జ్ఞానంగాని ప్రపంచజ్ఞానంగాని లేదని అతను ఊహించే ఉండాలి. అయితే ఆమెకు తనకున్న సంస్కారమే, తనకున్న మనస్తత్వమే, తనకున్న సాంఘిక విలువలే ఉంటా యనుకున్నాడు పార్వతీశం. అత నట్లా ఎందుకనుకున్నాడో మనకు తెలీదు.

గర్భాదానంనాడే శకుంతల తన మొగుడు వట్టి వాజ అని నిర్ణయించుకుంది. అతని ప్రేమాలాపనలన్నీ పిచ్చివాడి పేలాపనలల్లే ఆమెకు తోచినై. ఆమె ఒకందుకు సంతోషించింది; తన శరీరానికి ఈ మొగుడుముండాకొడుకు దాసోహమైనట్టు కనిపించాడు. తనకు సాధారణంగా తోచే శరీరమే అతనికి అపూర్వంగా ఉన్నట్టుంది. చక్కమ్మ, కొనే వాడి అవసరం గ్రహించి ధరపెంచే వర్తకుడల్లే, తన శరీరాన్ని సాధ్యమైనంత హెచ్చుధరకు మొగుడికి విక్రయించటానికి నిశ్చయించింది.

చక్కమ్మ దృష్టినుంచి పార్వతీశం చదువుకుని చెడిపోయినవాడు. పెళ్ళాన్ని కామించ



టంతోపాటు ప్రేమించటం పార్వతీశానికి ఒక అవసరం. ఆమెకు కాదు. చివరకు ముద్దుపెట్టుకోవటంకూడా ఆమెకు ఎబ్బెట్టుగానే ఉంది.పశుసహజమైన కామసంతృప్తి మినహా ఆమెకు ఏదీ అర్థంకాదు. మొగుడు పద్యాలు చదవటమూ, ఏవేవో అర్థంలేని భావాలు తనతో పంచుకోవటానికి ప్రయత్నించటమూ చూసి ఆమెకు చాలా అలుసైపోయింది.

పార్వతీశం చాలాకాలం తనభార్య యధార్థ స్వరూపం ఎరగడు. తనమనసులో ఆమెకొక ఆదర్శస్వరూపం ఇచ్చుకుని ఆ ఆదర్శ స్వరూపాన్నే తనభార్యలో చూసుకున్నాడు. ఈలోగా తాను చెప్పేదంతా తనభార్య అర్థం చేసుకుంటున్న దనుకున్నాడు.

ఎవడుమాత్రం స్వప్నప్రపంచంలో ఎంత కాలం ఉంటాడు. నిద్ర అయిపోతుంది, కలలు విచ్చిపోతై. పార్వతీశం సహితం తన భార్య మట్టికుండ అని తెలుసుకుంటాడు.

ఈ సంగతి తెలుసుకున్నాక పార్వతీశానికి తనమీద కోపం రావటానికి బదులు పెళ్ళాం మీద కోపం వచ్చింది. ఈ అడివిమొద్దు, ఈ పశుప్రాయురాలు, తనను వంచించిం దనుకున్నాడు; తన సంస్కారానికి తీరని అవమానం చేసిందనుకున్నాడు. ఆమె తనంతట తనను ఎన్నడూ ఎందుకు ముద్దుపెట్టుకోలేదో, ఆమెను పేరుపెట్టి పిలిస్తే ఎందుకు అభ్యంతరంచెప్పిందో అతనికి అర్థమయింది. తాను ప్రేమకొద్దీ తీర్చిన ఆమె కోరికలన్నీ వ్యామోహంకొద్దీ తీర్చినట్లు ఆమె భావించటం అతడు మరీ భరించలేకపోయినాడు. తనవంటి మధ్యతరగతిసంస్కారి పశుకామానికి వశుడౌతాడా? తనభార్యకు తనమీద అటువంటి తుచ్ఛమైన అభిప్రాయం ఏమని కలిగింది?

ఈ అభిమానం తనలో కలిగినతరవాత కూడా పార్వతీశం తన పెళ్ళాం దేహాన్ని యాచించాడు. కాని తాను పశుకామానికి దాసుడవుతున్నాడని అతను ఒక్కనాటికి భావించలేదు. ఆమె శరీరానికి కొత్తరకం ఆనందం ఇచ్చి తద్వారా ఆమె మనస్సులో ఏదో పరివర్తన కలిగిస్తున్నాననే అతను ఎప్పటికప్పుడు భ్రమపడ్డాడు. ఆమెకు కొత్తరకం ఆనందం ఏమీ కలగలేదు. పైగా అతను తన శరీరానికి దాసుడనేది ఆమె రుజువుచేసుకున్నది.

* * *

పార్వతీశం పరస్త్రీమోహం ఎరగకుండా ఆ పెళ్ళాంతోనే మూడేళ్ళు కాపరం చేశాడు.ఏ నాలుగునెలలో అతను కలలుకంటూ పొందిన ఆనందం తప్పిస్తే అతను ఆనందమనేది ఎరగడు. రోజులు గడిచినకొద్దీ అతనికి పెళ్ళాంమీదా, సంసారంమీదా, శరీర సుఖంమీదా, సంఘంమీదా, సృష్టి మీదా, దేవుడిమీదాకూడా విరక్తి కలగసాగింది.

ప్రపంచంలో తనకంటె అదృష్టవంతులూ, తనకన్న స్త్రీలప్రేమను విజయవంతంగా సాధించినవాళ్లు ఉన్నారనుకోవడం ఇష్టంలేక అతను ప్రణయకథ లన్నిటినీ, ప్రేమనంతనీ తిట్టిపోశాడు. తన భార్యవంటి వ్యక్తులుగల స్త్రీజాతిని తిట్టిపోశాడు. తనకూ ఈ భార్యకూ తెగనిబంధం కల్పించిన సంఘాన్ని తిట్టిపోశాడు. ఈ పెళ్ళాం చచ్చిపోయి తాను ఇంకో ఆడదాన్ని—ఇంకెవరినన్నా సరే — పెళ్ళాడినట్లు కలలు కన్నాడు. ఈ పెళ్లామే చస్తే ఇహ చచ్చినా పెళ్లాడరాదనుకున్నాడు. అచ్చుపోసిన ఆంబోతల్లే స్వైరవిహారం చేస్తూ, నీతిని ధిక్కరించి తిరిగే ఆడవాళ్ళం దరితోనూ అంతులేని ఆనందం అనుభవింతామనుకున్నాడు.

అందరూ తనభార్యవంటివాళ్ళు కారని అతనికి అనుమానం వేసింది. అనుభవం మీదకాని తెలియదనిపించింది. పరస్త్రీతో



పోవటం అతను ఎంత కష్టమని భావిస్తూ వచ్చాడో అంత సులభంగా అతనికి మొదటి అవకాశం దొరికింది. ఆవిడ ఒక ప్లీడరు గుమాస్తా భార్య. ఏమీ అందకత్తె కాదు. పిల్లలు లేరు. అంతో ఇంతో ఖ్యాతి సంపాదించుకున్న మనిషి. రంకుతనం ఆమెకు అతిసులభం. ఏరోజూ మొగుడు ఉదయం పది సాయంకాలం ఎనిమిదిగంటల మధ్య ఇంటో ఉండడు. ఇంటో ఇంకెవ్వరూ ఉండరు. ఆవిడకు పిల్లలు లేరు. ఎదో అపరేషనుచేస్తే గాని పిల్లలు పుట్టరని వైద్యులు చెప్పారు.

ఈ ప్లీడరు గుమాస్తా పెళ్ళాం రసికుడైన వాణ్ణి మెప్పించగలదికాదు. వెకిలిమనిషి. అయితే మంచిహృదయం కలది. ఆవిణ్ణి మన పార్వతీశం తన భావనాశక్తినంతా వినియోగించి ప్రేమించాడు. ఆవిడను అంత నాజూకుగా ప్రేమించినవాళ్ళెవరూ లేరు. ఆవిడ పార్వతీశాన్ని వొదలలేకపోయేది, ఒకపూట కనిపించకపోతే ఏడిచేది.

పార్వతీశానికి జన్మ తరించినట్లయింది. ఒక స్త్రీని ప్రేమించి ఆమె ప్రేమ పొందటం కన్న మగవాడికి పురుషార్థం ఏమిటి? తన పెళ్ళాంతో మూడేళ్ళలో చేయలేకపోయినపని ఈవిడతో మూడురోజుల్లో చేశాడు. తన పెళ్ళాంమీద సాధించిన ఈ విజయం పెళ్లానికి చెప్పుదామని అచుకోరాని ప్రేరణ వచ్చింది పార్వతీశానికి. కాని సంస్కారం కలిగినవాడై దాన్ని అణుచుకున్నాడు.

అయినా నిజం దాగలేదు. తననుంచి ఏ సుఖంకోరి తన మొగుడు తనకు దాసుడైనాడని శకుంతల ఇంతకాలమూ నమ్మిందో ఆ సుఖం అతనికి లభ్యమౌతున్నదని శకుంతల

అతని నిర్లక్ష్యాన్నిబట్టి సులభంగా గ్రహించింది. ఎవరో చెబుతావా, చస్తావా అని కూర్చున్నది. రంకుచేసి ఆడది బొంకాలిగాని మగవాడు బొంకవలసిన కర్మమేం? అబద్ధం ఆడటానికి తన కిష్టంలేనందుకు తన్ను తాను అభినందించుకుంటూ పార్వతీశం పెళ్ళాంతో తన మొదటి ప్రణయవృత్తాంతం చెప్పేశాడు.

దానిపై శకుంతల చేసిన అల్లరి వర్ణనాతీతం. తనమాదిరిగానే పరువైన మధ్యతరగతికి చెందిన తనభార్య అంతదూరం వెళుతుందనుకోలేదు పార్వతీశం. భర్తలు ఇతర స్త్రీలతో పోయినప్పుడు మధ్యతరగతి ఆడవాళ్ళు ఏడుస్తారు. భర్తల హృదయాలు కరిగించటానికి ప్రయత్నిస్తారు, సహనం చూపిస్తారు, అవతలి ఆడదానికన్న తానే ఎక్కువైనమనిషి అని ఋజువుచేసుకోవటానికి ప్రయత్నిస్తారు. లేకపోతే ఏం జరుగుతుందో వాళ్ళకి తెలుసు—భర్తలు తమను పుట్టింటికి పంపేసి మళ్ళీ పెళ్ళిచేసుకుంటారు. "అయ్యో, ఇదేంపని?" అనేవాళ్ళుండరు.

కాని శకుంతలకు ఈ భయం ఉన్నట్లు కనిపించలేదు. ఆమె మొగుణ్ణి చిన్నతనంలో కూడా పెద్దవాళ్ళు, ఉపాధ్యాయులూ అనని మాటలన్నీ అన్నది. ఏ జన్మలోనో మహాపాతకం చేసుకుంటే ఇటువంటివాళ్ళకి పెళ్ళాలవుతారన్నది. పార్వతీశాన్ని కుక్క అన్నది. అతన్ని "ఛీ" అన్నది. ఇంటో పగిలిపోయే వన్నీ పగలగొట్టింది. చుట్టుపక్కల పది ఇళ్ళ వాళ్ళకు వినిపించేటట్టు కేకలుపెట్టింది. వింత చూడవచ్చిన వాళ్ళకు మొగుడుచేసిన పని గట్టిగా చెప్పేసింది. కొందరు ఆమె నోటి మాటలు భరించలేక అక్కణ్ణుంచి పారిపోయినారు. చేస్తున్న వంటపొయిలో నీళ్ళుపోసేసి పోయి పడుకున్నది.

పార్వతీశం నిర్ఘాంతపోయినాడు. విశ్వరూపం చూసినట్టయింది అతనికి. నలుగురిలోనూ అతనికి తీరని అవమానం అయింది. తన భార్య ఎంత విడ్డూరంగా ప్రవర్తించినా, అట్లా ప్రవర్తించే హక్కు ఆమె కున్నదేమో ననిపించిం దతనికి.

అందర్నీ పంపేసి తలుపులు బిగించి భార్యదగ్గిరికివచ్చి అతను గంభీరంగా ఆమె అభిప్రాయం తెలుసుకోవటానికి ప్రయత్నించాడు, తమ ఇద్దరి బాంధవ్యమూ ఏదో విధంగా ఒకపరిష్కారానికి తీసుకొద్దామని ప్రయత్నించాడు.

అతను ఎంత శాంతంగా ఈ సమస్యను ఎదుర్కొనటానికి ప్రయత్నించాడో ఆమెఅతనికి అంతకోపం తెప్పించింది. ఆమెతోతర్కించటం కన్న బుద్ధితక్కువ లేదనిపించింది.

"నేను మంచివాణ్ణికాను. నీకున్న నీతినాకు లేదు. ఆ సంగతి నువు గ్రహించావు కనుక నీపుట్టింటికి వెళ్ళిపో," అన్నాడుపార్వతీశం.

"అబ్బ! ఆశ! నేనంత సులభంగా పోతాననా? నన్ను పంపించేసి అడ్డమైనముండల్నీ ఇంట్లోనే తెచ్చిపెట్టుకుందామనా? ఎట్లా పెట్టుకుంటారో చూస్తాను," అన్నది చక్కమ్మ.

"ఉండదలుచుకున్న దానివి సుఖంగా ఉండు. ఈ తద్దినమేమిటి నాకు?"


"తద్దినం ఎందుకు తెచ్చుకున్నారూ? మీరు కనపడ్డ కుక్కవెంటల్లా పడటమేం? నేను సుఖంగా ఉండటమేం?"

"నన్ను నిష్కారణంగా అల్లరిపెడితే నీకేం దొరుకుతుందీ?"

"అంత చెప్పగూడని పనులు చెయ్యటమేం? చెయ్యగాలేందీ అనుభవించటానికి అభ్యంతరమా?"

"నేను నీ మొహం చూడను. నీతో మాట్లాడను. నీకూనాకూ సంబంధంలేదు తెలిసిందా? ఎందుకు నువ్విక్కడా?"

"ఇది నా ఇల్లు నేనెందుకు పోవాలి?"



"నేను బయటికి ఈడిస్తే?"

"ఎట్లా ఈడుస్తారో చూస్తాను!"

"నీకు విషంపెడితే ఏంచేస్తావు?"

"ఈ మాట అన్నారని ఇప్పుడే మా వాళ్లకి రాస్తాను. నేనుచచ్చానోమిమ్మల్నిఉరితీస్తారు. లేకపోతే నా పేరు మారుపేరు పెట్టండి."

"నిన్ను రోజూ కొట్టి హింసిస్తాననుకో?"

"నా మీద చెయ్యివెయ్యండి చెబుతాను. మా పినమామయ్యకు రాశానంటే జైల్లో తోయించగలడు."

శకుంతలకు వేలువిడిచిన మామయ్య ఒకడున్నాడు. ఆయన పోలీసు సబిన్స్పెక్టరు.

"నావల్ల ఏమీ సుఖంలేకపోయినా ఇక్కడే ఉంటావన్నమాట?

"నా కేదోసుఖం వెలగబెట్టి ఏడుస్తున్నట్టు! ఏది? ఆ మంగమ్మ దగ్గిరకెళ్ళి రోజూ పడుకోటమేనా నా సుఖం? ఛీ! సిగ్గయినాలేదు చెప్పుకోవటానికి!"

*　　　*　　　*

తన మొగుడి జీవితం నరకం చెయ్యటానికి శకుంతల కంకణం కట్టుకున్నది. ఆ పని విజయవంతంగా సాగించింది కూడాను. అతని కోసం మగవాళ్లుగాని ఆడవాళ్లుగాని ఇంటికి రావటానికిలేదు. ఆమెను అతను వొదిలించు కోలేదు.

బయటా అతనికి సుఖంలేదు. అనేక మంది స్త్రీలను ప్రేమించటానికి ప్రయత్నించాడు. అచ్చగా ప్రేమను కోరిన స్త్రీ ఎవతె కూడా కనిపించలేదు. కొందరు ప్రేమ తాంబూలంతో దక్షిణకోరారు, మరికొందరు-మొగుళ్ళతో కాపరంచేసి పిల్లల తల్లులైన వాళ్ళు—ప్రేమతోపాటు క్షేమంకూడా కోరారు. అన్నప్పుడల్లా వాళ్ళు అందరు. వొళ్ళు అమ్ముకునే వాళ్ళనూ, ఊసుపోక రంకుతనం చేసే వాళ్ళనూ ప్రేమించటంకంటె రోతలేదు.

తన కాపరమూ తన బతుకూ ప్రపంచానికంతకూ తెలుసు. తను ఇంటోలేని సమయాల్లో శకుంతల వాడవాడా తిరిగి తనమీద ప్రచారంచేసి వస్తుంది.

ఎక్కడికన్నా లేచిపోయి బైరాగల్లే తిరుగుదామనీ, పెళ్లాన్ని చంపి తానూ చచ్చిపోదామనీ కూడా పార్వతీశానికి ఆలోచన



వచ్చిందిగాని అతనికి సంఘంమీదా, ప్రాణం మీదా ఇంకా వ్యామోహం తీరలేదు. జీతం మూడొందలు వస్తుంది. ఇది ఎటూ కానిది. విచ్చలవిడిగా ఖర్చుచేయటానికి తక్కువా, విరక్తిగా జీవించేటందు కెక్కువాను.

ఏ భర్తకీ సాధారణంగా రాని ఆలోచన కూడా పార్వతీశానికి కలిగింది. తన పెళ్లాం ఎవరినన్నా తగులుకుని లేచిపోరాదా? ఈ ఆశ అంతలోనే అడుగంటింది. ఈ పిశాచిని ఎవరు తగులుకు పోతారు!

ఇప్పటికి పదమూడేళ్ళ పైచిల్లర కాలం నుంచీ పార్వతీశం ఈ మహాసముద్రానికి దరీ దాపూ కానకుండా ఉన్నాడు. ఇటీవల అతనికి ఈ గాఢాంధకారంలో కించిత్తు ఆశా జ్యోతి కనిపించింది. ఎవరో జ్యోతిష్కుడు అతని జాతకంచూసి జరిగిందంతా పూసగుచ్చి నట్లు చెప్పి, "నీకు పదహారేళ్ల క్రితం ఆరంభ మైనశని ఇంకా మూడేళ్లలో వదులుతుం"దని చెప్పాడు.

ఎంత సంస్కారమూ, ఎన్ని ప్రణయాలూ ఇవ్వలేని ఆనందం ఈ మాటతో పార్వతీశానికి కలిగింది. ఇంకా మూడేళ్లకు తన భార్య చచ్చిపోతుంది. మళ్లీ తనకు పెళ్లిగీతలేదు—

"ఆతరవాత దేవుడు నాకు రెండేళ్ళు ఆయుర్దాయం ఇస్తేచాలు! ఆ రెండేళ్లూ నాకు కావలసినట్టు బతుకుతాను." అనుకున్నాడు పార్వతీశం.


ఒక్కసారిగా అతని మనస్తత్వమంతా మారిపోయింది. అతను రోజూ నేరుగా ఆఫీసు నుంచి ఇంటికి రాసాగాడు. భార్యమీద తన కున్న క్రోధమంతా వినియోగించి, కేవలం పశువులాగా ఆమెదగ్గిర సుఖంపొందసాగాడు. ఇప్పుడు ప్రణయాలాపాలూ అవీ లేవు. నాజూకు లేదు. సంస్కారం లేదు.

శకుంతల అభ్యంతరం చెప్పలేదు. మొగుడు తనను అవమానం చేస్తున్నట్టు భావించలేదు. ఇన్నేళ్ళకు తను తనతో మొగుడల్లే ప్రవర్తిస్తున్నట్టు కనపడసాగింది. ఒక్కోరోజు ఆమె అతనిదగ్గిరపడుకో నిరాకరించేది. అతను బలాత్కరించేవాడు, తొడలు గిల్లేవాడు. ఆమె ఆనందానికి మేరేలేదు.

ఆమె ఇప్పు డతనిపట్ల ఆదర్శగృహిణిగా వర్తిస్తున్నది. తనను అర్ధాంగిగా చేసుకోలేక పోయిన పార్వతీశం ఆమెకు అర్ధాంగి అయినాడు.

ఆమె ఇప్పుడు కడుపుతో ఉంది — ఇన్నేళ్లకి.

ఈ విషయం ఎందుచేతో జ్యోతిష్కుడు చెప్పలేదు.....




# శివరంజని

చిక్కయ్య.-పండిపండి అరమగ్గి రాలిపోయి నాడు : గుటుక్కుమనగానే అతడి ఆత్మ స్వర్గానికి ప్రయాణం కట్టింది : పోతూపోతూ, ఆ బుంగమీసాలూ, ఆ పాత తంబురా, అంటిపట్టుకు వెళ్ళింది:

—స్వర్గందాకా వెళ్ళాడు : బయట గేటు వేసిఉంది :

'పావం, నిద్రపోతున్నారేమో!' అనుకుని తట్టకుండా అక్కడేఉన్న ఓ చట్టుమీద చదికిల పడ్డాడు :

ఎంతసేపు అలా కూర్చుంటాడూ?–విసుగేసుకొచ్చింది : మీసాలు ఎగసన దోసుకుని, తంబురాదండె అందుకుని, పంటితో చుంగు బిగించి, ఠింగ్ మనిపించి, గొంతు ఎత్తాడు;

అవతలివాళ్ళకు నిద్రాభంగం అవుతుందేమోనని, - కూనిరాగంగానే ఎత్తుకున్నాడు- కాని మనసు ఊగినకొద్దీ మీటు మోపైంది- ఆలోకంలో ఒంటిగా వదిలేసివచ్చిన పెళ్ళాం మీద భ్రమకొద్దీ గొంతు మోగింది -

ఒంటిగా తూగేవు
ఓసైన మారాజ
ఇంటికాడ చుక్క
కే భ్రమత లాయెనో....రాజా-
ఉత్తుత్తి పున్నాని
కురికి గంతేసేవు
నీ నీడలో తొంగి
సూడవో మారాజ....

ఇలాగే పాడుతున్నాడు-పాటతో ఊగుతున్నాడు. ఇంతలో గేటు అద్దరినుంచి ఎవరో కేక వేశారు.

'ఎవరక్కడ?'

'ఓహో! ఎవడో దేవతల్లే ఉన్నాడు' అనుకున్నాడు సన్నయ్య. గరపచేలో రాటుతేలిన ఘటమేమో, తడుముకోకుండా రొమ్ము విరుచుకున్నట్టు జవాబు చెప్పాడు.

'నేనే!'

'నేనంటే!'

'చిక్కయ్యని!'

'ఏమిటా మోత!'

'మోతకాదు, పాట!'

'దాంతాడు తెగిరిలే—ఇంత ఆలస్యంగా వచ్చావేం!'

---

మల్లాది రామకృష్ణశాస్త్రి

---

'అయిందిలే–ఆలస్యం! ఇంకాక సంజె పొద్దునే కా, మనం చచ్చిపోయింది!'

'సంజె పొద్దునా?- అయితే, రేపటికి జేరుకునే వాడవ్!'

'ఏమయ్యోవ్, దేవుడూ!- నేను మెరక చేలో మనిషిని!'

'అలాగేం?-మన దేశ్మారు?-ఏ తాలూకా!-'

'నందిగామ!'

'ఊరు?'

'చెపితే నీకేం తెలుస్తుంది?-ఎన్నడన్నా ఆ వాయంకు వచ్చావా ఏం!'

'నాకు అంతా ఎరికేలే-ఏఊరు ?'

'సింగారం.'

'పేరు-?'

'మా యింటిపేరు అయినాబత్తులవాళ్ళు-

'బంద చేషయ్య రెండో కొడుకునయ్యా- చివలింగయ్యని!

'చిక్కయ్యంటారు ఎరగవ్?-'

'అంటే అన్నారులే!-తెల్లారేదాకా అక్కడే పరుండు గొడవచెయ్యకుండా!-'

'సరేలేవయ్యా! - నీమానాన నీవుపోయి ఐబ్బో!'

'ష్!-నిశ్శబ్దం!-'

చిక్కయ్య మెదలకుండా కూర్చున్నాడు: అది మండు వేసంగి అయినా తెల్లవారు జాముకు చలిచలిగా ఉంది- ఒళ్లు విదిలించుకుని, మళ్ళీ తంబురా అందుకొని గొంతు విప్పాడు-

కువకువలాడుతూ, దేవకన్నెలు గేటు దగ్గిర మూగి సందులకుండా తొంగి చూస్తున్నారు.

'ఎంచక్కగా ఉందోనే- ఏంబాగా పాడుతున్నాడే!' ఈ కిల కిల పసికట్టి, చిక్కయ్య మరీ పెచ్చురేగాడు- ఇంకోటి అందుకున్నాడు-

జొన్న సేల మయ్యాన
-వన్నెనూసి కన్నేసి
దారికాసి చేరదీసి
కోరమీసం యెంకటసాఁయ్ -
ఏమన్నడే సిట్టీ
ఏమన్నడే-వా, డేమన్నడే....
-నిన్నేమన్నడే!....

దేవకన్నెలు, విలవిల్లాడుతున్నాయ్-

'ఏం పాట అది!-'

యాలపదం!

'యాల. యాల!' కన్నెలు సంబరపడ్డాయి-

'ఏం లయగా ఉందే!'

ఇంతలో గేటు విచ్చుకుంది.

'చిక్కయ్యా!' దేవత గుమ్మంలోంచి కేక వేశాడు.

'ఊఁ!'

'రా—లోపలికి రా—'

'-నన్ను బ్రతిమాలడం దేనికయ్యా-నేనే వస్తూంటినిగా!'

-ఒక్క మెరుపులో, దేవలోకం అంతా తెలిసిపోయింది. రంజుగా యాల పదాలు పాడే లయకా డెవడో వచ్చాడని. అది యింద్రుడిదాకా ప్రాకింది: పైగా, ఆపూట, దేవ రాజుకు ఆటవిడుపేమో కూడా—

చిక్కయ్యను లోపలికి వెంటబెట్టుకు వెళ్ళి, ఆ దేవత ఏదో విడిదిలో దింపాడు:

అమ్మయ్యా-అని నడుం వాల్చబోతూండగానే.- మరో బడా దేవత ఉరుకులు పరుగులుగా వచ్చాడు-

'చిక్కయ్యా!'

'అంటే, మనమే!'

'పదాలు పాడుతావటనే'

'భేషుగ్గా!'

'అయితే, రా పోదాం!'

'ఎందాకా?'

'ప్రభువు సన్నిధికి!'

'ప్రభువా?'

'ఏం—భయమా?'

'నాకెందుకయ్యా!—పద!'

ఇద్దరూ కలిసి, ఓ పేద్దవీధిగుండా పడి పోతున్నారు: రెండు పక్కలా కొండలల్లే, వెండిముద్దలల్లే ఇళ్ళున్నాయి. అందులో అందరూ కిటకిటలాడుతూ, గడ్డాలు వ్రేళ్ళాడే రుషులున్నారు:

ఆ యిళ్ళన్నీదాటి, ఓ అపరంజిభవంతి ముందు ఆగి,—పహరావాళ్ళకు సంకేతవాక్యం చెప్పి లోపలికి వెళ్ళారు:

'ఒక్క మనవి!-

లోపల దేవరాజు తీరుబడిగా కూర్చుని, తాపీగా హుక్కా త్రాగుతున్నాడు. చిక్కయ్య దేవరాజును చూసి, దాసోహం అన్నాడు. ఆయనపరధ్యానంగా ధీమాగా తలఊగించాడు.

చూస్తూ చూస్తూండగానే, ఒక్క నిమిషంలో అక్కడకు, దేవకన్నె లందరూ ఎక్కి-దక్కిగా వచ్చిపడ్డారు. మరీ ముందుకు రావాలని, ఒకళ్ళ నొకళ్ళు త్రోసుకుంటున్నారు! కిచకిచలాడుతున్నారు, కేరింత లాడుతున్నారు, గుసగుసలుగా కసురుకుంటున్నారు-

'అచ్ఛా!, చిక్కయ్యా!-పాట మొదలెట్టు!' అన్నాడు దేవరాజు:

చిక్కయ్య ఈ విధత ఖచితంగా సాష్టాంగ ప్రణామంచేసి.

'ప్రభూ మీ ఆజ్ఞకు అడ్డేమిటి-అలాగే!- కాని,

'మాఊరు కుర్రకుంకలెవరన్నా ఇక్కడున్నారేమో తమకు ఎరికేనా?'-అని విన్నపాలైనాడు:



'ఏం-వాళ్లెందుకూ!'

'బాబూ, చిందేసేవాళ్ళుంటేనేకాని, పదానికి అందం ఉండదు!'

దేవరాజు చిరునవ్వుతో 'అలాగేం!' అన్నట్టు తలఊచాడు: ఓముఠా దేవతల్ని పంపాడు, ఎవళ్ళున్నా ఉంటే తక్షణం హాజరు పెట్టమని!

వెళ్ళినవాళ్ళు వట్టిచేతులతో తిరిగివచ్చారు-

'ఆ ఊరివాళ్ళు ఒకడో అరో తగిలాడు కాని,- అందరూ ముసిలివాళ్లు బాబూ' అని మనవిచ్చారు.

'ఎబ్బే వాళ్ళేం లాభంలేదు: ముసిలివాళ్ళకు అంగలేస్తుందా? - వాళ్ళవల్ల నేమౌతుంది!' అని విసుక్కున్నాడు చిక్కయ్య - 'అయితే బాబూ,- మా కుర్రమూక అంతా ఏమైంది- పడుచువాళ్ళుకూడా, మా సీమలో అదపాదడపా, చచ్చిపోతూండటం కద్దే- వాళ్ళ ఏమైనట్టు?' అని అడిగాడు:

'బహుశా నరకంలో తగిలితే తగలచ్చు!' అన్నాడు దేవరాజు.

'అః!-మా బాగా సెలవిచ్చారు బాబూ-మీ మాట నిజమే అయి ఉండచ్చు: ఉంటే, వాళ్లు అక్కడే ఉంటారు: ఆసజ్జంతా నాకు తెలుసు బాబూ:-

'బక్క కోటయ్య కొడుకు అంకమ్మ ఉన్నాడే,- డొంకలో, మునసబు కొత్తకోడల్ని ఉన్న పళాన నిలేశాడు- అదేమిరా అని నలుగురూ కమ్ముకుంటే చీల్చి గడ్డలకు వేశాడు! ఒక్కచేతిమీద వంద పురులకు అగ్గి పెట్టాడు- వాడు నరకంలో ఉండక మరెక్కడుంటాడు?-

'సీతయ్య మేనల్లుడు చిన్న తిరపతిగాడు- ఠాణాలో మాటిచ్చివచ్చి- పట్టపగలు దివాణం దోచేశాడు! విచ్చు కత్తులాళ్ళు ఝూం-ఝూం అంటే బురుజెక్కి గండితగలకుండా ఉరికాడు- ఒక్కడూ వందమందికి జవాబు చెప్పాడు- గడిదొంగ- కాని,- వాడి చిందే చిందు బాబూ- మా సీమలో వెయ్యిన్నొక్క పల్లెలోను,-వాడిని మించిన మొనగాడేడీ- అడుగు వేస్తే-హంస కులికినట్టే-'

-'పాడవేం!' గర్జించినట్టు మందలించాడు దేవరాజు. చిక్కయ్య ఉలిక్కిపడకుండా, నిదానంగా మీసం ఎగదువ్వుకుని,-గొంతు సవరించుకుని,-తీగె రంగు మనిపించి-

'ఏం-వింటారు?-'అని అడిగాడు-

'నీ ఇష్టం వచ్చింది-'

'కొయ్యోడి పదం-పాడనా?'

దేవరాజు-'ఏదైనా సరే!' అన్నట్టు తల ఊగించాడు- చిక్కయ్య అందుకున్నాడు-

నిమ్మతోట మలుపుల్లో - దా
నిమ్మ రెమ్మ కులుకుల్లో-
చెమ్మ చెక్కలో చెయ్యోడిసేవ్ -ఓ
లమ్మో! చక్కిలి గింతలు రో.
రయ్యో కోయ్యోడా!....

ఈ పదం ఆసాంతం పాడేశాడు!

దేవరాజు విన్నంతసేపూ ఊతగా హుషారుగా తల ఊగించాడు-'శహబాష్' అన్నట్టు చూసి,-చిక్కయ్యను అతి చనవుగా పలకరించి, అంతఃపురానికి, - చిందువేస్తున్నట్టు అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయినాడు-

దేవరాజు అక్కడనుంచి వెళ్ళిపోగానే,-అంతవరకూ ఆనందం బిగబట్టుకున్న

దేవకన్నెలూ, ఋషులూ, పరమసిద్ధులూ అందరూ చిక్కయ్యమీద విరుచుకుపడ్డారు: ఇంకా పాడమని వేధించారు-

చిక్కయ్య అంత రణగుణ ధ్వనిలోనూ చీమకుట్టినట్లైనా లేకుండా కూర్చున్నాడు: అందరివంకా ఒక్కసారి పరకాయించి చూశాడు: ఆ మొగాల్లో ఆవేశాలు చూసి,- గండు మీసం మెర మెరలాడింది-ఇంకోపదం అంకించుచున్నాడు-

ఝునక ఝునకో - జఝునక ఝునకా
కులికిందిలే - భలే కులికిందిలే -
మొన్న - కులికింది రాసోరి కూనా
నిన్న - వెలిసింది వడగళ్ల వానా—

దేవకన్నెలందరూ ఎగిరి గంతు వేశారు- ఒక్కొక్క చరణం వింటున్నకొద్దీ వాళ్ళ ఒళ్ళు వాళ్ళు మరచిపోతున్నారు- చిక్కయ్య పదం ఆగగానే మరోపదం అందుకుంటు న్నాడు-

ఇక్కడిలా వాళ్ళందరూ సంబరాలు పడుతూండగా,- దేవ గురువు, మరేదో ఊర్ధ్వ లోకంనుంచి స్వర్గానికి వస్తూండగా,-గాలి దాడిని ఓ దేవకన్నె పాడుకుంటూ పోయింది.

ఒహొహూ రాజ! ఓ-హొ మారాజ!
'కో' యంటే 'ఓ' యంటనోయ్
రాజా——....

మరో పక్కనుంచి ఇలా వినిపించింది,- మరో మొగగొంతు-

వరదగాలి తేలిపోయె
వెలెవెలె సిన్నదాన
చిలకపచ్చ కోకచెంగు
ఒలికిం దుయ్యాలమీద-ఓసిన్నదాన...

బృహస్పతికి గుండె బేజారై పోయింది- అక్కడే చదికిలపడి, - రెండుచేతుల్లో తల కాయ పెటుకు కూర్చున్నాడు-లేచి,-గావంచా కాళ్ళకు బందాలు పడుతూండగా,- స్వర్గం లోకి పరుగెత్తుకు వచ్చాడు:

అన్ని యిళ్ళూ బోసిపోతూ ఉన్నాయి: ఏ యింటా ఒక్క దేవతకాని, ఒక్క ఋషికాని లేడు: లోకం లోకం యావత్తూ చిక్కయ్య చుట్టూ మూగి,-పాటకు వంతగా పరవశంగా చిందువేస్తూంది:

దేవ గురువు నిర్ఘాంతపోయినాడు - తల వంచుకు యింటికి వెళ్ళిపోయినాడు: వెళ్ళి భీష్మించుకు కూర్చుని దేవరాజుకు కబురం పాడు- వచ్చీ రాగానే- 'ఏమిటిది?' అని శాప మంత ధూకుడుగా అడిగాడు-

'ఏముందీ: - ఏం లేదే!' అన్నాడు దేవ రాజు.

'ఈ ఘోష ఏమిటి?'

'సర్వజ్ఞులు తమకు తెలియని దేముం టుంది:- భూలోకంలో యాలపదం అనే ఒక గీత విశేషం ఉన్నదట - చిక్కయ్య అనే ఓ పుణ్యాత్మ ఇక్కడికి వాటిని పట్టుకు వచ్చాడు: ఏం బాగున్నాయ్ గురూ ఆ పాటలు!- స్వర్గం అంతా ఊగిపోతూంది-'

బృహస్పతికి ఇక వినడం అసహ్యమని పించి,- అక్కడనుంచి బ్రహ్మలోకానికి ఎగిరి పోయినాడు:

అక్కడ పద్మాసనంమీద కూర్చుని, వాణి, యాలపదం వీణెమీద వాయిస్తూంది: హంస చిందువేస్తూంది- బ్రహ్మ నలుమొగాలా శహ బాసుగా నడుంవాల్చి వింటున్నాడు.

ఇతగాణ్ణి చూడగానే, వాణి పాట ఆపకుండానే, లయలో కలిపి, 'దయచేయండి!' అన్నట్టు నవ్వుమొగం విసిరింది: బ్రహ్మ మర్యాదకోసం లేచి కూర్చోబోయినాడు.

'అవ్వ! - నీకిదేం పోగాలం గీర్దేవీ!' - అని మౌనంగా అంగటి నొక్కుకుని, బృహస్పతి అక్కడనుంచి చఱ్ఱున మళ్ళాడు.

కాలు, యింటివేపు లాగుతూంది- కాని, అక్కడా యీ చిచ్చు రేగిందేమో!- అసలే చిందులమారి, తార-

స్వర్గం నడిబొడ్డుమీద వ్రాలి, లోకం యావత్తూ మనసుతో పరకాయించాడు: అంతా నరకమల్లే విలవిల్లాడిపోతూంది: ఏ పంచనా సామగానంలేదు- ఏ చక్కినా వేదపారాయణ వినరాదు - అంతా లయ - మయం-

మనస్సంతా హూనం-హూనమైపోయి,- కాస్త సంబాళించుకోవచ్చును అనే ఆశతో నందనోద్యానం చేరుకున్నాడు- అక్కడా మళ్లీ ఈ ఘోషే దాపురించింది: ఉద్యానపాలికలందరూ, చెట్టా పట్టాలు వేసుకుని, మెరుపు లల్లే చిందువేస్తున్నారు! దేవద్రుమాలన్నీ లయగా ఊగుతూన్నాయి-చిక్కయ్య నిశ్చింతగా కూర్చుని తంబుర మోగిస్తూ పాడుతున్నాడు- ఆటకు, పల్లవి ఊతగా-

బృహస్పతి, ధూకుడుగా రావడం చూసి, దేవకన్యలందరూ, మర్యాదకోసం అన్నట్టు, ఆటపాట కట్టిపెట్టి ప్రైదొలగారు- చిక్కయ్యా తంబుర మూగపోనిచ్చి, మ్రాగన్నుతో అలాగే కూర్చున్నాడు :

'చిక్కయ్యా!'

'అయ్యా!'

'ఎక్కడికన్నా వెళ్ళిపోరాదూ!'

'ఎక్కడికి వెళ్ళను బాబూ!'

'అవును ఎక్కడికి వెళతాడు-?' బృహస్పతి ఆలోచనలో పడ్డాడు-

'ఎందుకు వెళ్ళాలి- చచ్చిపోగానే, యిక్కడికి రప్పించారుగదా!-' అని చిక్కయ్య సవాల్చేశాడు:

'ఆఁ- అదే చిక్కు!'

'నేనేం తప్పు చేయలేదే - ఎవడిగొంతూ కొయ్యలేదే- ఎవడి భార్యనూ—'

'అవునవును - నిజమే!'

'నిజమే అయితే - మరి?'

'నీవు వచ్చినప్పటినుంచీ స్వర్గమంతా - నీ పాటే పాడుతూంది- ఆ ఆటే ఆడుతూంది'-

'ఓఁ! అదా, కథ?'

'ఎక్కడికి వెళదామని నీ ఉద్దేశం, చిక్కయ్యా!' బృహస్పతి ప్రాధేయపడుతూ అడిగాడు-

చిక్కయ్య, ఒక్కనిమిషం ఆలోచించి-

'మీకెందుకులే బాబూ, బాధ- పోతానులే!-' అని లేచాడు.

'ఎక్కడికి!'

'ఉన్నచోటికే!'

'భూలోకానికా ?'

'ఓఁ-భేషుగ్గా!'

'ఏదో తారామండలంలో నీకు వసతి కల్పించుదా మనుకున్నానే-'

'నాకు, తారావద్దూ, దగబోలూ వద్దు- సెలవు-'



‘స్వర్గం విడిచిపోవడమే!’

‘ఆఁ- మాలావు స్వర్గం-! నేనెక్కడుంటే అదే స్వర్గం! మా కొండల్లో, కోనల్లో స్వర్గం లేదూ-

అన్నీ చుట్టబెట్టుకుంటూ పోతా బాబూ - పాతలయలన్నీ యాదకు తెస్తా -

ఒంటికాడ చెట్టుసీడ కునికిపోతూ, రెల్లూదే గొల్లపిల్లడి వెన్నునాన్కొని, - పాతలయ వాడుపులందిస్తా—

దుత్తమీద దుత్తపెట్టి సీటుగా దుద్దుకూరి సంతకు పోయే సింగారి నడకలో వడుపులో లయ కలుపుతా.

కూలికి ఒళ్ళంతా వంచే పాలికాపు చెవిదారను, వాళ్ల అయ్య నేర్చిన పదం ఊదుతా.

ఏకులబుట్ట ముందేసుకు కూచుని ఎన్నెన్నో ఊసులుపోయే అవ్వకు చిన్నప్పటి చిందు అందిస్తా—’

చిక్కయ్య తంబురదండె అందుకుని రెప టల్లే లేచి నిలుచున్నాడు-

బృహస్పతి కొంచెం సంకోచంగా, - ‘బాగానే-ఉంది కాని, ఈ పాటికి లోకంలో నీ లయ పాతపడిపోయి ఉండదూ? ఎవరూ చెవిని పెట్టకపోతే—’

‘వాళ్ళే చెడిపోతారు నాకేం బాబూ; పారే వాగుల్లేవా, పర్వతాల్లో గుహల్లేవా,- పచ్చపట్టు మీద మీటుకుంటూ పోయే పైరుగాలి లేదా- మనుషులకు చెవుడొచ్చినా,- మన లయకు చేటురాదు బాబూ-సెలవు!-’ చిక్కయ్య వెను తిరిగి చూడకుండా వెళ్ళిపోతున్నాడు-

'సెలవు - చిక్కయ్యా!-' బృహస్పతికి ఏదో జ్ఞాపకంవచ్చి ముందుకు పరుగెత్తుకు వెళ్ళి ఆపేశాడు-

'నామీద కోపం లేదుగద!'

'ఎందుకు బాబూ!'

'నీ విలాగే పాడుతూ కూచుంటే- స్వర్గ మంతటికీ యీ పదాలే అబ్బుతాయి. వేదాలు మూలబడిపోతాయి అని భయమేసింది చిక్కయ్యా?'

'అంతేనేమో బాబూ!'

'స్వర్గానికి కాకుండా చేశానని ఏమీ అనుకోవు గద!'

'అదేమిటయ్యా!- అన్నీ తెలిసిన పెద్దలు మీకీ దిగులేమిటి?- నాకు కొరతేమిటి బాబూ!- నా మనసు ఎక్కడవుంటే - అదే స్వర్గం-'

ఎంతో వినయంగా నమస్కారం చేసి చిక్కయ్య సాగిపోయినాడు, తంబుర చంకను పెట్టుకుని.

స్వర్గంలోంచి బయటపడ్డతరువాత,- ఏదో ఇరకాటం అంతాపోయి, ఎంతో హాయిని పడ్డట్టున్నది చిక్కయ్యకు. ఎడా తెరిపీ లేని శూన్యంలో ఎంతో స్వేచ్ఛగా ఊపిరి లాక్కుంటూ తేలిపోతున్నాడు-


దోవలో, మిలమిల్లాడుతూ, పాలవెల్లి, ఎదో ఎగువకు నిశ్చలంగా ప్రవహించుతూంది; అందులో మునకలు వేశాడు; ఈదినంత ఉరవడిలో, ఉన్నచోటునే తపనంతా తీరేట్టు స్నానం చేశాడు; ఒడ్డున నిలుచుని,- 'ఇంతటితో నీకూ నాకూ సరి!' అన్నట్టు స్వర్గంకేసి తిరిగి జుట్టు ఝాడించాడు- భూలోకానికి జాలే నడిరోడ్డు పుచ్చుకున్నాడు - గొంతు ఎత్తాడు :

అం— వహవ్వా !-
గతుకుల కంకటిమీద
ముతకా కంబళ్ళి మడత
కొట్టేడూ గడిదీసీ
బట్టేసుకు పక్కేసీ
ఉక్కలో ఒక్కణ్ణీ
ఊరించకే అమ్మడూ—
....పచ్చపచ్చాల వెన్నెలే -
....పుచ్చపూల....వన్నెల పైపెచ్చులే-

చిక్కయ్యపాడే పదం, వాళ్ళ వరగణాలో ఉన్న కొండలూ కోనలూ అందుకున్నాయి-

[పోలాండ్ మహాకవి, దేడ్‌మాషెర్ కథ 'స్వర్తలా ది ఫిడ్లర్'-దీనికి ప్రాణం]





# నీతిగల మనిషి

ఎక్స్‌ప్రెసంతా కిక్కిరిసిపోయింది. బల్ల మీద పక్కనానుకొని టైమ్సాఫ్‌ఇండియా తిరిగేస్తున్నాడు రాజారావు. చుట్టూవున్న ప్రయాణికులకి, అతని దర్జాని, అతనాక్రమించుకున్న స్థలాన్నిచూసి కళ్ళు కుడుతున్నాయి. జరగమనే ధైర్యంలేదు ఒకళ్ళకీ.

ఎవరో తలుపు తెరిచారు. తలుపుదగ్గిర చుట్టకాలుస్తో కూచున్న రైతు, "ఖాళీలేదు. ఇంకోపెట్టెలో ఎక్కండి" అని అరిచాడు.

ఆ అరుపుకి దడవక, ట్రంకుని లోపలికి నెట్టి ఎక్కాడు ఒకతను. అతనివెనకనే ఒకామె. అందరూ వాళ్ళవంక మింగిపారేసేట్టు చూశారు.

రాత్రంతా నిద్రలేక ఎర్రబారిన కళ్ళతో చుట్టూ చూశారు స్థలంకోసం ఆ ఇద్దరూ. ఆమె చెక్కని అనుకుంది. అతను పడకుండా పట్టుకున్నాడు.

ఆమెలో దీనత్వాన్నీ, అసహాయత్వాన్నీ, తోటిప్రయాణీకుల రాతిగుండెలనీ, చూడలేకండా పక్కచుట్ట కొంచెం జరిపి, చోటుచేసి, ఆమెని కూచోమన్నాడు రాజారావు. వాడిపోయిన తీగలాగ వాలిపోయింది పక్కచుట్టమీద.

ముప్ఫయేళ్ళలోపు వుంటుందేమో ఆమె వయస్సు. సన్నగా, బలహీనంగా వుంది. పచ్చగా పాలిపోయి, కళావిహీనంగా వుంది ఆమె ఒంటిరంగు. ముడతలుపడ్డ కోల మొహం. ముడుచుకుపోయిన ఆమె మొహానికి పెద్ద వనిపించే కళ్ళు.

అతనిలోంచి చెప్పలేని గుబులు కలిగింది.

ఎంతదూరంనించి ప్రయాణంచేస్తోందో ఒక్కత్తె, ఆమె స్థిరపడడంచూసి, ఆ యువకుడు దిగిపోయినాడు.

రైలు కదిలింది. ఆమె నిద్రపోయింది. కిటికీలోంచి, పచ్చని పొలాలూ పొలాల్లో పనిచేస్తున్న కూలీలూ గుండ్రంగా తిరుగుతూన్న భూమిని చూస్తో, ఆలోచనలో పడిపోయాడు. "ఈభూమి ఒకరైలు, మనం ప్రయాణికులం. పొద్దున్నె కూలీలు పొలాలు దున్నుతోనే వున్నారు, వుద్యోగస్థులు ఆఫీసులకి పోతూనే వున్నారు. రైళ్ళల్లో ప్రయాణాలు చేస్తునే వున్నారు. ఇళ్ళల్లో సోమరిగా పడుకునే

'సారిస్'

వుంటారు కొందరు. కాని ఒకళ్ళకీ తెలుసా, అఖండమయిన యాత్ర చేస్తున్నామనీ— అనంతమయిన ఆకాశంలో, సెకండ్‌కి, ఎన్నో వందలమైళ్ళ వేగంతో-చాలమించుకు పోతున్నట్టు ఎక్కడికో, ఎందుకో, ప్రయాణం చేస్తున్నామనే సంగతి?''

"ఏమాత్రం తెలీదు. ఇంకో గంటలో రైలులో కూచున్నామనే సంగతిగూడా మర్చి పోతాం." ఆమె లేచింది. "చాల thanks మీకు. మీరే చోటు చేసియ్యకపోతే, ఏమయ్యే దాన్నో. నావొళ్ళు నాకు తెలియకండా పడి పోయాను'' అంది చిరునవ్వుతో.

"చాలాదూరంనించి వొస్తునట్టున్నారు?'' దగ్గింది.

"మదనపల్లినించి.'' అర్థమయింది రాజారావుకి.

"నయమేనా?''

"ఏం నయంలెండి, అక్కడున్నంత కాలం ఆరోగ్యంగా, వున్నట్టుంటుంది. బయ టికి వొచ్చామా, మళ్ళీ మన జబ్బుతో మనం ప్రత్యక్షమవుతాం.'' ఆమెతో అతను మాట్లా డడంచూసి, తక్కిన ప్రయాణికులు ఆమెని ప్రశ్నలువెయ్యడం మొదలెట్టారు. ఆమె మాట్లాడలేదు. అతని వేపు ఆమె అట్లానే దృష్టినిలిపి చూడడం చూసి, ఆమె వేపు తిరిగాడు.

"మీ పేరేమిటి?''

"డాక్టరు రాజారావు.''

"ఎక్కడికి వెళ్తున్నారు?''

"మద్రాసు." నీరసంగా, పక్క మీద వాలింది. నుదుటిమీద చెయ్యి వేశాడు. మండిపోతోంది జ్వరం. సాయంత్రమయింది మద్రాస్‌చేరుకునేప్పటికి. ఆమె అతని పక్క చుట్టమీద ఆనుకుని నిద్రపోతోంది. జ్వరం, తీవ్రంగా వుంది. తెలివి తప్పింది. ఆమెను వొదిలి ఎట్లా వెళ్తాడు, ఎవరు చూస్తారామెని పాపం. కిందికిదిగి, చైర్ తెప్పించి, ఆమెని కూచోపెట్టించి తన నర్సింగుహోమ్‌కి తీసి కెళ్ళాడు. ఆమెని స్పెషల్‌వార్డ్‌లో చేర్పించి రాత్రి గడవదనే నమ్మకంతో, ఆశ వొదులు కుని, నర్సుల కప్పచెప్పి, ఇంటికెళ్ళాడు.

మర్నాడు పొద్దున్న హాస్పిటల్కి వెళ్ళేప్ప టికి, నర్సులు, క్రైసిస్ దాటిందనీ నెమ్మ దిగా వుందనీ చెప్పారు. గదిలోకి వెళ్ళాడు. నిద్రపోతోంది ఆమె. సగంమొహాన్ని ఆక్ర మించిన గాజు అద్దాల్లోంచి పడుతున్న తెల్లని కాంతీ, తక్కిన సగాన్ని కప్పుకుపోయిన గదిచీకటీ, ఆమె మొహానికి గొప్ప గంభీర త్వాన్నిచ్చాయి. ఆమె కనికొలుకుల్లో నీళ్ళు. అతనిలో చెప్పరానంత బాధ కలిగింది. అతను కుర్చీ నానుకున్నప్పుడు చప్పుడయింది గావును. కళ్ళు తెరిచింది.

"ఇక్కడికెట్లావొచ్చాను?" అంది చుట్టూ చూసి. చెప్పాడు.

"ఇంతకష్టపడి, ఎందుకు తీసుకొచ్చారు?"

"అట్లాంటిస్థితిలో ఎట్లా వొదిలిపెట్టను?''

"ఏం. ఎక్కడో అక్కడ ప్రాణం పోయేదీ. అంతేగా.''


"అట్లా అంటే ఎట్లా? వొంట్లో ఎట్లా వుంది?''

"ఎట్లావుంటే నేం?''

ఆమె విరక్తీ దీనస్థితీ అతని మనసుని కలతపెట్టాయి. అతనివేపు కళ్ళెత్తి చూసింది.

"ఏమిటి? దిగులుపడుతున్నారా నా కోసం."

"నేను బతికిస్తాను."



"మీరా?" ఆశ్చర్యంగా చూసింది అతని వంక.

"ఏం నమ్మలేకండా వున్నారా?"

"మీరు కుదర్చగలరా అనికాదు, నేను బతుకుతానా అని."

"ఏం భయంలేదు, నా చేతులోపడ్డ కేసు బతక్కపోవడమంటూ లేదు" అని నర్సుని కేస్‌ని ఎంటర్ చేసుకోమని చెప్పి, వెళ్ళిపోయినాడు రాజారావు.

తన అసిస్టెంట్, డాక్టరు సంజీవరావు సెలవపెట్టడంవల్ల, అన్ని కేసులూ, తనే చూసుకోవలసివచ్చింది రాజారావుకి.

"మీరు గొప్ప టి. బి. స్పెషలిస్టుగా నర్సులు చెప్పారు" అన్నది ఆమె మర్నాడు అతనితో. ఆమె గొప్ప గౌరవంతో విశ్వాసంతో చూసింది అతని వంక. "నామీద మీరు ఇంత శ్రద్ధ ఎందుకు చూపిస్తున్నారో తెలుసుకోలేకండా వున్నాను" అంది ఆమె.

మరి ఆ రోగంమీద ఇంటరెస్టో, ఆ పేషంట్‌మీద ఇంటరెస్టో, రోజుకి నాలుగయిదు సార్లన్నా ఆమెని చూసి వెళ్ళేవాడు రాజారావు. ఆమె చదువుకున్న మనిషిలాగ, అనుభవశాలిలాగా, ధనవంతురాల్లాగా వుంది చూడడానికి. మరి ఆమె దగ్గిరమనుషులు ఎవరూ లేనట్టున్నారు. లేకపోతే వెతుక్కుంటో రార్థా ఆమేని? అనుకున్నాడు రాజారావు.

"మీ మందులన్నీ నామీద ఎందుకు వృధాచేస్తారు." అని నవ్వింది, ఇంజెక్షన్ చేస్తోవుంటే ఓరోజున.

"ఏం?"

"రేపో ఎల్లుండో,—"

"అట్లా అనకూడదు. బతకాలి అని గట్టిగా మీ మనసుకి ప్రోద్బలమిస్తే, ఇంకా బలం చేకూర్తుంది, తొందరగా నయమ డానికి."

"ఎందుకు?"

"ఏమిటి ?"

"బతకడం?" తబ్బిబ్బయినాడు రాజారావు.

"ఎందు కేమిటి? జీవించడంకోసమే. మరి మీకు జీవించాలని, అనుభవించాలని లేదా ?"

"అనుభవించడ మంటే ?"

"జీవితాన్ని!"

"అదే జీవితంలో దేన్ని ? దుఖ్ఖాన్నా, అపకీర్తినా ? ప్రజల్లో మోసాన్నా ?" కొంత సేపటివరకూ ఏం మాట్లాడాలో తెలీక వూరుకున్నాడు రాజారావు. ఎక్కిరింపా, విరిచిన ఆమె పెదిమల్లో ? వైద్యాన్నీ, డాక్టర్లనీ, చూసి నవ్వా ?

"మీదగ్గరవా రెవరూ లేరా ?" అన్నాడు ఆ టెన్‌షన్ భరించలేక.

"ఎందుకు ?"

"వారికి మీ స్తితి తెలియచెయ్యద్దా ?"

"నేను చచ్చిపోతే తెలియచేసేందుకా ?" ఒకక్కమాట తరుక్కుపోతోంది అతని గుండెల్లో.

"కాదు. మీకు జబ్బుగా వుందని తెలిస్తే చూడటానికి రారా ?"

"ఎవరూ లేరు." అమితమయిన జాలి కలిగింది అతనికి. ఆమె చెయ్యి తన చేతులోకి తీసుకున్నాడు దయగా.

"పాపం !"

"పాపం ఎందుకూ, వుంటే వదలడానికి ఎంత బాధపడేదాన్ని" అతని మొహంలో ఇబ్బందీ బాధా కనిపెట్టిందిగావును ఆమె.

"ఏమిటి నన్నుచూసి జాలిపడుతున్నారా? జాలి అనేది వుండకూడదుగా డాక్టర్లకి ?"

"డాక్టర్లుమాత్రం మనుషులుకారా?"

"ఎంతమందిమీద జాలిపడతారు, ఈ విధంగా ? జాలిపడిమాత్రం ఏంచెయ్యగలరు? చావుబతుకులమీద నిర్లక్ష్యం, మానసికంగా, ఆర్థికంగా, తృప్తీ, సంసారంలో సౌఖ్యం. ముఖ్యంగా దేహారోగ్యం, ఇవికాక, అదృష్టం, వుంటేనేకాని గొప్పడాక్టర్లు అవలేరు."

ఆమె డాక్టర్లని అంత తేలికచెయ్యడం ఏమీ బావుండక, లేచాడు రాజారావు.

"ఏం నిజమేనా నేనన్నసంగతి ?"

"కొందరేమోగాని అందరూ అట్లాకాదు. ఎంతమంది, డాక్టర్లల్లో, తమ జీవితాన్ని, సౌఖ్యాన్ని, ఆరోగ్యాన్ని, త్యాగంచేసిన వాళ్ళున్నారు?"

"కథల్లో సినిమాల్లో తప్ప నేను జీవితంలో ఇంతవరకూ చూడలేదు." ఎందుకు అన్నిటిని అట్లా ఖండించి, తేలికచేసేస్తుంది ఆమె ! తన సహాయం, తన ఆదరణ, ఏమీ అంటవా ఆమెహృదయానికి? అసలు హృదయమనేది వుందా? దేనిమీదన్నా అపేక్షవుందా ఆమెకి? ఆమె సంగతి తెలుసుకోవాలని చాల ప్రయత్నించాడు రాజారావు.

ఆమెపేరు సత్యవతి అనీ, చిన్నతనంలోనే, భర్తపోయాడనీ, చాలఆస్తి వుందనీ మాత్రం తెలిసిందతనికి. సగం చెపుతో, "ఎందుకులెండి ఈ గొడవంతా మీకు" అని ఆపేసింది. మళ్ళీ ఎంత అతను ప్రయత్నించినా, ఆమెనించి, ఇంకోమాట రాలేదు.

సత్యవతి క్రైసిస్‌నించి బయటపడింది. చాల ఇంప్రూవ్ అయింది ఆమె ఆరోగ్యం. పైనించి, స్పెషల్ ఇంజక్షన్లు తెప్పించి, ఇచ్చాడు రాజారావు.

ఎండినమొక్క పోషణతో, తగిన నీరుతో చిగిర్చినట్టు, ఆమెలో సౌందర్యం ప్రకాశించడం



మొదలుపెట్టింది. పక్కవాదిలి నడవటం, లేసులల్లడం, స్వాబులుచుట్టడంలో వాటిల్లో, నర్సులకి సహాయంచేసేది ఆమే.

"వాళ్ళకి పనులుచేసిపెట్టి, సోమరిగా తయారుచేస్తున్నారా" అనేవాడు రాజారావు నవ్వుతో.

"చూశారా నా పట్టుదలే నెగ్గింది" అన్నాడు రాజారావు ఓరోజు. ఆమే కిటికీలోంచి తోట వేపు చూస్తో అతనివేపు తిరిగింది.

"ఏమిటి?"

"మిమ్మల్ని బతికించాను," ఆమే చూపు లోని విరక్తి అతని ఉత్సాహాన్ని చల్లపడేసింది.

"సంతోషంగా లేదా?"

"ఎందుకూ?"

"జీవిస్తున్నందుకు."

"సంతోషానికీ జీవితంకీ ఏం సంబంధం?"

విరక్తి, ఆమె మాటల్లో, కళ్ళల్లో. ఎందుకో అంత విరక్తి ఆమెకి జీవితంమీద!

ఆమే చాల పెద్ద బిల్ పే చెయ్యడమే కాక అతని భార్యకి తన చంద్రహారం, బహూమానంగా ఇచ్చింది.

నర్సులకీ, పేషెంట్లకీ, అందరికీ ఆమెని చూస్తే ఇష్టం. చంటిపిల్లలు ఆమెమీదికి దూకేవారు.

రాజారావుభార్య, సత్యవతి సంగతి రాజా రావునించి విని ఆమెని చూడడానికి వొచ్చింది. సత్యవతీ ఆమే విడవలేనంత స్నేహమయ్యారు. ఇంటికి వెళ్ళింతరవాత గూడా ఆమె కబుర్లే. ఆమె మర్యాదా, మాటతీరూ, ఆమె సంస్కరణా ప్రతివాళ్ళతో

పొగిడి చెప్పేది రాజారావుభార్య. రాజారావు కూతురి పెళ్ళి నిశ్చయమయింది.

"ఈ అయిదురోజులూ మాతో గడపాలి మీరు. నాభార్య వొస్తానంది. మిమ్మల్ని స్వయంగా తనతో వెంటపెట్టుకుని తీసుకు వెళ్ళడానికి" అన్నాడు. ఆమె మొహంలో సంతోషానికి బదులు బాధని చూసి, ఆశ్చర్య మేసింది రాజారావుకి.

"నే నెందుకూ, మీకు ఇబ్బంది."

"ఇబ్బందేమిటి? అట్లాంటే ఎట్లా? నా భార్య ఎంతో సరదాపడుతోంది మీరు వొస్తారని. తప్పకండా రావాలి." అతని కంఠంలో ఆదరాన్నివిని, ఆమె కళ్ల నీళ్ళతో నిండాయి.

"నన్ను ఏమనుకుంటున్నారో మీరు."

"ఏమిటి?"

"మీరు ఎందుకు ఎరక్కపోయి పిలిచామా అని చింతిస్తారనుకుంటాను నేను వొస్తే!"

"ఎబ్బే, ఇటువంటి పట్టింపులూ చాదస్తాలూ మాకులేవు. ఏ కులమయినా సరే మాకభ్యంతరం లేదు." అన్నాడు ఆమె కులం వేరేమోనని రాజారావు.

"కులభేదం లేకపోవచ్చు! కాని నీతి అవినీతి అనేభేదం వుందనుకుంటాను. లోకం ముందు నేను నీతిలేనిదాన్ని. తురకవాడి పక్కన, మాలవాడిపక్కన భోజనమన్నా చేస్తారుగాని, ప్రేమకోసం, జాతినీ, నీతినీ వొదులుకున్న మనుష్యులంటే మాలవాడికన్నా నీచం ప్రజల దృష్టిలో. అధమా అధములకి గూడా లోకువే?" ఆమె మొహం ఎర్రబారింది. మాటల్లో అగ్ని. ఆమె తను అక్కడవున్న సంగతి మర్చిపోయిందని తెలుసుకున్నాడు.

"మళ్ళీ ప్రతివాడూ, ప్రేమను గురించి మాట్లాడనివాడులేడు. ప్రేమంటేఏమిటో అర్థం తెలీదు మాకు అని ఎవడూ ఒప్పుకోడు. ప్రేమ అనేది ఎరిగివుంటే, వైషమ్యాలని పెంచుకుంటో, కుత్రిమాలుచేస్తో, స్లాండల్స్ మాట్లాడుతో, నీరసపుబతుకు బతుకుతో ఎందుకు జీవిస్తారు?

"ప్రేమ, ప్రేమ, ఆమాట ఎంగిలినోళ్ళల్లో ఎత్తుపళ్ళల్లో, దొర్లి, దొర్లి, కక్కుపుట్టేటంత వికార మయిపోయింది—క్షమించండి. నన్ను నేను మర్చిపోయి ఏదో వాగేసాను." అంది అతని వేపు తిరిగి.

ఆమె మాటలు పెద్ద ఇబ్బంది కలిగించాయి అతనికి.

"అయితే మీరు రారన్నమాట?" అని గొణిగి తప్పించుకొని వెళ్లిపోయినాడు రాజారావు.

ఆ రోజునించి ఆమె గదికి అతని రాకలు తగ్గిపోయినాయి. ఆమె స్నేహంగా పలకరించినా, చాల బెట్టుగా, పరధ్యానంగా మాట్లాడి చప్పుచప్పున వెళ్ళిపోయేవాడు.

"చిన్నప్పుడంతా ఇష్టమొచ్చినట్టు తిరిగితే, మరి ఇప్పుడు విరక్తికలగక ఏమవుతుంది!" అనుకున్నాడు రాజారావు. ఆమె తన నర్సింగ్ హోంలో వుంటే చెడ్డపేరు వొస్తుందేమోనని భయంగూడా వేసిం దతనికి. పంపించెయ్యా లనుకున్నాడు, కాని ఆమెలాంటి నిధి మళ్ళీ ఎక్కడ దొరుకుతుందతనికి? అయినా పేషంట్లు ఎట్లాంటివారయితే డాక్టరుకేం సంబంధం? అని నచ్చచెప్పుకుని వూరుకున్నాడు. ఇంతలో అతని అసిస్టెంట్ సంజీవరావు సెలవు అయిపోయి, తిరిగి వొచ్చాడు. అతను కుర్రాడు. చాల చురుకుతనం హుషారు

కలవాడు. అతను రాగానే రాజారావు అతనికి వొప్పచెప్పాడు, కేసులన్నీ చాలవరకు. సత్యవతిదగ్గిరికి తీసుకునివెళ్ళి, ఆమె case అంతా చెప్పి తను ఏమేమి treatment ఇచ్చాడో అదీ ఎక్స్ప్లెయిన్ చేశాడు తన అసిస్టెంటుకి రాజారావు. ఇంకా ఏమేమి ఇవ్వాలో గూడా చెప్పాడు. చాల ఇంటరెస్టుతో శ్రద్ధతో విన్నాడతను. కాని case మీదకన్న, పేషంట్ మీద వుంది అతని ధ్యాసంతా. ఆమెలోగూడా మార్పు కనపడింది. విరక్తితో నిండిన ఆమెకళ్ళల్లో, మెత్తనికాంతి మెరిసినది. రాజారావుకి చాల ఇబ్బందీ చిరాకూ కలిగాయి. తొందరతొందరగా సంజీవరావుని లాక్కుపోయినాడు అక్కణ్నించి.

క్రమంగా నర్సుల్లో సత్యవతి సంజీవరావునిగురించి గుసగుసలు బయలుదేరాయి. ఓపెన్ టాపిక్ అయిపోయింది నర్సింగ్ హోంలో.

మొదట నమ్మలేకపోయినాడు రాజారావు. సంజీవరావులో ఏమి విశేషముంది ఆమెని ఆకర్షించేందుకు?

కాని ప్రత్యక్షంగా, స్వయంగా తనూ చూశాడు, వాళ్ళిద్దరూ, చెట్లక్రింద కూచుని మాట్లాడుతోవుండగా. ఆమె వాల్చినకళ్ళల్లో, మెరిసేకాంతి, పెదిమలమీద చిరునవ్వు, రాజారావుని కలవరపరిచాయి.

చివరికి సంజీవరావునిపిలిచి warn చేశాడు రాజారావు.

"అబ్బాయ్ జాగ్రత్త, ఆమె మీద చాల ఇంటరెస్ట్ తీసుకుంటున్నట్టున్నావు."

"ఇంటరెస్టా? అవును. ఇంతవరకు ఆమెంత విజ్ఞానంగల స్త్రీని చూడలేదు." అని raptures లోకి వెళ్లాడు, సంజీవరావు.

ఏమిటింత సిగ్గులేకండా బహిరంగంగా ఎడ్మైర్ చేస్తున్నాడామెని?

"అవును. దీపాన్ని చూసి పురుగు అట్లానే అనుకుంటుంది. రెక్కలు కాలి కింద రాలే దాకా."

"ఆమె అటువంటిదికాదు."

"ఆమె సంగతి ఏం తెలుసునని మాట్లాడుతున్నావు?"

"ఏముంది తెలీడానికి. ఏ స్త్రీ ఆమెతో సాటిరాదు. చాల అపూర్వమయిన వ్యక్తి"

"ఓ, అంత ఎడ్మైర్ చేస్తున్నావేమిటి?"

"అటువంటి, ఆదర్శమయిన స్త్రీని ఎవరు ఎడ్మైర్ చెయ్యకండా వుండగలరు?"

"పెద్దవాణ్ని చెపుతున్నాను విను. ఆలోచించకండా గోతిలో దిగక."

"ఏమిటి?"

"ఆమెకి నీతిలేదు. వెలివడిన మనిషి."

"అయితే ఏం?"

"నీకు ముందర ఎందరయినారో!"

"నిజంగానా! మీ కెట్లా తెలుసు?"

"ఆమె స్వయంగా చెప్పింది, చాల గొప్ప విశేషంలాగు!" సంజీవరావు మాట్లాడక తల వొంచుకుని వెళ్ళిపోయినాడు.

ఆరోజునించి సంజీవరావు ఆమె చుట్టూ తిరగడ మెక్కువయింది. అదిచూసి వొళ్ళు మండిపోయింది రాజారావుకి. అతన్ని మళ్ళీ warn చేశాడు. "ఇటువంటి సంగతులు నా నర్సింగ్‌హోంలో పనికిరావనీ, డిస్‌మిస్ చేస్తాననీ" బెదిరించాడు సంజీవరావుని. తనకేమీ లక్ష్యంలేనట్టు నవ్వి వెళ్ళిపోయినాడు సంజీవరావు. ఏమిటీ పొగరు? ఆ నిర్లక్ష్యం? వెంటనే డిస్‌మిస్ చెయ్యాలనుకున్నాడు.

ఇంతలో సత్యవతి వెళ్ళిపోతోందని తెలిసింది. పూర్తిగా నయంకాకుండా వెళ్ళేదేమిటని ఆశ్చర్యమేసింది. ఆ సంజీవరావే ఏదో పెట్టివుంటాడు ఆమె తల్లో అనుకున్నాడు.

ఆమె గదికి వెళ్ళాడు మర్నాడు. ఆమె కిటికీలో కూచునివుంది. తోటవేపు చూస్తో. అతన్నిచూసి, ఎదురుగా వొచ్చింది. ఆమె వేషం, ఆమె తరహా అంతా మారిపోయింది. చాల అందంగావుంది. కళ్ళల్లో గొప్పకాంతి.

"ఏమిటి మీరు వెళ్ళాలనుకుంటున్నారట నిజమేనా?"

"అవును; ఎన్నాళ్ళుంటాను ఇక్కడ?" ఇన్నాళ్ళూ మీకిచ్చిన శ్రమ చాలదా?"

"పూర్తిగా నయమవందే?"

"చాలవరకు నయమయిందిగా?"

"ఇంకా చాలా ఇంజెక్షన్లు ఇవ్వాలి."

"సంజీవరావుగారు ఇస్తామన్నారు."

"సంజీవరావా? అతనికేం తెలుసునని?"

"మీరు చెప్పారుటగా ఏం ఇంజెక్షన్లు ఇవ్వాలో?"

వొళ్లు మండిపోయిం దతనికి.

"ఇదన్నమాట వాడి విశ్వాసం. నా వెనకనించి పేషంట్లని లాగడం, అపాయంనించి బయటపడ్డతరవాత. వాడు చేసేదేముంది?"

"జబ్బంతా నయమయినతరవాత ఎవరూ ఏం చేసేదిలేదు."

"ఇప్పు డప్పుడే ఇక్కడనించి వెళ్ళడం మంచిదికాదు, మీ ఆరోగ్యానికి."

"మీ డాక్టర్లలో వుండేదే అది. రోగాన్నే చూస్తారేం మనుష్యుల్లో? ఇంక నన్ను రోగి కింద చూడకండి. నా జబ్బుని మర్చిపోవాలనే పోతున్నాను ఇక్కడనించి. నేను ఇంక మీదట రోగిని కాను. ఆత్మా, హృదయం వున్న మనిషిని."

"నేనే బతికించకపోతే, మీ ఆత్మా, హృదయం ఏమయ్యేవి?" అన్నాడు విజయవంతంగా, రాజారావు.

"నా దేహాన్ని, మీరు బతికించింది. నా ఆత్మకి, హృదయానికి, రోగంతోకానీ, మీ రక్షణతోకానీ ఏం సంబంధం?"

"మీ శరీరాన్నన్నా రక్షించానని వొప్పుకుంటున్నారన్నమాట: నేనే రక్షించకపోతే, మీ వొంటిరంగూ, మెరిసే కళ్లూ, ఆ గులాబి పెదిమలూ ఏమయిపోయేవి?" కవిత్వంలోకి వెళ్ళాడు. నిదానంగా చూసింది అతనివంక.

"అవును. మీరుపడ్డ శ్రమా, మీరు చేసిన సహాయం ఎన్నటికీ మరవను. మీకు చాల బాకీ వున్నట్టున్నాను, మీ బిల్ తెలిపితే——"

"డబ్బుతో తూస్తున్నారా?" బిట్టర్నెస్ అతని కంఠంలో.

"మరి దేంతో తూచాలి?"

"సంజీవరావు దేనికి చేస్తున్నాడు?"

"ఆయనసంగతి మీ కెందుకూ?" అంది విసురుగా,

"ఏం లేదు, వాణ్ణి నమ్ముతున్నట్టున్నారు. పుత్త తిరుగుబోతు. హృదయం లేనివాడు. ఎంతమందినో మాయమాటలు చెప్పి మోసం చేశాడు."

"అతను తిరుగుబోతు, నేను వ్యభిచారిణిని, సరిపోయింది. ఏ తంటా లేదు."

ఆమె చూపూ మాటలూ గుచ్చుతున్నాయి ముళ్ళలాగు అతన్ని.

"మీరు వ్యభిచారిణని ఎవరన్నారు?" నిజంగా ఆశ్చర్యం అతని కంఠంలో.

"నాకు తెలీ దనుకోకండి. సంజీవరావు గారు తెలియచెయ్యలే దనుకున్నారా నన్ను గురించి మీకున్న గౌరవాభిప్రాయాన్ని?"

"సంజీవరావు చెప్పాడా? స్నీక్—"

"మీ రనగా లేనిది, అతను చెపితే తప్పేముంది?"

"చెప్పినందుకు కాదు. అతను చెప్పిన విధం!"

"నామీద మీ అభిప్రాయం అంత నీచ మయినప్పుడు, ఎట్లా చెప్పితే నేం?"

"చాల వ్యత్యాసముంది. మీరంటే ఎంతో గౌరవం, పూజ్యభావం నాకు."

"నామీద పూజ్యభావంతోనే అతనికి నే నెటువంటిదాన్నో తెలియచేశారా? మరి అతని మీద ఏ భావంతో, అత నెటువంటివాడో నాకు తెలియచేశారు? చాల్లెండి, ఇటువంటి మాటలు చాల విన్నాను. ఇదీ మర్యాదస్తుల లక్షణమే నన్నమాట!"

"మీరు ఏం తెలుసునని మాట్లాడుతున్నారు?"

"అయితే సంజీవరావుగారు చెప్పిందంతా అబద్ధమంటారా?"

"ఏం చెప్పాడో నాకేం తెలుసు?"

"నీతిలేనిదాన్ననీ, కులటననీ, ఆమెజోలికి వెళ్లితే నాశన మవుతావనీ బెదిరించారుటగా అతన్ని!"

"మీతో స్నేహం పనికిరాదని అతన్ని warn చేసినమాట మాత్రం వాస్తవం."

"దేనికి?"

"అతను నా అసిస్టెంట్. అతన్ని మంచి ప్రవర్తనలో వుంచడం నావిధి."

"మీ అసిస్టెంట్ గనక సంజీవరావుని బెదిరించగలరు. మీ అధికారంతో మీ దౌర్జన్యంతో నన్నేం చెయ్యగలరు?"

"ఏం చెయ్యలేను, కాని జాలిపడతాను."

"జాలా! దేనికి?"

"ఇంత తెలివయినవారు గూడా అతని మాటలు నమ్మి, నామీద నిష్కారణమయిన ద్వేషాన్ని పోషిస్తున్నారని మీ మనసులో."

"సంజీవరావు మాటలు నమ్మవలసినంత అవసర మెందుకూ. మీ మాటల్లో, ప్రవర్తనలో తెలీటంలే దనుకున్నారా?"

"ఏం తెలిసింది మీకు?"

"మీ మడికట్టుకున్న మనసు ఎంతఇరుకో- చదువుకున్నవారు, ప్రపంచం తెలిసినవారు, స్త్రీ పురుషుడితో చనువుగా వుందనగానే, మీ నీతికి, ఎక్కడ అపచారం జరుగుతుందో అని మీరు పడ్డపాట్లని తలుచుకుంటే నవ్వొస్తోంది నాకు."

"అవినీతి అనేది ఏమాత్రం సహించను."

"నీతి లేకపోవచ్చు, కాని అభిమానం, ఉన్నత సంస్కారం, విజ్ఞానం, అనుభవం లేదనుకున్నారా నాకు? మొగవాడితో మాట్లాడగానే అతన్ని వరించినట్టేనా? ఇదేనన్నమాట జీవితం మీకు నేర్పింది. భర్త అడుపాజల్లో వుండే పతివ్రతలు, లోకంఎరగని, అమాయకమయిన కన్యలు, అట్లా ప్రవర్తించేది. నాలాంటి స్త్రీలుకాదు." గర్వం అభిమానం ఆమెకంఠంలో.

"మరి అయితే పూర్తిగా నయంకాకుండానే వెళ్ళడానికి కారణం?"

"సంజీవరావు అనుకుంటున్నారా మీరు?"

"కాదా ?"

"అవును; సంజీవరావే."

"ఇప్పుడేగా మీమధ్య ఏం లేదన్నారు ?"

"లేకేం ? అతను పట్టించే బోలెడంత చీడ్డు. అది భరించలేకపోతున్నాను. అందులో నాకు నీతిలేదనీ, వ్యభిచారిణిననీ చెప్పారుగా మీరు. ఇంకా చులకనయిపోయింది, అతనికి నేనంటే. నీతిలేని ప్రేమకి విచక్షణఅనేది లేదనుకుంటారుగా మీలాంటివారు ?

"తనూ అదే అనుకున్నాడు. ప్రేమ అనే మాటతో, ఉచితంగా, సర్వహక్కులతో వశం చేసుకోవాలని చూశాడు. నాదగ్గిరా ఇటువంటి మాటలు చెల్లేది? ఇటువంటి ప్రేమలు ఎన్నో ఎదుగుదును."

"అయితే మీకిష్టం లేకండానే అతని వైద్యంలోకి దిగుతున్నారేమిటి ?"

"అతను అన్నాడు, అతక్కాన ఇంజెక్షన్లు, తను ఇస్తానని. నేను తీసుకోడానికి వొప్పుకున్నానని మీతో చెప్పానా ?" అతనివంక చూసింది. కళ్ళలో చిరునవ్వు కొంటెతనంతో తళక్ మంది.

"అయితే మీరు వెళ్ళటం లేదన్నమాట?"

"వెళ్ళటంలేదని ఎవరన్నారు మీతో ?" ఆమె కళ్ళు ఛాలెంజ్ చేశాయి కొంటెతనంతో. ఆమె చూపు, అతని హృదయంలో రగిలి, గొప్ప వెలుగు వెలిగించింది.

"మిమ్మల్ని వెళ్ళనీను."

"ఎట్లా ఆపగలరు ? మీ నీతికి భంగం కాదా ?" ఎక్కిరింపు ఆమె కళ్ళల్లో, పెదిమ వొంపులో.

"నీతిని మించిన ప్రేమ బలంతో."

"ప్రేమా!" నవ్వు చిందులాడుతోంది ఆమె పెదిమలమీద.

దగ్గిరిగా వెళ్ళి ఆమె చేతులు తీసుకుని కళ్ళ కద్దుకున్నాడు. "నవ్వకండి, నిజంగా చెప్తున్నాను వినండి. నా విద్యనీ, నా చాతుర్యాన్నీ, ఉపయోగించి, మృత్యువునించి రక్షించుకున్నాను మిమ్మల్ని. మీరు వెళ్ళిపోతే, నాజీవితం ఎంత శూన్యమయిపోతుందో వూహించుకోలేరా ?"

ఆమె కళ్ళల్లోకి చూశాడు దీనంగా. నవ్వుతున్న ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి. "ఇన్నాళ్ళు దాచారా నానించి" అంది అతన్ని దగ్గిరిగా తీసుకుంటో.



# దేవదాసు

(గతసంచిక తరువాయి)

దాదాపు రెండేండ్లు గడిచినై. మహేంద్రుని వివాహం చేసి పార్వతి చాలావరకు నిశ్చింతురాలైంది! జలదబాల బుద్ధిమతి. పనిపాటల్లో నిపుణ. పార్వతికి బదులు ఇంటి పనులు ఆమే చూస్తూ ఉండేది. పార్వతి ఇప్పుడు మనస్సును ఇంకో వైపుకు మరల్చింది. వివాహమై చాలాకాల మయినా ఇంకా ఆమె సంతాన ముఖం చూడ లేదు. తనకు సంతు లేకపోవటంచేత ఎవరి పిల్లలన్నా ఆమె చాలా అపేక్షచూపించేది. పేదసాదల మాటలా ఉంచండి; కాస్త నోటికీ చేతికీ ఉన్నవారి సంతాన బాధ్యతకూడా తానే వహించేది. ఇంతేకాక దేవాలయంలో పూజలూ, సాధుసన్యాసులకు సేవలూ, కుంటి—గుడ్డివారికి పరిచర్యలూ చేసి ఆమె కాలంగడుపుతూ ఉండేది. భర్తతోచెప్పి ఇంకో సత్రం కూడా కట్టించింది. అందులో అనాధులూ అసహాయులూ ఇష్టం వచ్చినంత కాలం ఉండవచ్చు. జమీందారుగారే వారి తిండీ తిప్పలూ చూస్తూ ఉంటారు. పార్వతి చాటుగా ఇంకో పనికూడా చేస్తూ ఉంటుంది; భర్తకు కూడా ఈ సంగతి తెలియ నివ్వదు. బ్రతికి-చెడ్డవారికి గుప్తంగా ధనసహాయం చేయటం. ఈ డబ్బు ఆమె సొంతది. భర్త ప్రతినెలా తనఖర్చుకు ఇచ్చేదంతా ఇలానే ఖర్చు పెట్టుతూ ఉంటుంది. ఎంత చాటుగా ఖర్చుపెట్టినా కచేరీ గుమాస్తాలకూ, మేనే జరుకూ తెలియకుండా ఉండదు. ఇప్పుడు పూర్వంకన్న ఖర్చు చాలా ఎక్కువైందని వాళ్లల్లో వాళ్లు తర్కించుకుంటూ ఉంటే దాసీల చెవిని పడేది. ఇక వాళ్ళ దగ్గర నుంచి జలదబాలదగ్గరికి చేరటం ఎంతసేపు పట్టుతుంది?

ఒకనాటి రాత్రి జలదబాల—‘ఈ యింటితో మీకేమీ సంబంధం లేదా?’ అని భర్తను అడిగింది.

‘ఎందుకో చెప్పూ!’

‘దాస దాసీలదాకా పోయినా మీకు కనపడటంలేదు. మామగారికి భార్యంటే చాలా తీపి–వారేమీ అనరు! మీరైనా చెప్పటం మంచిది.’

మహేంద్రునికి ఏమీ అర్థం కాకపోయినా ఉత్సుకతతో ‘ఎవరి సంగతి?’ అని అడిగాడు. జలదబాల గంభీరంగా భర్తకు సలహా ఇవ్వ నారంభించింది:

‘మీ పిన్నికి పిల్లా జల్లా లేరు. ఆమెకు సంసారంమీద ఎందుకు అపేక్ష ఉంటుంది? అందుకనే ఆస్తంతా పాడుచేస్తున్నది. మీరు చూట్టంలేదా?’

‘ఏం చేస్తున్నదీ?’ అన్నాడు మహేంద్రుడు కనుబొమలు చిట్లించి.

---

శ ర త్ బా బు

---

‘కాస్త కళ్లు తెరిస్తే మీకే కనపడేది. ఇప్పుడు పూర్వంకంటే కుటుంబ ఖర్చు రెట్టింపవుతూ ఉంది. అతిథి అభ్యాగతులకూ, సదావ్రతాలకూ, దానధర్మాలకూ తెంపులేదు. సరే, ఆమె పరం ఆమె చూసుకుంటూ ఉన్నది. ఇక మన ఇహం? మన కిక పిల్లలు పుట్టరా? అప్పుడు వాళ్ళేమి తింటారు?’

మహేంద్రుడు పక్కమీదనుంచి లేచి కూర్చున్నాడు.

‘నువ్వెవరి సంగతి చెప్పేది? అమ్మ సంగతేనా?’ అన్నాడు.

‘నారాత ఇలా తగలడింది! అన్నీ విప్పి చెప్పాల్సిన ఖర్మం నాకు పట్టింది.’

‘నువ్వు అమ్మమీద ఫిర్యాదు చేస్తున్నావా?’

‘నేను ఫిర్యాదూ చేయటంలేదు, చాడీలూ చెప్పటంలేదు. ఆ అవసరంకూడా లేదు నాకు. ఆఖరికి నామీద నెపం వేస్తారని జరుగుతున్న దేమిటో మీచెవిని వేశాను!’ అన్నది జలద విసురుగా.

మహేంద్రుడు మాట్లాడకుండా కాసేపు ఆలోచించి ‘మీ కన్నవారింట్లో రోజూ కుండ పొయ్యి ఎక్కదు. నీకు జమీందారుగారి ఇంటి ఖర్చు లేమి తెలుస్తవి?’ అన్నాడు.

ఈ మాటకు జలద మండిపోయింది—‘మీ అమ్మ కన్నవారు ఎన్ని సత్రాలు కట్టించారో చెప్పండి?’ అని అడిగింది.

మహేంద్రు డిక తర్కించలేదు. ఉదయాన లేవగానే పార్వతిదగ్గరికి వెళ్లి—‘నాకు మంచి పెళ్ళే చేశావమ్మా? నే నిక దీనితో వేగలేను, కలకత్తా వెళ్లుతున్నాను’ అన్నాడు.

‘ఎందుకు నాయనా?’ అన్నది పార్వతి విస్తుపోయి.

‘నిన్ను తూలనాడింది. నేను దాన్ని వదిలివేశాను.’

కొన్నాళ్ళనుంచి పార్వతి కోడలి ఆచరణ చూస్తూనే వస్తున్నది. కాని తన కేమీ తెలియనట్టుగా, నవ్వుతూ—‘కాదు, నాయనా! అమ్మాయి చాలా మంచిది.’ అని, తర్వాత జలదబాలను చాటుకు పిలిచి ‘మీరేమన్నా పోట్లాడుకున్నారా, అమ్మాయీ!’ అని అడిగింది.

ఉదయానే భర్త కలకత్తా పోవటానికి ప్రయాణ సన్నాహాలు చేయటం చూసి జలదబాల భయపడింది; పశ్చాత్తాపం చెందింది. అత్త ప్రశ్న వినగానే ఏడుస్తూ—‘తప్పు నాదే అత్తయ్యా! దాసీలమాటలు విని బుద్ధి గడ్డి తిన్నది!’ అన్నది.

తర్వాత వివరాలు విని పార్వతి సిగ్గుపడింది. కోడలి కళ్లు తుడుస్తూ—‘నువ్వు చెప్పేదే నిజం అమ్మాయీ! నాకు సంసారం పొదుపుగా ఉండాలని తెలియదు. నేను అంత దూరం ఆలోచించలేదు కూడా’ అన్నది.

పిమ్మట మహేంద్రుని పిలిచి—'తప్పులేనిది ఎవ్వరినీ శిక్షించకు నాయనా! నువ్వు భర్తవు—నీమేలుకంటే భార్యకు కావలసింది ఏముంటుంది? అమ్మాయి నీలక్ష్మి!' అన్నది.

ఆరోజునుంచి పార్వతి చెయ్యి వెనకాడింది. సత్రంలోనూ, దేవాలయంలోనూ వెనుకటిమాదిరిగా సేవలు జరగటం లేదు. అనేకమంది వికలాంగులూ, అనాథులూ తిరిగి పోసాగారు. ఈ సంగతి భర్తకు తెలిసి పార్వతిని పిలిచి—'ఏమే అమ్మి! అన్న పూర్ణ భండారం కాళీ అయిందా ఏమిటి?' అని అడిగాడు.

'ఊరక ఇచ్చుకుంటూపోతే కాపురం ఎన్నాళ్లు గడుస్తుంది—కొన్నాళ్లు కూడ బెట్టాలగా. ఇప్పుడు ఖర్చెంత పెరిగిందో మీకు కనపడటం లేదా?' అన్నది పార్వతి నవ్వుతూ.

'నే నింకా ఎన్నాళ్లు బ్రతుకుతాను? ఉన్న నాలుగురోజులూ సత్కార్యాలుచేసి పరలోకం వంక చూడటం మంచిది.'

పార్వతి నవ్వుతూ—'ఇది చాలా స్వార్థపరుల మాటండీ! మీ సంగతే మీరు చూచుకుంటే ఇక పిల్ల లేమైపోతారు? కొంతకాలం ఊరుకోండి; తర్వాత మళ్ళీ మొదలు పెట్టవచ్చును. మానవుల కార్యాలకు అంత మెప్పుడూ ఉండదు' అన్నది.

చౌదరిగారు ఇక విధిలేక ఊరుకున్నారు.

పార్వతికి ఇప్పుడు చేసే పనులేవీ లేవు. అందుకని ఆలోచనలు ఎక్కువైనాయి. ఈ ఆలోచనలలోకూడా రకాలున్నవి. ఆశలున్నవాళ్లు ఒక రకంగా ఆలోచిస్తారు; ఆశలుడిగినవాళ్లు ఇంకోరకంగా ఆలోచిస్తారు. మొదటిరకం ఆలోచనలో జీవం ఉంటుంది. సుఖం ఉంటుంది. దుఃఖం ఉంటుంది. తృప్తి ఉంటుంది. ఎక్కువ సేపు ఆలోచించలేరు. కాని ఆశాహీనులకు సుఖంలేదు. ఉత్కంఠత లేదు. కాని తృప్తి ఉంటుంది. కంటినుంచి నీళ్ళూకారతవి. గంభీర్వతమూ ఉంటుంది. కాని సరికొత్త హృదయవేదన ఉండదు. ఆ ఆలోచన వెలిమబ్బువలె ఎటుపడితే అటు కొట్టుకు పోతుంది. గాలి తగలనిచోట నిలబడుతుంది. తగిలినచోటి నుంచి తప్పుకు పోతుంది. తన్మయావస్థలో ఉన్న మనస్సు ఉద్వేగములేని ఆలోచనలో ఒకవిధమైన సఫలత పొందుతుంది. ఇప్పుడు పార్వతి స్థితి సరిగ్గా ఇలానే ఉన్నది. పూజదగ్గర కూర్చున్నప్పుడు స్థిరత్వమూ, ఆశా, ఉద్దేశమూ లేని ఆమె మనస్సు చప్పున 'తాల్ సోనాపురం'లో ఉండే వెదురుగుమ్మెలూ, మామిడితోపూ, పాఠశాలా, నదిఒడ్డూ మొదలగుచోట్ల తిరిగివచ్చేది, ఒకొక్కప్పుడు వాటిలో ఎందులోనైనా చిక్కుబడేది. అప్పుడు పార్వతికూడా వెతికి బయటికి తీసుక రాగలిగేది కాదు. పూర్వం ఆమె పెదవి మీదకు నవ్వు వచ్చేది; ఇప్పుడు ఒక అశ్రుబిందువు చప్పున పంచపాత్ర నీటిలోపడి కలిసిపోతూఉంది. అయినా కాలం గడిచిపోతూనే ఉన్నది. పనిపాటలు

చేస్తూ, మంచి చెడ్డలు చూస్తూ, సేవా శుశ్రూషలు చేసినా గడిచింది. అన్నీ వదలి ధ్యానమగ్నయోగినివలె ఉన్నా గడుస్తున్నది. కొంతమంది లక్ష్మి, అన్నపూర్ణ అనే వారు; మరికొందరు అన్యమనస్క, ఉదాసిని అనేవారు; కాని నిన్న ఉదయం నుంచి ఆమెలో ఇంకోమార్పు కనపడుతూ ఉంది. ఆమె కొంచెం తీవ్రంగానూ, కఠోరంగానూ కనపడుతూ ఉంది. నిండుగా, పాటుగా ఉండే గంగలో ఎక్కడ నుంచో పోటు వచ్చింది. దీనికి కారణం ఇంటోవాళ్ళ కెవ్వరికీ తెలియదు. నాకు మాత్రం తెలుసును; మనోరమ నిన్న వాళ్ల ఊరినుంచి ఉత్తరం వ్రాసింది:—

'పార్వతీ! మనం చాలాకాలంనుంచీ ఒకరి కొకరం ఉత్తరం వ్రాసుకోలేదు. ఈ తప్పు ఉభయులమీదా ఉంది. ఇది పరిష్కారం చేసుకోవటం మంచిదని నా అభిప్రాయం. ఇద్దరమూ తప్పు ఒప్పుకొని అభిమానాన్ని చంపుకోవటం ఉత్తమం! పెద్దదాన్ని కాబట్టి ముందుగా నేనే క్షమాపణ కోరుతున్నాను. వెంటనే జవాబిస్తావని కూడా ఆశిస్తున్నాను.

'నేను ఇక్కడికి వచ్చి ఒక మాసం కావచ్చింది. మనం కాపురంచేసే స్త్రీలం కాబట్టి దేహారోగ్యాన్నిగురించి అంత శ్రద్ధ తీసుకోము. లక్ష్యపెట్టము. చచ్చిపోతే చెర విరగడ చేసుకున్నదంటాము; బ్రతికుంటే బాగానే ఉన్నామంటాము. ఇక నాగొడవ అయింది. పోతే లోకాభిరామాయణం. విశేషాలు ఎక్కువ లేవు. అయినా ఒక సంగతి నీకు వ్రాయాలని నాకు చాలా కుతూహలంగా ఉన్నది. వ్రాద్దామా వద్దా అని నిన్నటినుంచీ ఆలోచిస్తున్నాను. వ్రాస్తే నీకు దుఃఖం కలుగుతుంది; వ్రాయక పోతే నాప్రాణంమీదకు వస్తుంది—మారీచుని మాదిరి అయింది నాస్థితి! దేవదాసు సంగతి వింటే నీకు తప్పక దుఃఖం కలుగుతుంది; ఇక నీ దుఃఖంచూసి నేను విలపించకుండా ఉండలేను. దేవుడు తప్పించాడు; లేకపోతే, అతని చేతిలో పడినట్లయితే నీవంటి అభిమానిని విషమైనా తినేది. లేక ఏ నుయ్యో, గొయ్యో ఐనా చూచుకునేది! ఇవ్వాళ కాకపోతే ఇంకా రెణ్ణాల్లకైనా అతని సంగతి నీకు తెలుస్తుంది. లోకాన్ని ఎలా మూయగలం?

'దేవదాసు ఇక్కడికి వచ్చి ఒక వారంరోజు లయినది. అతను కలకత్తాలో ఉంటున్నాడనీ, తల్లి కాశీలో ఉంటుందనీ, నీకు తెలుసునుగా! అన్నతో గిల్లి కజ్జా పెట్టుకుని డబ్బు గుంజుకుపోవటానికి మాత్రం మధ్య మధ్య ఇలా వస్తూఉంటాడని నాకు తెలిసింది. డబ్బు చిక్కిందాకా ఉండి చేతిలో పడగానే వెళ్ళిపోతాడట. అతని తండ్రి చనిపోయి రెండున్నర సంవత్సరాలుకూడా కాలేదు. నీకు వింటే ఆశ్చర్యం కలగవచ్చు. ఈమధ్య అతను సగం ఆస్తికిపైగా ఖర్చు పెట్టాడట. ద్విజదాసు చాలా లెఖ్ఖగాడు. పెద్దలు సంపాదించిన ఆస్తిని చెయ్యి దాటనివ్వలేదు. లేకపోతే లోకులు

ఎప్పుడో కాజేసి కూర్చునేవారు. తాగుడులకీ, వేశ్యలకీ తగలేసేవాణ్ణి ఎవరు కాపాడ గలరు?–ఒక్క యముడు తప్ప! బహుశా అదికూడా దగ్గరకు వచ్చిందనుకుంటాను. గుడ్డిలో మెల్ల ఏమంటే అతను పెళ్ళిచేసుకోక పోవటమే!

'అయ్యో! అతన్ని చూస్తే ఏడుపొస్తుంది! పచ్చటి శరీరం నల్లబడింది. ఆ చక్కదనం పోయింది; సిరి పోయింది—గుర్తు పట్టలేరు. జుట్టు ఎన్నడూ దువ్వినట్టు ఉండదు. గాలికి ఎగురుతూ ఉంటుంది. కళ్లు పీక్కుపోయినవి. ముక్కు కోటేరు మాదిరిగా లేచింది. ఇంత రోతగా ఉన్నాడని ఏమి చెప్పేది. చూస్తే అసహ్యం పుట్టుతుంది, భయంకూడా కలుగుతుంది! పగలంతా నది ఒడ్డునే తుపాకి తీసుకుని పిట్టలు కొడుతూ ఉంటాడు. మరీ ఎండకు ఆగలేకపోతే, ఆ వంతెనదగ్గరగ ఉన్న రేగుచెట్టుక్రింద తల వంచుకుని కూర్చుంటాడు. సాయంకాలం ఇంటికి వచ్చి మద్యం త్రాగుతాడు. ఇక రాత్రి నిద్రపోతాడో గస్తీ తిరుగుతాడో దేవుడికే తెలియాలి.

'ఆవాళ సాయంకాలం నేను నీళ్లు తేవటానికి నదికి పోయాను. దేవదాసు తుపాకి చేత పట్టుకొని నది ఒడ్డునే నడచివస్తున్నాడు. నన్ను చూసి గుర్తించి నాదగ్గిరికి వచ్చి నిలబడ్డాడు. నేను భయంతో వణికిపోయాను. రేవు దగ్గర ఒక్క పురుగుకూడా లేదు. నా పైప్రాణాలు పైనే పోయినవి. దేవుడు కాపాడాడు; తాగుబోతు చేష్టలేవీ చేయలేదు. చాల పెద్దమనిషి తరహాగా 'మనో! బాగా ఉన్నావా, చెల్లీ!' అన్నాడు శాంతంగా.

'నే నేమి చేస్తాను? భయంతో—'ఊఁ' అన్నాను తల తిప్పి. అప్పుడతను నిట్టూర్చి—'సుఖంగా ఉండు చెల్లీ! మిమ్మల్ని చూస్తే నాకు చాలా ఆనందంగా ఉంటుంది.' అని నెమ్మదిగా వెళ్లిపోయాడు. నేను పడుతూ లేస్తూ ఇంటికి పరిగెత్తాను. అమ్మయ్యో! నా అదృష్టం బాగాఉండింది—చెయ్యీ గియ్యీ పట్టుకొని



లాగ లేదు! సరే. పోనీయి ఆ సంగతి ఆభ్రష్టుని సంగతులు వ్రాయాలంటే ఒక గ్రంథం అవుతుంది.

'పారూ, నిన్ను చాల కష్టపెట్టాను కాదూ? నీవు ఇప్పటికైనా అతన్ని మరచిపోలేక పోతే, నీకు దుఃఖం ఎలానూ తప్పదు. దీనికి మరో ఉపాయ మేముంది? ఈ విషయంలో నావల్ల ఏదైనా జరిగి ఉంటే నీ ప్రేమకోరే మనోదీదిని క్షమించు. నీబోటి గుణవంతురాలి కిది ఒక గొప్పకాదు.'

నిన్ననే ఈ ఉత్తరంవచ్చింది. ఇవ్వాళ మహేంద్రుని పిలిచి—'రెండు పల్లకీలూ ముప్పయి ఇద్దరు బోయీలు కావాలి. నేనిప్పుడో తాల్‌సోనాపురం పోతాను' అన్నది.

మహేంద్రునికి ఆశ్చర్యం వేసింది. 'అలాగే సిద్ధం చేయిస్తాను. కాని రెండు పల్లకీలు ఎందుకమ్మా' అని అడిగాడు.

'నీవుకూడా వెంట రావాలి నాయనా, దోవలో నేను చనిపోతే తల కొరివి పెట్టటానికి కొడుకు ఉండాలిగా.'

మహేంద్రు డిక మాట్లాడలేదు. పల్లకీలు రాగానే ఇద్దరూ బయలుదేరారు.

చౌదరిగారికి ఈసంగతి తెలియగానే వ్యాకులపడి దాస దాసీలను పిలిచి అడిగాడు. కాని వాళ్లెవరూ కారణం చెప్పలేక పోయారు. అప్పు డాయన బుద్ధినంతా వినియోగించి ఇంకా కొంతమంది సిపాయీలనూ దాసీలనూ పంపించాడు.

'దోవలో కనపడితే పల్లకీలు తిప్పించుకు రమ్మంటారా బాబూ!' అని ఒక సిపాయి అడిగాడు.

వారు కొంచెం ఆలోచించి—'అక్ఖర్లేదు. మీరు కూడా వెంటనే పోయి ప్రమాదాలేవీ రాకుండా చూడండి' అన్నారు.

ఆనాడు పొద్దుకుంకేవరకు పల్లకీలు రెండూ తాల్‌సోనాపురం చేరినవి. కాని దేవదాసు ఊళ్ళోలేడు. మధ్యాహ్నమే కలకత్తా వెళ్ళిపోయాడట.

పార్వతి తల బాదుకుని— 'నా దురదృష్టం' అనుకున్నది. తర్వాత మనోరమను కలుసుకున్నది.

'ఏం పారూ! దేవదాసుని చూడటానికి వచ్చావా?' అన్నది మనోరమ.

'కాదు. వెంట తీసుకుపోవటానికి వచ్చాను. ఇక్కడ అతనికి 'నా'అనే వాళ్ళెవరూ లేరు.'

మనోరమ దిగ్భ్రమ చెందింది.

'ఏమిటే నువ్వువాగేది? సిగ్గన్నా వేయటంలేదూ?'

'సిగ్గెందుకు? ఎవరివస్తువు వాళ్లు తీసుకువెళ్ళటానికి కూడా సిగ్గేనా?'

'ఛీ, ఛీ, అలా అనకు! కాస్త చుట్టరికం అన్నాలేదు, అలాంటి మాటలు నోట రానీయకు-'

పార్వతి మ్లానంగా నవ్వి-'మనోదీదీ! నాకు జ్ఞానం తెలిసినప్పటినుంచీ మనస్సులో నాటుకుపోయిన సంగతి. ఎప్పుడన్నా బయటపడుతూ ఉంటుంది. నువ్వు నా అక్కవు. అందుకనే ఈమాట వినగలిగావు.'

మర్నాటి ఉదయం పార్వతి తల్లిదండ్రులకు నమస్కారం చేసి, మళ్లీ పల్లకీఎక్కింది.

* * *

చంద్రముఖి అశ్వద్ధపురం వచ్చి రెండు సంవత్సరాలైనది. వాగు ఒడ్డున కాస్త మెరకగా ఉన్నచోటుచూసి రెండు నిట్టాళ్ల పూరికొంప వేసుకున్నది. దాన్ని రెండుగదులుచేసి, ఒకదానిని వంటా, సామానువేసుకోటానికీ, రెండవదానిని పండుకోటానికీ కూర్చోటానికీ ఉపయోగించుకుంటూ ఉన్నది ఇంటికి కొంచెం దూరంగా చోపరా. దాంట్లో నల్లావు ఉంటున్నది. ఇంటి ముంగిలి ఎప్పుడూ శుభ్రంగా ఉంటుంది. రోజూ పోలికూతురువచ్చి పాచి ఊడ్చి కల్లాపి చల్లిపోతూ ఉంటుంది. ఇంటిచుట్టూ ఆముదాల కంచె. మెల్లాలో రేగుచెట్టు. ఇంటి వెనక తులసికోట! నీళ్ళరేవు ఎదురుగానే ఉంది—కూలివాళ్ళను పెట్టి ఖర్జూరపుచెట్లు మెట్టుగా వేయించింది. ఈ రేవు ఈమె తప్ప ఇక నెవ్వరూ వాడరు. వానాకాలంలో మురికి వర్షాలు కురిస్తే నీళ్లు చంద్రముఖి ఇంటిలోకి ఎక్కుతై. గ్రామస్తులు చాలా ఆదుర్దాతో పలుగులూ పారలూ తీసుకువచ్చి నీరు ఇంటికి ఎక్కకుండా కట్టవేసి పోతారు. ఈ గ్రామంలో అగ్రవర్ణాలవారు ఎవరూ లేరు. గొల్లలు, బెస్తలు, గవళ్ళూ, ఊరిబైట రెండు మాదిగ కొంపలు కూడా ఉన్నవి.

చంద్రముఖి ఈ గ్రామం వచ్చినాక దేవదాసుకు ఉత్తరం వ్రాసింది. జవాబుగా ఇంకా కొన్ని రూపాయలు పంపాడు. చంద్రముఖి ఈ డబ్బు ఊళ్ళోవాళ్ళకు అప్పు పెట్టుతూ ఉంటుంది. ఇబ్బంది వచ్చినప్పుడు వాళ్లు ఈమెదగ్గరకే పరుగెత్తుకొస్తూ ఉంటారు; డబ్బు తీసుకెళ్ళుతూ ఉంటారు. చంద్రముఖి వడ్డీతీసుకోదు. దానికి బదులుగా వారు కూరా నారా పండూ ఫలమూ ఇచ్చిపోతూ ఉంటారు. వడ్డీ అలా ఉంచి, అసలుకోసం కూడా ఆమె అంతగా పీడించదు. ఇవ్వలేనివారు అదీ ఇవ్వరు. చంద్రముఖి నవ్వుతూ—'ఇక నీ కెప్పుడూ ఇవ్వను!' అనేది తీర్చని వారితో.

'ఈ తఫా బాగా పండేటట్టు దీవించుతల్లీ!' అని వారు బ్రతిమాలేవారు.

చంద్రముఖి దీవించేది. మళ్ళీ పంటలు సరిగా పండేవి కావు. శిస్తుకు జమీందారు వత్తిడి పెడితే మళ్ళీ ఆమె దగ్గఱకు వచ్చి ఏడుస్తూ నిలఁబడేవారు. చంద్రముఖి లోలోన నవ్వుకుని—'వారుండగా నా కేమి తరుగు' అని అనుకునేది.

కాని అతను ఏడి? దాదాపు ఆరు మాసాలైంది. అతని దగ్గర నుంచి ఉత్తరమే లేదు. రిజిస్టరు ఉత్తరం రాస్తే తిరిగి వచ్చింది. చంద్రముఖి ఒక గొల్లకుటుంబాన్ని తన యింటిదగ్గఱ అట్టిపెట్టుకుంది. భైరవుని కొడుకుపెళ్ళికి పది రూపాయలన్నర ఓలి ఇచ్చింది; నాగలి ఒకటి కొనిపెట్టింది. భైరవుడే ఈ కుటుంబానికి పెద్ద. ఈ కుటుంబం ఈమెను ఆశ్రయించుకు బతికేదే; ఇమె చెప్పినట్లు నడుచుకునేదే.

ఒకనాటి ఉదయం చంద్రముఖి భైరవుని పిలిచి—'ఇక్కడికి తాల్‌సోనాపురం ఎంత దూర ముంటుందో ఎరుగుదువా?' అని అడిగింది.

భైరవుడు కాస్త ఆలోచించి 'ఎంతమ్మా! రెండు పరుగులేస్తే కచ్చేరివచ్చి కూర్చుం టుంది' అన్నాడు.

'అక్కడ జమీందారు ఉంటాడుకదూ?'

'ఆc, ఉన్నారు. ఈ గ్రామంకూడా వారిదే. మూడుసంవత్సరాలైంది, పెద్దాయన చనిపోయి. వారి శ్రాద్ధానికి కొన్ని రోజులుపాటు తిన్నాము. వారికి ఇద్దరు కొడుకు లున్నారు. వారికేమమ్మా మహారాజులు!'

'నన్నక్కడికి తీసుకుపోగలవా, భైరవ్?'

'ఎందుకు తీసుకువెళ్లలేను తల్లీ! మీ ఇష్టం వచ్చినరోజున బైలుదేరండి.'

'ఐతే ఇవ్వాళే పోదాము, భైరవ్!' అన్నది చంద్రముఖి ఉత్సుకతతో.

భైరవుడు విస్మితుడై—'ఇవ్వాళనేనా!' అని చంద్రముఖి ముఖం వంక పరీక్షగా చూసి—'అయితే త్వరగా వంట చేసుకో తల్లీ! నేను చద్ది కట్టుకువస్తాను' అన్నాడు.

'ఇప్పుడు కాదులే, భైరవ్! నువ్వు చద్దికట్టుకురా' అన్నది చంద్రముఖి.

భైరవుడు ఇంటికిపోయి చద్దికట్టించుకుని, కర్రచేత పట్టుకుని, ఒక్కక్షణంలో తిరిగి వచ్చి—'ఇక బైలుదేరండి. కాని, మీరుకూడా కాస్త ఎంగిలి పడకూడదా అమ్మగారూ?' అన్నాడు.

'వద్దు భైరవ్! నే నింకా పూజచేసుకోలేదు. వీలుంటే అక్కడికి పోయినాక చూసుకొంటాను.'

భైరవుడు ముందు దోవచూపిస్తూ నడిచాడు. చంద్రముఖి వెనక పిప్పిగడ్డల్లో మహా ప్రయాసపడుతూ నడుస్తున్నది. నడక అలవాటు లేకపోవటంచేత ఆమె పాదాలు బొబ్బలెక్కినై. ముఖం కందిపోయింది ఎండకు. ఇంకా భోంచేయలేదు. ఐనా చంద్రముఖి ఒక్కొక్క చేనుదాటి పోతూనే వున్నది. చేలల్లో పని చేసుకొం టున్న రైతులు ఆమె ముఖం వంక ఆశ్చర్యంతో చూస్తూఉండిపోయారు.

చంద్రముఖి ఎర్రంచుల చీర కట్టుకున్నది. చేతిని రెండు గాజులున్నవి. తల మీద ముసుగు. ఒంటిచుట్టూ దుప్పటి. ఝాము పొద్దువుండగా ఊళ్ళోకి చేరారు.

'నీ రెండుపరుగులూ ఇప్పటికి పూర్తి అయినాయా!' అన్నది చంద్రముఖి నవ్వుతూ.

భైరవుడు పరిహాసం గ్రహించలేక—'వచ్చేశాంగా తల్లీ! మీది సుఖపడ్డశరీరం. మళ్లీ ఇవ్వాళే తిరిగి రాగలరా?' అన్నాడు.

'ఇవ్వాళేమిటి, రేపుకూడా బహుశా నడిచిరాలేను' అని చంద్రముఖి మనస్సులో అనుకుని—'ఇక్కడ బండి దొరకదా?' అని అడిగింది.

'ఎందుకు దొరకదు తల్లీ, ఎడ్లబండిని పిలుస్తాను.'

బండి కుదుర్చమని చెప్పి చంద్రముఖి జమీందారుగారి మేడలో ప్రవేశించింది. భైరవుడు బండి మాట్లాడటానికి వెళ్ళిపోయాడు.



మేడ రెండో అంతస్తులో పెద్దావిడ—ఇప్పటి జమీందారుగారి భార్య కూర్చుని ఉన్నది. ఒక దాసీది చంద్రముఖిని వెంటపెట్టుకొని అక్కడికి తీసుకు వెళ్ళింది. ఇద్దరూ ఒకరి నొకరు బాగా చూచుకున్నారు. చంద్రముఖి నమస్కరించింది.

జమీందారుగారి భార్య ఒంటిమీద నగలు పట్టకుండా ఉన్నవి. కళ్ళల్లోనుంచి అహంకారం పైకి తన్నుతూ ఉన్నది. పెదవులూ పళ్ళూ, తాంబూలమూ కాసూ వేసుకోవటం మూలాన నలుపుకు తిరిగినవి. ఒక బుగ్గ ఎత్తుగా ఉన్నది. బహుశా తాంబూలపు తమ్మ లోపల ఉండవచ్చు. జుట్టు ఎగదువ్వి నడినెత్తిన చుట్ట చుట్టింది. బూబుల మాదిరిగా రెండు చెవులకూ నందుకేంకుడ పోగులున్నవి. ఒక ముక్కున చంద్రవంక; రెండో ముక్కున పెద్ద బెజ్జం. బహుశా అత్తగారి అమలులో ముక్కెర పెట్టుకుని ఉంటుంది. దొందుశరీరం; నల్లగా నిగనిగ లాడుతూ ఉంది. పెద్ద కళ్ళు; గుండ్రని ముఖం, నల్లని చీరె కట్టి, సిల్కు జాకెట్టు తొడుక్కున్నది. ఈమెను చూసే వరకు చంద్రముఖికి అసహ్యం కలిగింది.

చంద్రముఖి కొంచెం వయస్సు మిగిలిందైనా చాలా చక్కనిది. బహుశా వీరిద్ధరికి ప్రాయం ఒకటే కావచ్చును. కాని పెద్దావిడ దీనికి ఒప్పుకోదు! ఈ గ్రామంలో పార్వతి తప్ప ఇంత చక్కనిదాన్ని ఆమె ఎప్పుడూ చూడలేదు. ఆమె ఆశ్చర్యంతో 'ఎవరు మీరు?' అని అడిగింది.

చంద్రముఖి 'తమ ప్రజనేనండీ, కొంచెం శిస్తు బాకీ ఉండి చెల్లించడానికి వచ్చాను' అన్నది.

పెద్దావిడ లోలోపల సంతోషించి—'అయితే ఇక్కడికి ఎందుకు? కచ్చేరీకి పోరాదా!' అన్నది.

చంద్రముఖి మందహాసం చేసి—'నేను బీదరాల్ని తల్లీ! పన్నంతా చెల్లించలేను. మహా దయగలవారని విని తమ దగ్గరికి వచ్చాను. అనుగ్రహించి కొంత మాఫీ చేయిస్తే, చెల్లించి పోతాను' అన్నది.

ఈ మాట పెద్దావిడ తన జీవితంలో యిదే మొదటిసారి వినటం; ఆమెకు దయ ఉన్నదట! శిస్తు మాఫీ చేయించగలదట! ఇంకేం ఆమెకు చంద్రముఖిమీద ఎన్నడూ లేని దయ కలిగింది.

'అదే, అమ్మాయీ! రోజూ నన్ను ఎందరో వచ్చి వేధిస్తూ ఉంటారు. ఎంతో డబ్బు వదిలిపెడుతూ ఉంటాను! లేదనలేను. అందుకనే మావారు నన్నెప్పుడూ కోప్పడుతూ ఉంటారు! సరే కాని, నీ బాకీ ఎంత?'

'ఎక్కువలేదుతల్లీ. రెండురూపాయలే. కాని మాకు అవే గగనం. ఇవ్వాళ పగలల్లా పడుతూ లేస్తూ ఇంతదూరం నడచి వచ్చాను.'

'అయ్యో మీబోటి దీనులమీద దయ చూపించవలసిందే. బిందూ, ఈమెను తీసుకు వెళ్లి మేనేజరుగారితో నేను చెప్పానని చెప్పి రెండు రూపాయలూ తీసివేయించు. అం, నీ ఇల్లు ఎక్కడ అమ్మాయి?'

'అశ్వద్దపురం అనే గ్రామం. మీ ఇలాకాలోదే. సరే కాని, అమ్మగారూ! ఇప్పుడు జమీందారులు యిద్దరు కాదండీ?'

'ఇద్దరేంటి పాడు! ఇంకా రెండురోజులుంటే అంతా మాచే అవుతుంది.'

'ఎలా తల్లీ! చినబాబుకు చాలా అప్పున్నదా!' అన్నది చంద్రముఖి ఉద్విగ్నతతో.

పెద్దావిడ మందహాసంచేసి 'ఆస్తంతా మాకు తాకట్టుపెట్టాడు. మా మరిది ఇక దివాళే. తప్ప తాగుతూ ముండను పెట్టుకొని కలకత్తాలో ఉంటున్నాడు. ఎంత డబ్బు తగలేశాడో లెఖ్ఖ ఉన్నదా' అన్నది.

చంద్రముఖి ముఖం వాడిపోయింది. కాసేపు ఊరుకుని-'చిన్నబాబుగారు ఎప్పుడూ ఇంటికి రారా, అమ్మగారూ?' అని అడిగింది.

'ఎందుకురాడు? డబ్బు అవసరమైనప్పుడు వస్తాడు. తాకట్టుపెట్టి తీసుకుపోతాడు. రెండు మాసాల కిందట ఒకమాటు వచ్చి పన్నెండు వేల రూపాయలు తీసుకు వెళ్ళాడు. బతికే లక్షణాలు కూడా లేవు. ఒంటి నిండా చెడురోగాలు, ఛీ, ఛీ—'

చంద్రముఖి కంపించింది. 'వారు కలకత్తాలో ఎక్కడ ఉంటారు?' అని మలిన ముఖంతో అడిగింది.

పెద్దావిడ నొసలుబాదుకొని—'పాడురాత! అది ఎవ్వరికి తెలుస్తుంది? ఏ హొటల్లోనే తిని, ఎవతె కొంపలోనో పడి ఉంటాడు—అది అతనికి తెలియాలి; అతని సారా బుద్ధికి తెలియాలి!' అన్నది నవ్వుతో.

'ఇక నేను వెళ్తాను.' అన్నది చంద్రముఖి చప్పున లేచి నిలబడి.

పెద్దావిడ ఆశ్చర్యంతో-'వెళ్తావా?' అని బిందును కేక వేసింది.

'అఖ్ఖర్లేదు తల్లీ! నే నొక్కదాన్ని కచ్చేరీకి పోగలను' అని నెమ్మదిగా బయలుదే రింది. బయటకు వచ్చేవరకు ఆమెకోసం భైరవుడు కనిపెట్టుకుని ఉన్నాడు. ఎద్దు బండి సిద్ధంగా ఉన్నది. ఆ రాత్రే చంద్రముఖి ఇంటికి తిరిగివచ్చింది.

ఉదయాన మళ్ళీ భైరవుని పిలిచి-'నేను కలకత్తా పోవాలి, భైరవ్! నువ్వు ఎలానూ రాలేవు. నీ కొడుకును తీసుకుపోతాను. ఏమంటావు?' అని అడిగింది.

'మీ ఇష్టం తల్లీ. కాని కలకత్తా ఎందుకు, ఏమన్నా అవసరమైన పని ఉందా?'

'అవును భైరవ్! అవసరమైన పనే ఉంది.'

'మళ్ళీ ఎప్పుడొస్తారు అమ్మగారూ?'

'ఆ సంగతి చెప్పలేను భైరవ్! వస్తే వెంటనే రావచ్చు. లేకపోతే కొంత ఆలస్యం కావచ్చు. ఒకవేళ అసలు రావటమే పడకపోతే నా ఆస్తంతా నువ్వు తీసుకో.'

భైరవుడు మొదట నిశ్చేష్టు డయ్యాడు. తర్వాత అతని కళ్లల్లో నీరు తిరిగింది. 'అవేమి మాటలు తల్లీ! మీరు లేకపోతే ఈ గ్రామంలో ఒక్కరుకూడా బ్రతకరు!' అన్నాడు.

చంద్రముఖి కళ్ళల్లోకూడా నీరు తిరిగింది-'అవేమిటి భైరవ్! నేను ఇక్కడికి వచ్చి రెండు సంవత్సరాలేగా అయింది; అంతకు పూర్వం మీరు బ్రతకలేదా?'

దీనికి జవాబు మూర్ఖభైరవుడు ఇవ్వలేకపోయాడు. కాని చంద్రముఖి అంతరంగంలో అంతా గ్రహించింది.

భైరవునికొడుకు రాముడు వెంటరావటం స్థిరపడింది. చంద్రముఖి బండిలో అవసరమైన సామానుపెట్టి బండిఎక్కబోతూ ఉండగా, ఈమెను చూడటానికి వచ్చిన గ్రామస్థులందరూ ఏడవ నారంభించారు. చంద్రముఖి కళ్లలో కూడా నీరు తిరిగింది.

'పాడు కలకత్తా! దేవదాసుకోసం వెళ్ళుతున్నాను కాని, లేకపోతే నన్ను కలకత్తాకు రాణీని చేస్తానన్నా వీరి ప్రేమను నిరసించి వెళ్లేదాన్నికాను' అని మనస్సులో అనుకున్నది.

చంద్రముఖి మర్నాడు క్షేత్రమణి యింటికి వచ్చి దిగింది. పూర్వం ఈమె ఉన్న ఇంట్లో ఎవరో కొత్తవాళ్ళు ఉంటున్నారు. చంద్రముఖిని చూడగానే క్షేత్రమణి విస్తుపోయి—'నువ్వా చెల్లీ! ఇన్నాళ్ళనుంచీ ఎక్కడ ఉంటున్నావు!' అన్నది.

'అలహాబాదులో' అన్నది చంద్రముఖి నిజం దాచి.

క్షేత్రమణి ఆమెను ఎగాదిగా చూసి—'నీ నగలన్నీ ఏమయినై?' అన్నది.

'అన్నీ వున్నవి.' అన్నది చంద్రముఖి నవ్వుతూ.

చంద్రముఖి ఆనాడే దయాళ్ దగ్గిరికి పోయి—'నాకింకా ఎంత రావలసి ఉంటుంది, దయాళ్?' అని అడిగింది.

దయాళ్ చిక్కులో పడ్డాడు:-'అదే, ఇంకా అరవయ్యో డెబ్బయ్యో రావలసి ఉంటవి. నాలుగైదు రోజుల్లో సర్దుతాను అమ్మాయి!' అన్నాడు.

‘ఇప్పుడు డబ్బుతో నాకేమీ అవసరంలేదు. నాకు కొన్ని పనులున్నై. చేసిపెట్టు.’

‘ఏం పనులు?’

‘నువ్వు రెండు రోజులు పని చెడవలసి ఉంటుంది. మా పేటలో ఒక యిల్లు అద్దెకు కుదర్చాలి—తెలిసిందా?’

‘తెలిసిందమ్మాయి!’ అన్నాడు దయాళ్ నవ్వుతూ.

‘మంచి ఇల్లు మాట్లాడాలి. చక్కని మంచం, పరుపూ, దిళ్ళూ, దీపాలూ, టేబిలూ—తెలిసిందా?’ దయాళ్ తల ఆడించాడు.

‘అద్దం, దువ్వెనా, రెండు అద్దకం చీరెలూ, ఒక సిల్కు జాకెట్టూ, మంచి గిల్టు నగలు ఎక్కడ దొరుకుతాయో చెప్పగలవా?’

దయాళ్ చోటు చెప్పాడు.

‘అయితే ఒక సెట్టు మంచివిగా చూసి కొనాలి—నేను గూడా వెంటవస్తాను.’ అని నవ్వుతూ—‘మాకు ఇంకా ఏమేమి కావాలో నీకు తెలుసుగా; ఒక దాసీని కూడా కుదర్చాలి’ అన్నది.

‘ఎప్పటిలోగా అమ్మాయీ?’

‘ఎంత త్వరలో అయితే అంత మంచిది. రెండుమూడు రోజులు ఆలస్యమైనా ఫరవాలేదు.’ అని అతని చేతికి వందరూపాయల కాగితం, ఒకటి యిచ్చి—‘చౌక చూడబోకు. నాణ్యమైన సరుకు కొను.’ అన్నది.

మూడోనాడు చంద్రముఖి కొత్త ఇంట్లోకి వెళ్ళింది. ఆ పగలంతా రాముని తోడ్పాటుతో తన యిచ్చవచ్చినట్లు అలంకరణ ప్రారంభించింది. ముఖం సబ్బుతో కడిగి, పౌడరు అద్దుకుంది. కాళ్ళకు పారాణీ పెట్టుకొని, తాంబూలం వేసుకుంది. తర్వాత నగలు పెట్టుని, జుబ్బా తొడిగి, అద్దకంచీరె కట్టుకున్నది. ఎన్నాళ్ళనించో సంస్కారం ఎరగని జుట్టును మరలదువ్వి, నెత్తిన కొండీచుట్టు చుట్టింది. అద్దంలో ముఖం చూచుకుని లోలోన నవ్వుకొని—‘ఇంకా ఏమేమి రాసిపెట్టి ఉందో ఈపాడు నొష్టని,’ అనుకొన్నది.

పల్లెటూరి రాముడు ఈ కొత్త అలంకారాలూ, దుస్తులూ చూసి గాభరాపడి ‘ఇదేమిటి అక్కయ్యా?’ అని అడిగాడు.

చంద్రముఖి నవ్వుతూ—‘ఇవ్వాళ నాభర్త వస్తాడు రామూ!’ అన్నది.

రాముడు విస్మయంతో చూస్తూ ఉండిపోయాడు.

సాయంత్రం అయినాక క్షేత్రమణి ఊసుపోకకు వచ్చి—‘మళ్ళీ ఇదేమిటి చెల్లీ!’ అని అడిగింది.

‘మళ్ళీ ఇవన్నీ కావలసిందేగా!’ అన్నది చంద్రముఖి మందహాసంచేస్తూ.

క్షేత్రమణి కాసేపు అలాగే చూసి—‘చెల్లికి ఏళ్లతోపాటు రూపంకూడా పెరుగుతూ ఉంది!’ అన్నవి.

క్షేత్రమణి వెళ్ళిపోయిన తర్వాత చంద్రముఖి మళ్ళీ వెనకటి మాదిరిగానే కిటికీ వద్ద కూర్చుని రెప్ప వాల్చకుండా రోడ్డువంక చూడ నారంభించింది. ఆమె పని ఇదే; దీనికోసమే ఆమె వచ్చింది—ఇక్కడ ఉన్నన్నాళ్లు ఈ పనే చేస్తుంది.

ఎప్పుడన్నా కదాచితుగా కొత్తవాళ్లు వచ్చి తలుపుతట్టుతూ ఉండేవారు. ఇంట్లో కూర్చున్న రాముడు వల్లించిన పాఠంలా—'ఇక్కడలేరు' అని వప్పగిస్తూ ఉండేవాడు. వెనుకటి పరిచయాన్నిబట్టి ఎవరన్నాలోపలికి వస్తే చంద్రముఖి వారిని కూర్చోపెట్టి నవ్వుతూ మాట్లాడేది. మాటల సందర్భంలో దేవదాసు సంగతి అడిగేది. వారికి తెలిసేది కాదు—వారు ఊరకనే పోవలసివచ్చేది. రాత్రి చాలా ప్రొద్దుపోయిన తర్వాత చంద్రముఖి స్వయంగా బయలుదేరి ప్రతి గల్లీ. ప్రతి ద్వారమూ వెదుకుతూ తిరిగేది! ఎవరన్నా ఇంట్లో మాట్లాడుకుంటున్నట్టు తెలిస్తే చంద్రముఖి చెవి ఆనించి వినటానికి ప్రయత్నించేది—ఏమేమో మాట్లాడుకుంటూ ఉండేవారు. కాని ఆమెకు కావలసిన మాటలు వినపడేవి కావు. అప్పుడప్పుడు యెవరన్నా తాగుబోతులు ఈమెను పట్టుకోటానికి వెంటపడేవారు! చంద్రముఖి ప్రాణాలు తప్పించుకు పరుగెత్తుతూ ఉండేది. ఇక మధ్యాహ్నం ఈమె ఎరిగిన ఇళ్ళకల్లా వెళ్లుతుండేది. మాటల సందర్భంలో 'మీలో ఎవరన్నా దేవదాసును ఎరుగుదురా?' అని అడిగేది.

'ఏ దేవదాసు?' అని వారడిగేవారు.


చంద్రముఖి కుతూహలంతో దేవదాసును వర్ణించేది:

'పచ్చని ఒళ్లు, గొగ్గుల గొగ్గుల క్రాపు. తలమీద కుడివైపున తెగిన మచ్చ. చాలా ధనవంతుడు, డబ్బు దుబారాగా ఖర్చుచేస్తూ ఉంటాడు-ఎరుగుదురా ఎవరన్నా?' అని అడిగేది.

ఎవ్వరూ జాడ చెప్పేవారు కాదు. చంద్రముఖి హతాశురాలై, చిన్నపోయిన ముఖంతో ఇంటికి వచ్చేది. చాలా పొద్దుపోయేవరకు మేల్కొని రోడ్డువంకనే చూస్తూ ఉండేది. నిద్రవస్తే విసుక్కునేది. 'ఇది నీకు నిద్రపోయే సమయమా?' అని మనస్సును హెచ్చరించుకునేది.

ఇలా ఒకమాసం గడిచింది. రాముడు విసుగెత్తిపోయాడు. దేవదాసు ఇక్కడ లేడేమోనని కూడా చంద్రముఖికి సందేహం కలగ నారంభించింది. ఐనా ఆశను మాత్రం వదలుకోలేదు. దేవతల్ని ప్రార్థిస్తూ దినాలు గడుపుతూ ఉన్నది.

నెలా పదిహేను రోజులు గడిచినవి. అవాళ రాత్రి చంద్రముఖికోర్కె ఫలించింది. రాత్రి పదకొండు గంటలకు, వెదకి వెదకి వేసారి హతాశురాలై ఇంటికి తిరిగివస్తూ ఉండగా రోడ్డు పక్కను ఎవరో పండుకొని తనలో తాను వాక్కుంటూ ఉండటం చూసింది. చంద్రముఖి గుండె దడదడ కొట్టుకున్నది. ఈ గొంతుక ఈమె ఎరిగిందే! కోటిమందిలో ఉన్నా గుర్తించగలదు. ఆవ్యక్తి పడిఉన్నచోట కొంచెం చీకటిగా ఉన్నది. పైగా అతను తప్పతాగి బోర్ల పండుకుని ఉన్నాడు. చంద్రముఖి దగ్గరికి



పోయి అతని వంటిమీద చెయ్యివేసి-'మీ రెవరండి. ఇలా పండుకున్నా రెందుకు?' అని అడిగింది.

'విను సఖీ! నాదు మనవి, శ్యామసుందరు తోడి తేవే-' అన్నాడతను కూనిరాగంతో. చంద్రముఖి సందేహం తీరింది-,దేవదాస్!' అని పిలిచింది.

దేవదాసు ఆ విధంగానే—'ఊఁ, తోడితేవే!' అన్నాడు.

'ఇక్కడ పడుకున్నా వెందుకు? ఇంటికి వస్తావా?'

'రాను. నాకిక్కడే బాగుంది.'

'ఇం కొస్త సారా తాగుతావా?'

'తాగుతాను' అని చంద్రముఖి మెడవాటు వేసుకుని 'ఎవరు బాబూ నువ్వు, నాకింత ప్రాణ మిత్రుడవి' అన్నాడు

చంద్రముఖి కళ్ళవెంట నీరు కార నారంభించింది. దేవదాసు ఆమె మెడ పట్టుకుని తూలుతూ ఎలాగో చాలా ప్రయాసమీద లేచి నిలబడి చంద్రముఖి ముఖం వంకచూచి—'వహ్వా! భలే నాణ్యమైన నరుకోయ్ దేవదాస్!' అన్నాడు. చంద్రముఖికి ఏడుపులో కూడా నవ్వు వచ్చింది.

'ఆఁ, బలే నాణ్యమైన సరుకు! సరే, నా భుజంమీద చెయ్యివేసి ఇంకాస్తదూరం నడువు. బండికావాలి కాదూ?' అన్నది.

'ఎందుకు కావద్దూ!' అని దేవదాసు దోవను నడుస్తూ—'నువ్వు నన్ను ఎరుగుదువా, సుందరీ?' అని పట్టుకుపోయిన గొంతుతో అడిగాడు.

'ఎరుగుదును' అన్నది చంద్రముఖి.

'అంతా నన్ను మరిచిపోయిరీ, ఇక నువ్వే మిగిలావ్' అన్నాడు దేవదాసు పాడుతూ.

తర్వాత చంద్రముఖి ఆధారంతో బండి ఎక్కి ఇంటికి చేరాడు. వాకిటి దగ్గర నిలబడి జేబులో చెయ్యి పెట్టి—'సుందరీ! దోవలో ఉన్నవాణ్ణి పట్టుకొచ్చావు కాని జేబులో దమ్మిడీకూడా లేదు?' అన్నాడు. చంద్రముఖి మాట్లాడకుండా లోపలికి లాక్కొచ్చి మంచంమీద పండుకోబెట్టి నిద్రపొమ్మని చెప్పింది.

దేవదాసు పట్టుకుపోయిన గొంతుతో—'ఇంకా వేరే ఆశ లేమైనా ఉన్నాయా ఏమిటి? నేను ముందుగానే చెప్పాను—జేబు ఖాళీ. లాభంలేదని—తెలిసిందా, సుందరీ?' అన్నాడు.

సుందరి తెలుసుకుని—'రేపు ఇద్దురుగానిలే!' అన్నది.

'అంత నమ్మకం మంచిది కాదు. ఏమి కావాలో స్పష్టంగా చెప్పు.'

'రేపు విందురు గాని' అని చంద్రముఖి పక్క గదిలోకి వెళ్ళిపోయింది.

దేవదాసుకు నిద్ర తెలిసేవరకు చాలా ప్రొద్దు యెక్కింది. గదిలో ఎవ్వరూలేరు—చంద్రముఖి స్నానం చేసి వంట చేస్తూ ఉన్నది. దేవదాసు ఒకమాటు గది అంతా పరికించాడు. ఒక్క వస్తువును కూడా అతను గుర్తించలేకపోయాడు. క్రిందటి రాత్రి సంగతులు కూడా అతని కేమీ జ్ఞాపకం లేవు; ఎవరో మనసారా చేసిన పరిచర్య మాత్రం జ్ఞాపకం ఉన్నది—ఎవరో అతన్ని మహాప్రేమతో తీసుకువచ్చి నిద్ర పుచ్చటం లీలగా తోస్తున్నది.

ఇంతలో చంద్రముఖి గదిలోకి వచ్చింది. అలంకరణలో రాత్రికీ ఇప్పటికీ ఆమెలో చాలామార్పు కనిపించింది. నగ లేమీ తీసివేయలేదు; కాని తల దువ్వ లేదు. అద్దకంచీరె కట్టలేదు. తాంబూలం వేయలేదు. మామూలు సాదాచీరె కట్టుకున్నది.

దేవదాసు ఆమెముఖంవంక చూసి నవ్వి—'నిన్న నువ్వు నన్ను ఎక్కడ నుంచి దోచుకొచ్చావు?' అని అడిగాడు.

'దోచుకు రాలేదు. దోవలో పడివుంటే ఎత్తుకువచ్చాను.'

దేవదాసు గంభీరంగా—'సరే ఎలాగైతేనేం తెచ్చావు. కాని, ఏమిటి మళ్ళీ ఈ వేషం? ఒంటిమీద నగలు పట్టటంలేదు. ఎవరిచ్చారు?' అన్నాడు.

చంద్రముఖి దేవదాసువంక తీక్షణంగా చూసి—'మళ్ళీ?' అన్నది.

దేవదాసు నవ్వుతూ—'ఉహుఁ—అదికాదు. కాస్త సరసం ఆడితే తప్పా! ఎప్పుడొచ్చావు'? అన్నాడు.

'నెలా పదిహేను రోజులైంది'

దేవదాసు మనసులో లెఖ్ఖ వేసుకొని—'మా ఇంటిదగ్గరనుంచి ఇటే వచ్చావా?' అన్నాడు.

చంద్రముఖికి ఆశ్చర్యం కలిగింది.

'మీ ఇంటికి వెళ్ళానని ఎలా తెలుసుకున్నారు?'

'నువ్వెళ్ళిన రెండురోజులకు నేను ఇంటికి వెళ్ళాను. నిన్ను మా వదినె దగ్గరికి తీసుకువెళ్ళిన దాసీ, మొన్న అశ్వద్ధపురంనుంచి చక్కని స్త్రీ ఒకతె వచ్చిందని చెప్పింది. ఇక తెలుసుకోవడం ఏమి కష్టం? సరే కాని ఇన్నినగలు ఎందుకు చేయించావు?'

'చేయించలేదు. ఇవన్నీ గిల్టువి, కలకత్తావచ్చి కొన్నాను. చూడండి, మళ్ళీ మీమూలాన ఎంత ఖర్చు పెట్టవలసి వచ్చిందో? ఇంతకూ మీరు నన్ను గుర్తించనే లేకపోయారు!'

దేవదాసు పకపకనవ్వి—'ఉహుఁ. బొత్తిగా! కాని నీ పరిచర్య మాత్రం గుర్తించాను. చంద్రముఖి తప్ప నాకింత పరిచర్య ఎవరు చేస్తారని చాలాసార్లు అనుకున్నాను.'

చంద్రముఖి ఆనందం పట్టలేక ఏడవా లనుకున్నది. కొంచెంసేపు మౌనంగా ఉండి—'మీరు నన్ను పూర్వంమాదిరిగా అసహ్యించుకోవటంలేదు కదూ?' అని అడిగింది.

'లేదు, పైగా ప్రేమిస్తున్నాను.'

మధ్యాహ్నం దేవదాసు స్నానంచేసేటప్పుడు, అతని పొట్టమీద ప్లానలుగుడ్డ కట్టి ఉండటంచూసి చంద్రముఖి భయపడుతూ-'అదేమిటి! ప్లానలు కట్టారెందుకు?' అని అడిగింది.

'నీకింత అదుర్దా ఎందుకు? కడుపులో కొంచెం నొప్పిగా ఉన్నది.'

చంద్రముఖి తల బాదుకుని—'కొంపముంచి లివరు జబ్బు కాదుగదా?' అన్నది.

'అలాగే కనపడుతున్నది; చంద్రముఖీ!' అన్నాడు దేవదాసు.

ఆరోజుననే డాక్టరువచ్చి చాలాసేపు పరీక్షించి ఈ సందేహమే వెలిబుచ్చాడు. మందిచ్చి చాలా జాగ్రత్తగా ఉండకపోతే ప్రమాదంచేయవచ్చని హెచ్చరించాడు. దీని అర్థం ఇద్దరూ గ్రహించారు; దేవదాసు బసకు కబురుచేసి ధర్మదాసును పిలిపించాడు! చికిత్సకోసం డబ్బుకూడా తెప్పించాడు. రెండురోజు లిలా గడిచినవి. మూడోనాడు దేవదాసుకు జ్వరం తగిలింది. చంద్రముఖిని పిలిచి—'మంచి అదనులో వచ్చావు. లేకపోతే నిన్నుచూసేవాణ్ణి కాను' అన్నాడు.



చంద్రముఖి కళ్లుతుడుచుకుని ప్రాణాలుఒడ్డి సేవచేయ నారంభించింది. 'వారి అవసరానికి అక్కరకువస్తానని అనుకోలేదు—దేవదాసుకు ఆరోగ్యం కలిగించు!' అని భగవంతుని ఉద్దేశించి ప్రార్థించింది. దేవదాసు ఒకమాసంకంటె ఎక్కువే మంచంలో ఉన్నాడు. తర్వాత నెమ్మదిగా అతని జబ్బు తిరుగుముఖం పెట్టింది—ప్రమాదస్థితికి రాలేదు.

ఒకనాడు దేవదాసు చంద్రముఖితో—'చంద్రముఖీ! నీ పేరు చాలా పెద్దది. ఎప్పుడూ పిలవాలంటే చాలా ఇబ్బందిగా ఉన్నది—కొంచెం చిన్నది చేయాలనుకుంటున్నాను' అన్నాడు.

'మంచిదేగా' అన్నది చంద్రముఖి.

'అయితే, ఇవ్వాళనుంచి నేను నిన్ను 'అమ్మీ' అని పిలుస్తాను.

చంద్రముఖి నవ్వి-'అలాగే పిలవండి, కాని పిలుపుకి అర్థముండాలిగా!' అన్నది.

'అన్నిమాటలకూ అర్థముంటుందా? అది నా అభిలాష.'

'అంత అభిలాషగా ఉంటే పిలవండి. కాని ఆ అభిలాష ఎందుకో చెప్తారా?'

'ఊహుఁ, అది నువ్వెప్పుడూ అడగకూడదు.'

'అలాగే; అడగనులెండి.' అని చంద్రముఖి ముఖం చాటుచేసుకున్నది.

దేవదాసు చాలాసేపు మాట్లాడకుండా ఉండి అకస్మాత్తుగా-'సరే! అమ్మి, నువ్వు నా కెవ్వరని ఇంత ప్రాణప్రదంగా సేవ చేస్తున్నావు?' అని గంభీరంగా అడిగాడు.

చంద్రముఖి కొత్తపెళ్లికూతురూ కాదు, వాక్పటుత్వం లేని బాలికా కాదు. దేవదాసు ముఖంవంక రెప్పవాల్చకుండా, శాంతంగా చూస్తూ-'మీరే నా సర్వస్వం—ఇంతవరకు మీరు తెలుసుకోనేలేదా' అన్నది, గద్గదస్వరంతో.

దేవదాసు గోడవంక దృష్టి మరల్చి మెల్లగా—'తెలుసుకున్నాను. కాని నాకిది ఏమీ ఆనందం కలిగించటం లేదు. పార్వతిని నే నెంత ప్రేమించేవాడిని. ఆమె న న్నెంత ప్రేమించేది. అయినా ఎన్ని చిక్కులు? అనేక కష్టాలు అనుభవించినమీదట ఇక ఈ ఉచ్చుల్లో కాలు పెట్టకూడదని స్థిరపరచుకొన్నాను: నా ఇష్టంతో పెట్టనూ లేదు. కాని నువ్విలా ఎందుకు చేశావు? బలవంతాన న న్నెందుకు బంధించావు?' అని కాసేపు ఊరుకుని—'అమ్మి? నన్ను ప్రేమిస్తే నువ్వుకూడా పార్వతిమాదిరిగా కష్టాల పాలవుతావు!' అన్నాడు.

చంద్రముఖి చెరుగుతో ముఖం కప్పుకుని మంచానికి ఒక్క పక్కన కూచున్నది. దేవదాసు మరల మెల్లగా చెప్ప నారంభించాడు:

'మీ ఇద్దరిలో ఎంత భేదమున్నది; ఎంత సామ్యమున్నది. ఒకరిలో ఎంత ఉద్ధృతం, ఎంత అభిమానం; రెండవవారిలో ఎంత శాంతం, ఎంత నిగ్రహం. ఆమెలో ఎంతమాత్రం సహనంలేదు; ఇక నీలో ఎంత సహనశక్తి. ఆమెకు ఎంత కీర్తి; నీ కెంత కళంకం. ఆమెను అందరూ ప్రేమించేవారే; ఇక నిన్ను అందరూ అసహ్యించుకునేవారే! అయినా నేను నిన్ను ప్రేమిస్తున్నాను; ఎందుకు ప్రేమించను?' అని దేవదాసు నిట్టూర్చి మళ్లీ చెప్ప నారంభించాడు: 'పాప పుణ్యాలను విచారించే భగవంతుడు నీకేమి శిక్ష విధిస్తాడో నాకు తెలియదు. కాని చనిపోయిన తర్వాత మళ్లీ మన మిద్దరం కలుసుకోవటం సంభవిస్తే, నిన్ను విడిచిపెట్టి ఉండను.'

చంద్రముఖి లోలోపల హృదయం కరిగిపోయేటట్టు ఏడ్చింది—'ఏ జన్మలోనైనా, ఎప్పటికైనా ఈ పాపిష్టురాలి పాపం పరిహారమైతే నాకీ వరమే అనుగ్రహించు భగవంతుడా!' అని దేవుని ఉద్దేశించి మనస్సులో ప్రార్థించింది. (సశేషం)



# ఉబ్బసము నివారించును



## శ్వాసహరినే వాడండి తప్పక

ఐదునిమిషములలో ఉపశాంతి, ఒక్క రాత్రిలో వ్యాధి కుదురును అనేదంతా మోసం.

ఉబ్బసం, ఊపిరితిత్తుల వ్యాధులు, ఊపిరి సలపకపోవుట మొదలైనవాటికి పురోహిత్ శ్వాసహరి సరియైన ఔషధ మని వైద్యులు మరిమరి చెప్పుతూ యుంటారు. మీరు కడుపునిండా భుజిస్తారు. చక్కగా జీర్ణం చేసుకొనెదరు. సుఖంగా నిద్రపోయెదరు. క్రమేణా ఆరోగ్యాభివృద్ధి కలుగుతుంది. మీ ఊపిరితిత్తులకు బలం చేకూరుతుంది. ఉబ్బసము యిక మీ దరికి చేరదు.

ఇది రు. 3-8-0, 6-0-0, 10-0-0ల ధరలలో. 3, 6, 12 ఔన్సులలో అన్ని మందుషాపులలో కాని లేక ఈక్రిందివారి వద్దకాని దొరకును.

మద్రాసు స్టాకిస్టులు :

హేల్ అండ్ కంపెనీ, కెమిస్టులు,
1/288, ఎస్ప్లనేడ్, జి. టి. మదరాసు.

వాణి ఫార్మసీ, కెమిస్టులు,
త్యాగరాయనగర్, మదరాసు.


త్యాగరాయ మెడికల్ హాల్,
త్యాగరాయనగర్, మదరాసు.

*ఉబ్బసాన్ని పోగొట్టేందుకు డాక్టర్ల మంచి మందు శ్వాసహరి*



**పురోహిత్ శ్వాసహరి**

**DR. PUROHIT PHARMACY, KOLHAPUR**




పండిత డి. గోపాలాచార్యులవారి

# అరుణ

గర్భాశయ రోగ నివారిణి

Golden Jubilee 1898 - 1948

ఆరోగ్యమే సౌందర్యం. నిశ్చింతమైన ఆరోగ్య జీవనము ప్రతిస్త్రీకి జన్మ హక్కు. ఋతుదోష నివారిణి 'అరుణ' విశ్వసనీయమైన స్త్రీజన మిత్రము. స్త్రీలకు ప్రత్యేకమగు వ్యాధులన్నింటిని పారద్రోలి వారికి ఆరోగ్య ఆనంద జీవనమును ప్రసాదిస్తున్నది. ఏబదియేండ్ల అనుభవ బలముగల 'అరుణ' మీకు అండగా నిలుచును గాక.



**ఆయుర్వేదాశ్రమం లిమిటెడ్**
(స్థాపితము 1898)
మద్రాసు. 17



# వాహిని

ఉత్తమ చిత్రాన్ని చూడదలచినపుడు
వాహినీ చిత్రాల్ని మరచి పోకండి.

యోగి వేమన..
స్వర్గసీమ......
భక్త పోతన ...
దేవత ........
సుమంగళి.....
వందేమాతరమ్

**THE VAUHINI PICTURES LIMITED**

MADRAS BEZWADA TADPATRI


THE B. N. K. PRESS, MADRAS-1